ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
6-6-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 125 పేజీలు: 10+4 వెల: 6.50

అమరావతిలో భూములు, ఆస్తులకు ప్రత్యేక నంబర్లు 2లో

19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు 5లో

# 175 చోట్ల నగర వనాలు


గురువారం పర్యావరణ పరిరక్షణపై ప్రమాణం చేస్తున్న సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, మంత్రులు

## చెట్లు పెంచనివారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?

### ఒకే రోజున రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు

### అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్‌తో కలిసి మొక్కలు నాటిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో ఐదు కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. రాజధాని అమరావతి పరిధిలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంనిర్వహించారు. అనంతవరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేష్‌లు ప్రమాణం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాఠశాల విద్యార్థిని ప్రమాణం చేయించింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. మొన్నటివరకు వనజీవి రామయ్యను చూశామని.. ఆయన లేకపోయినా ఇప్పుడు నల్లమల పరిరక్షణ కోసం అంకారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతున్నామని తెలిపారు.
పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని.. దీని పర్యావసానంగా ఇతర ప్రాంతాల్లో కూడా గ్రీన్ కవర్ పెరుగుతోందన్నారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వానికి చెట్ల వల్ల ఉపయోగం తెలియదని.. వారికి చెట్లు నరకడం తప్ప చెట్లు పెట్టడం తెలియదని విమర్శించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో వెళితే కింద రోడ్డుపై చెట్లు నరికేవారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వస్తుంటే ఎక్కడైనా ఒక్క చెట్టు తాము నరుకుతున్నామా అని ప్రశ్నించారు. కొన్ని దేశాల్లో చెట్లు నరికితే శాశ్వతంగా జైల్లో పెడతారన్నారు. చెట్లు నరికితే మనిషిని చంపినట్టే అని కొన్ని దేశాల్లో చట్టాలుకూడా ఉన్నాయన్నారు. నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37 శాతం గ్రీన్ కవర్ రావాల్సి >>2



గురువారం ఎన్‌కౌంటర్‌లో హతమైన సుధాకర్ (ఫైల్)

## మావోయిస్టు అగ్రనేత సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో హతం

### ఒక్కొక్కరుగా రాలుతున్న కేంద్ర కమిటీ సభ్యులు

### సుధాకర్ మృతిని ధ్రువీకరించిన బస్తర్ ఐజి సుందర్ రాజ్

**చర్ల , జూన్ 5 (ప్రభాతవార్త):** ఆపరేషన్ కగార్‌ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉధృతం చేసాయి. 2026 మార్చి 31 మావోయిస్టుల అంతమే లక్ష్యంగా చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అడుజాడల్లో భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో వరుస ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. తాజాగా నేషనల్ పార్క్ ఏరియాలో గురువారం జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కేంద్రకమిటి సభ్యుడు టెంట్ లక్షీ ౣ నర సింహాచలం ఆలియాస్ సుధాకర్ (65) మృతిచెందారు. ఇతనిపై కోటి రూపాయల రివార్డు ఉన్నట్లు సమాచారం. ఇతని స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రొగడవరం గ్రామం. తండ్రి రామకృష్ణ నాయుడు. సుమారు మూడు దశాబ్దాల ఉద్యమ ప్రస్థానంలో అనేక హోదాల్లో పనిచేసి కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు. ప్రస్తుతం ఉన్న >>2

## నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

### ఇద్దరు మృతి, 9 మందికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

**ఆత్మకూరు (నెల్లూరు), జూన్ 5, ప్రభాతవార్త :** ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరుజిల్లా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఒక కారు-ఆటో ఢీకొన్న సంఘటనలో ఆటోలోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా మరో 7మందికి తీవ్రగాయాలైనాయి. కారులోఉన్న ఇద్దరికికూడా గాయాలైనాయి. మొత్తంగా 9మంది గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఆత్మకూరు పోలీసులు, వెంకట్రావుపల్లి గ్రామస్తుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మున్సిపల్‌పరిధిలోని 2వవార్డు అయిన వెంకట్రావుపల్లికి చెందిన >>2


కర్ణాటక హైకోర్టు


పోలీస్ కమిషనర్ దయానంద్

## తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ

### బెంగళూరు పోలీసు కమిషనర్, డిసిపి సస్పెన్షన్

### సుమోటోగా కేసు విచారణకు స్వీకరించిన కర్ణాటక హైకోర్టు

### కెసిఎ సభ్యులు, ఆర్సీబీ ఈవెంట్ మేనేజర్లపైనా కేసులు

### మృతుల కుటుంబాలకు ఆర్సీబీ రూ. 10 లక్షలు పరిహారం

**బెంగళూరు, జూన్ 5:** ఐపిఎల్‌ఛాంపియన్ టీమ్ ఆర్సీబీ విక్టరీ పెరేడ్‌లో నెలకొన్న విషాదంపై సమగ్ర విచారణకోసం కర్ణాటక ప్రభుత్వం సిఐడి విచారణకు ఆదేశించింది. నగరంలోని చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటకు సంబంధించి మరోవైపు హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించింది. అంతేకాకుండా సంఘటనకు బాధ్యులుగా బెంగళూరు నగర కమిషనర్ దయానంద్‌ను సస్పెండ్‌చేస్తూ సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. అలాగే అదనపు కమిషనర్, ఆప్రాంత డిప్యూటికమిషనర్లను స్పెండ్‌చేస్తున్నట్లు ముఖ్యమంత్రిప్రకటించారు. భారీ సంఖ్యలో >>2

## బీచ్ ఫెస్టివల్ ఆరంభం


గురువారం బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు దుర్గేష్, రవీంద్ర తదితరులు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించిన మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర

### నాలుగు రోజులు జరుగనున్న వేడుకలు

**విజయవాడ జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మసులా బీచ్ ఫెస్టివల్-2025 ఘనంగా ప్రారంభమైంది. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మైన్స్ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు బీచ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. తొలుత బీచ్ ముఖ ద్వారంవద్ద ఏర్పాటు చేసిన గేట్ వే ఆఫ్ అమరావతి ఐకానిక్‌టవర్‌ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటుచేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. బీచ్ ఫెస్టివల్‌కు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ బీచ్ ఫెస్టివల్‌ను 4 రోజులపాటు నిర్వహించనున్నారు.

**బీచ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం:**
మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఇక్కడికి వచ్చిన తరువాత చూస్తే చాలా సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను 100 అడుగుల మేర ఆవిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. అఖండ గోదావరి కార్యక్రమం చేస్తున్నామని రూ.97 కోట్లతో సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో 5 పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాజెక్టులు ఇస్తామని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. ఆ 5 ప్రాజెక్టుల్లో మచిలీపట్నం బీచ్‌ను పొందుపరుస్తామన్నారు. మంగినపూడి బీచ్ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.
బీస్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ,కాగిత కృష్ణ ప్రసాద్, డిసి ఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు పాల్గొన్నారు. తొలుత బీచ్ ముఖ్య ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గేట్‌వే ఆఫ్ అమరావతి ఐకానిక్‌టవర్‌ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం 100 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
నాలుగు రోజుపాటు నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌కు అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో ఇంత పెద్ద బీచ్ ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని మంత్రి కొల్లు >>2



## పోలీస్ కస్టడీలో మాజీ మంత్రి కాకాణి

**నెల్లూరు రూరల్, జూన్ 5, ప్రభాతవార్త:** అక్రమ మైనింగ్‌కేసు ఆరోపణలతో అరెస్టు అయిన మాజీ మంత్రి వైఎస్‌ఆర్సీ జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అరెస్ట్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం అందరికీ తెలిసిందే అయితే గురువారం కోర్టులో విచారణ జరిపిన నెల్లూరు అదనపు 5వ మెజిస్ట్రేట్ కోర్టులో కాకాని గోవర్ధన్ రెడ్డి బిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. బెయిల్ పిటిషన్ వాయిదావేస్తూ పోలీస్ కస్టడీలోకి మాజీమంత్రి కాకానిని అప్పగిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. 6వ తేదీఉదయం 10:30 నుండి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కస్టడీలోకి తీసుకొని కాకానితరపు న్యాయవాదుల సమక్షంలో విచారణ జరపాలని జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారించేందుకు ప్రభుత్వం తరపు గుంటూరు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రాజేంద్రప్రసాద్ కోర్టులో వాదనలు వినిపించారు.

## కదులుతున్న 'కల్తీనెయ్యి' డొంక



### సిట్ దర్యాప్తులో మరిన్ని సాక్ష్యాధారాలు లభ్యం

### టిటిడి ఉద్యోగుల సమాచారం ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు

**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన పాపంలో సిబిఐ సిట్ అధికారులు మరింత కీలకసమాచారం సేకరించడంతో సూత్రధారులను పట్టుకునే దిశగా చర్యలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి బాగోతంలో ఉత్తరాఖండ్ బోలేబాబా డెయిరీకిచెందిన షోమిల్‌జైన్‌కు అనుచరుడుగా ఉన్న కోల్‌కతాలో నూనెల పరిశ్రమ నడుపుకుంటున్న పారిశ్రామికవేత్త జ్యోతిష్యను సిట్ విచారణ చేస్తోంది. అయితే అవసరం మేరకు కొన్ని రకాల నూనెలు సరఫరా చేసినట్లు వివరాలు రాబట్టినా దీనికి సంబంధించి ఎక్కడా నగదు లావాదేవీలు జరగలేదనేది సిట్ రాబట్టిన సమాచారం. రెండు రోజులుగా తిరుపతి అలిపిరిలోని తాత్కాలిక సిట్ కార్యాలయంలో మాజీఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి వ్యక్తిగత సహాయకుడు (పిఎ)అప్పన్న నుండి కొంత సమాచారం సేకరించిన సిట్ అధికారులు తదుపరి ముగ్గురు ప్రముఖులను విచారణకు తాఖీదులు పంపనున్నారు.
ఇదే జరిగితే కల్తీనెయ్యిలో అసలు సూత్రధారులు బాగోతం వెలుగుచూడనుందనేది టిటిడిలో సంచలనంగా మారింది. గతంలోనే బోలేబాబా డైరీ, ఏఆర్‌డైరీ, వైష్ణవిడైరీలకు సంబంధించి 15మంది వరకు ముఖ్యులైన మేనేజర్ల నుండి అధికారులు, ల్యాబ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్‌లు, అధికారులు, సిబ్బందిని సిట్ అరెస్టుచేసింది. టిటిడికి గత మూడునాలుగేళ్లలో నెయ్యిసరఫరాకు సంబంధించి అనుమతిలిచ్చిన అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పుడు బయటకు రానుంది.
ఇప్పటికే కల్తీనెయ్యిలో నిందితులు ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్‌తోబాటు సరఫరాదారులు ఉత్తర ప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, షోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్ కాంత్ టచావ్దాలను కస్టడీకి తీసుకుని కీలకమైన ఆధారాలు రాబట్టింది. ఈ డైరీలకు కాంట్రాక్టు ఎలాకేటాయించారు, నెయ్యిసరఫరాలో ఏదేని మతలబు చేశారనేది ఈకల్తీపాపంలో కీలక సూత్ర ధారులను తేల్చేపనిలో సిబిఐ సిట్ >>2

## నేటి నుంచి మెగా డిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు

### కేంద్రాలను గుర్తించేలా ఫ్లెక్సీల ఏర్పాటు

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని డిఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ప్రకటించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు 90 నిముషాలు ముందుగానే చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలను గుర్తించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామని, ఎండల తీవ్రత దృష్ట్యా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరుగకుండా పోలీసు భద్రత ఉంటుందని వెల్లడించారు.
ఈ నెల 6నుంచి 154 కేంద్రాల్లో ప్రారంభం కానున్న మెగాడిఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ అన్నిఏర్పాట్లూ పూర్తి చేసింది. రోజుకు రెండు విడతలుగా ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఆగస్టు రెండో వారం నాటికి ఉపాధ్యాయుల ఎంపిక పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది హాల్ టిక్కెట్లలో ఏమైనా తప్పులుంటే వాటికి సంబంధించిన గుర్తింపు కార్డులను పరీక్షా కేంద్రాల వద్ద సమర్పిస్తేనే వాటిని సరి చేస్తారు. తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేది, కులం తదితర వివరాలు తప్పుగా నమోదైతే దీనికి సంబంధించిన ఆధారాలను చూపిస్తే నామినల్ రోల్స్‌లో సరి చేస్తారు.
హాల్ టికెట్‌లో ఫొటో లేకపోతే అభ్యర్థులు ఒకరు చొప్పున సాంకేతిక సహాయకులు ఉంటారు. పరీక్షా సమయంలో కంప్యూటర్‌లో ఏమైనా ఇబ్బందులు వస్తే వారు సరి చేస్తారు. రెండు చేతులూ లేని దివ్యాంగులు, దృష్టిలోపం ఉన్న వారికి పరీక్ష రాసేందుకు సహాయకులను ఏర్పాటుచేస్తారు. పదో తరగతి విద్యార్థులను సహాయకులుగా ఏర్పాటు చేస్తారు. స్క్రైబ్ కోసం ధరఖాస్తు >>2


డ్రగ్స్ కేసు వివరాలను మీడియాకు వివరిస్తున్న డిసిపి సరిత

## బెజవాడలో డ్రగ్స్ కలకలం

### 33 గ్రాముల ఎంఇటిహెచ్ డ్రగ్ స్వాధీనం

**విజయవాడ క్రైం,జూన్ 5,ప్రభాతవార్త:** బెజవాడలో డ్రగ్స్ పట్టుకోవడం కలకలం సృష్టించింది. సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డిసిపి కెజివి సరిత నేతృత్వంలో సెంట్రల్ ఎసిపి దామోదార్ పర్యవేక్షణలో పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామవరప్పాడు వద్ద వాహనాల తనిఖీలలో భాగంగా పటమట పోలీస్‌స్టేషన్ సిఐ పవన్ కిషోర్, ఎస్ఐ దుర్గాదేవి వారి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేసారు. ఈ నేపథ్యంలో రామవరప్పాడు ఫ్లై ఓవర్ వైపు నుండి విజయవాడ వైపుకు వెళ్తున్న ఎరుపు రంగు ఓలా, నీలం రంగు చేతక్ బైక్ లను ఆపి తనిఖీ చేసారు. సదరు వాహనాలపై సుమారు 20 నుండి 30 సంవత్సరాల వయస్సు కల్గిన ముగ్గురు వ్యక్తులను పట్టుకుని విచారించగా, సదరు బైకల డిక్కీలలో డ్రగ్స్ పట్టుబడటం సంచలనం కలిగించింది. ఆ బైకల డిక్కీలలో వైట్ కలర్ క్రిస్టల్ ఎంఇటిహెచ్ డ్రగ్స్ పాకెట్లు-2, పర్పుల్ కలర్ క్రిస్టల్ ఎంఇటిహెచ్ డ్రగ్స్ పాకెట్-1, రెడ్ కలర్ క్రిస్టల్ ఎంఇటిహెచ్ డ్రగ్స్ పాకెట్-1లలో మొత్తం సుమారు 33 గ్రాముల ఎంఇటిహెచ్ డ్రగ్స్, 7 సెల్‌ఫోన్లను సాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. విచారణలో సదరు నిందితులు ఆ డ్రగ్స్‌ను నూజివీడుకు చెందిన మనోహర్ అనే వ్యక్తి ద్వారా ఢిల్లీకి చెందిన రింకు నుండి ట్రాక్ ఆన్, డిటిడిసి కొరియర్ల ద్వారా దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులైన పెనమలూరు మండలం, సనత్‌నగర్, రామాలయం స్ట్రీట్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్ అలియాస్ కిన్ను, ఫన్‌టైమ్స్ రోడ్, టీచర్స్ కాలనీ బొంతు నితీశ్ కుమార్ అలియాస్ బబ్బు, యనమలకుదురుకు చెందిన తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌లను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరి కొంత మందిని అరెస్ట్ చేయాల్సి ఉంది.



గురువారం అనంతవరం గ్రామంలో మొక్కను నాటిన సిఎం చంద్రబాబు

# 175 చోట్ల నగర వనాలు

>> ఉందన్నారు. జీవితంలో 10 చెట్లు కంటే ఎక్కువ పెట్టి పెంచుతున్నవారు ఉన్నారని.. అసలు చెట్లు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది అని సీఎం చంద్రబాబు నిలదీశారు. రాఖీలు కట్టే చెల్లెమ్మలకు ఇకపై అన్న నక్షత్రం పేరుకు తగ్గట్టుగా విత్తనాలు ఇస్తామన్నారు. ఈ ఏడాదిలోనే ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చూడతామని తెలిపారు. నక్షత్రం చూసుకుని అన్నకు రాఖీ కడితే చెట్ల పెంపకానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఇంట్లో రూఫ్ టాప్ గార్డెన్ లేదా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలుఉన్నాయన్నారు. ఎర్రచందనంతో పాటు నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని చెప్పుకొచ్చారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని.. వచ్చే మూడేళ్లలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు వస్తున్నాయన్నారు.175 నియోజక వర్గాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ప్రకృతి అంటే ఏ ఒక్కరి సొత్తూ కాదు.. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉంది. అడవులను కాపాడుకోవడం, జలవనరులను సంరక్షించుకోవడం మన కర్తవ్యం. అందుకే ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నేడు ఒక్కరోజే 1 కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతున్నా. మంచి పరిసరాలు ఉంటేనే మంచి ఆరోగ్యం ఉంటుంది. అందుకే స్వచ్ఛ భారత్‌లో భాగంగా మనం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. చెత్తను ఇంధనంగా మారుస్తూ ప్రకృతిని కాపాడుతున్నాం. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ప్లాస్టిక్ పొల్యూషన్ నిర్మూలన అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి మన వంతు బాధ్యతగా పనిచేద్దాం. పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకుందాం. మొక్కలు నాటిన తరువాత పర్యావరణ పరిరక్షణపై కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కి తీసుకుంటున్న చర్యలను కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సీఎంకు వివరించారు. రీసైక్లింగ్ అంశంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని చంద్రబాబు సూచించారు. రీసైక్లింగ్‌పై ప్రత్యేక పాలసీ తీసుకురావాలని సిఎం ఆదేశించారు. నల్లమల అడవుల్లో విలువైన మూలికలు ఉన్నాయని, ఎర్రచందనంతో పాటు నల్లమల అడవులలో ఉన్న వనమూలికలనూ కాపాడుకోవాలని దిశానిర్దేశం చేశారు.

**భవిష్యత్తు తరాలకు స్వచ్ఛంధంగా అందించే ఆస్తులు మొక్కలే: డి.సిఎం పవన్**

భవిష్యత్తు తరాలకు మనం స్వచ్ఛంధంగా అందించే ఆస్తులు మొక్కలేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.కోటి మొక్కలు నాటి.. వాటిని సంరక్షించడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అడవిలో కార్చిచుల నివారణకు, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తానని అన్నారు. మానవ జీవితంలో ప్రకృతికి ఎంతో ప్రాధాన్యం ఉందని తెలిపారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు మొక్కలు, చెట్లు ఆనవాళ్లుగా ఉన్నాయని వెల్లడించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్.

నల్లమడల అడవుల్లో పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తున్న కొండలరావును ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ప్రశంసనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చెట్టులేని జీవితాన్ని ఊహించలేమని, ఒకప్పుడు ఇంటి చిరునామాకు చెట్లే ఆనవాళ్లుగా ఉండేవని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు కానీ, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సిఎంగా ఉన్నారని చెప్పారు. అడవిలో కార్చిచుల నివారణకు కృషి చేస్తానన్నారు. 50 శాతం పచ్చదనం లక్ష్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ తలమానికంగా ఉండాలని ఆకాక్షించారు.. ఇక, అందరికి మనస్ఫూర్తిగా పర్యావరణ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.

# ఆన్‌లైన్ పరీక్షలు

>> చేసుకున్న వారు 1300 మంది వరకూ ఉన్నారు. ఒకవేళ ధరఖాస్తులో స్క్రైబ్ కావాలని పేర్కొనకపోయినా అవసరమైతే డిఇఒ పరిశీలించి, ఏర్పాటు చేస్తారు. వీరికి అదనంగా 50 నిముషాలు సమయంఉంటుంది.రాష్ట్ర వ్యాప్తంగా 3,35,401 మంది అభ్యర్థులు అన్ని పోస్టులకు కలిపి 5,77,417 ధరఖాస్తులు సమర్పించారు. ఇప్పటి వరకు 3.04 లక్షల మంది హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోని వారి ఫోన్లకు సంక్షిప్త సందేశాలు పంపిస్తున్నారు. పోస్టులకు సంబంధించిన మొత్తం పరీక్షలు పూర్తయిన తర్వాత మరుసటి రోజు ప్రాథమిక 'కీ' విడుదల చేస్తారు. ఆ తర్వాత అభ్యంతరాల స్వీకరణకు వారం రోజులు గడువు ఇస్తారు. ధరఖాస్తుల సమయంలోనే పోస్టులకు ప్రాధాన్యత తీసుకున్నందున అభ్యర్థులకు వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

# 'కల్తీనెయ్యి' డొంక

>> అధికారులు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. గత ఏడాది జూన్‌లోనే లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనేది గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబరేటరీ(పరిశోధనశాల)నుండి ఆధారాలు బయటకు వచ్చాయి.ఆ ఫలితాల్లో నెయ్యికల్తీ అయిన మాట వాస్తవమేనని,అయితే కొన్ని రకాల ఆహారపదార్థాల నూనెలు కలిపారనేది టిటిడి అధికారులు కూడా నివేదికలు వెల్లడించారు.గత ఏడాదిలోనే మూడుసార్లు కల్తీనెయ్యి సరఫరా జరిగిందని గుర్తించిన టిటిడి ఉన్నతాధికారులు తిరుమలలో నెయ్యి తీసుకోకుండా ఆ ట్యాంకర్లను వెనక్కుపంపిన విషయం విదితమే. ఆ ట్యాంకర్లలో నెయ్యి కల్తీ జరిగిందనేది ముందుగానే తేల్చేసిన టిటిడి అధికారులు ఏఆర్ డైరీ నెయ్యిట్యాంకర్లను తిప్పిపంపారు. మరీ జులైలో కల్తీనెయ్యి వ్యవహారం వెలుగుచూస్తే గత సెప్టెంబర్ వరకు ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదనేది ఇప్పుడు సిట్ ప్రధానంగా దృష్టి సారించింది. దీనివెనుక ఎవరి ప్రమేయం ఉంది. ఎందుకు మూడేళ్ళు మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించారనేది ఇప్పుడు సిట్ కీలక దర్యాప్తులో వెలుగుచూడనుంది.

# ఆగస్టు 15 కల్లా లక్షల బంగారు కుటుంబాల దత్తత

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**విజయవాడ.,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** జీరో పావర్టీ పి4 లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి 15 లక్షల కుటుం బాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన మార్గదర్శి రిజిస్ట్రేషన్,దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. నాడు ఆర్థిక సంస్కరణల తర్వాత చేపట్టిన పిపిపి విధానానికి కొనసాగింపుగానే నేడు పి4 విధానం తీసుకువచ్చామని అన్నారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో జీఓ పావర్టీ పి4పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి...స్మార్ట్ ఏపీ ఫౌండేషన్‌ను స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ మార్చాలని నిర్ధేశించారు. అమరావతి పి4కి కేస్ స్టడీగా నిలుస్తుందని, రాజధాని నిర్మాణంలో 29వేల మంది రైతులను భాగస్వాములు చేయడం ద్వారా వారికి సంపద సృష్టి జరిగేలా చేశామని చెప్పారు.



కర్గిజ్ రిపబ్లిక్ విదేశాంగ మంత్రి జీన్‌బెక్ కులుబెయెవ్ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన దృశ్యం

# అమరావతిలో ప్రతిష్టాత్మక న్యాయ వర్సిటీ

## బిసిఐ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు అడుగులు

## ఆర్డినెన్స్ జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో ప్రతిష్టాత్మక న్యాయ యూనివర్సిటీ ఏర్పాటు విషయంలో అడుగులు వేగంగా పడుతున్నాయి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ)కు చెందిన బిసిఐ ట్రస్ట్ ప్లె ఫస్ట్ అథ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు బిసిఐ ట్రస్ట్ ముందుకొచ్చిన విషయం విదితమే. బిసిఐ అధ్యక్షుడు,కీలక సభ్యులు ఇప్పటికే గవర్నర్ అబ్దుల్ నజీర్,ముఖ్యమంత్రి చంద్రబాబుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అమరావతిలో బిసిఐ నెలకొల్పబోయే న్యాయ యూనివర్సిటీలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆర్బిట్రేషన్ సెంటర్ సైతం ఏర్పాటు కానుంది. అంతేకాక న్యాయ,అనుబంధ రంగాల్లో ఉన్నత విద్యావకాశాల కల్పనకు నైపుణ్యాభివృద్ధికి ఈ యూనివర్సిటీ ఎంతో ఉపయోగపడుతుంది.బీసిఐ ట్రస్ట్ అథ్వర్యంలో బెంగుళూరులో 1986లో నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్‌యూ), 2022లో గోవాలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐయూఎల్ఇఆర్) ఏర్పాటు అయ్యాయి. అవి ఎంతో ప్రతిష్టాత్మక సంస్థలుగా ఖ్యాతి గడించాయి.

# పెట్టుబడి ప్రతిపాదనే పర్యవేక్షణ

## కార్యరూపంలోకి తెచ్చేందుకు పిఎంయు కమిటీ

## 20 లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ సమీక్ష

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమిప్రభుత్వం ఏడాదిలో రూ.9.20 లక్షలకోట్ల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు మంత్రి లోకేష్ తెలిపారు. వాటితో పాటు 1,19,580 చిన్న,మధ్య తరహా పరిశ్రమల ద్వారా రూ.13,895 కోట్ల పెట్టుబడులు వస్తాయన్నారు. 20 లక్షల ఉద్యోగాలు,ఉపాధి కల్పనపై మంత్రులు,అధికారులతో ఉండవల్లి లోని నివాసంలో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఈ పెట్టుబడులతో ఏర్పాటు చేసే పరిశ్రమల ద్వారా 8.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఎన్టీపీసీ,బిపిఎల్,రిలయన్స్,టాటాపవర్ వంటి సంస్థల కోసం ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్(పిఎంయూ)లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు అవసరమైన భూములు,మౌలిక సదుపాయాలు కల్పించాలి. విశాఖలో ఒబెరాయ్,వరుణ్ బీచ్ శాండ్స్ వంటి స్టార్ హోటళ్ళ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. బీసీసీఐ సహకారంతో అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మైదానం నిర్మాణానికి చర్యలు చేపట్టాలి. పారిశ్రామిక వేత్తలకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేందుకు వాట్సప్ గవర్నెన్స్‌తో అనుసంధానించాలి అని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ,దుర్గేష్,టిజి భరత్,కొండపల్లి శ్రీనివాస్,కొల్లు రవీంద్ర,గొట్టిపాటి రవికుమార్,పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే యోగా శిక్షణ తప్పని సరి చేసేలా చట్టం

## రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు

**విజయవాడ, జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:**ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్రకు నాంధి పలికేలా యోగా ప్రతి ఒక్కరి జీవన విధానం అయ్యేలా విద్యార్థి దశలోనే యోగా శిక్షణను తప్పని సరి చేసేలా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకూ యోగాను పాఠ్యాంశంగా చేసే అంశంపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామని ఆయన తెలిపారు. యోగాంధ్రా2025 కార్యక్రమంలో భాగంగా గురువారం అమరావతిలోని రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలో శాసన సభ ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మానవాళి యావత్తూ ఆరోగ్యంగా సుఖ శాంతులతో జీవనం సాగించాలనే సత్సంకల్పంతో భారతీయ ఋషులు ప్రపంచానికి అందజేసిన సనాతన కార్యక్రమం యోగా అన్నారు. అయితే నేటి ఆధునిక సమాజంలో మానవుడు యాంత్రిక జీవన విదానాన్ని అనుసరించడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించే యోగా కార్యక్రమం కనుమరుగు అయిపోతున్నదన్నారు.

ఈ యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నెల 21 న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటున్నారన్నారు. విశాఖపట్నం వేదికగా ఆర్.కె.బీచ్ నుండి భీమిలి వరకూ మరియు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఈ వేడుకల్లోనిర్వహించడం జరుగుచున్నదని, ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరుగుచున్నదన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్బంగా రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శ్రీకారంచుట్టారని, ఈకార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని, యోగాను అభ్యసిస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కె. రఘు రామకృష్ణ రాజు మాట్లాడుతూ పూర్వీకులు మనకు అందజేసిన యోగాభ్యాసాలు కాల క్రమీణ కనుమరుగు అయ్యే పరిస్థితులు ఏర్పాటు తున్నాయని, అటు వంటి ఉత్తమ ప్రక్రియలను తిరిగి సంగ్రహించే కార్యక్రమం రాష్ట్రంలో మొదలైందన్నారు. విద్యార్థి దశ నుండే యోగాను పాఠ్యాంశంగా చేర్చితే మంచి ఫలితాలు ఉంటాయని, అందుకు తగ్గట్టుగా చట్టాన్ని రూపొందించే అంశంపై దృష్టి సారించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గత నెల 21 నుండి ఈ నెల 21 వ తేదీ వరకు యోగాంధ్రా2025 కార్యక్రమాన్నిరాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ బారీ స్థాయిలో నిర్వహించడం జరుగుచున్నదని, ప్రజలు పెద్దఎత్తున ఈ శిక్షణాకార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేస్తున్నారన్నారు. ప్రపంచ దృష్టిన అకర్షించే విధంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21న విశాఖపట్నం ప్రధాన వేదికగా మరియు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిర్వహించే ఏర్పాట్లు చేయడం జరుగుచున్నదని, దేశ పధాని నరేంద్ర మోడీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. అనంతరం ఆయూష్ శాఖ నుండి వచ్చిన వైద్యాధికారులు డా.రామానందం, డా.రత్న ప్రియదర్శిని శాసన సభ ఉద్యోగులకు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, ఉపకార్యదర్శులు కె.రాజకుమార్, వనితా రాణి, అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.శ్రీనివాసరావు తదితరులతో పాటు శాసన ఉద్యోలు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అమరావతిలో భూములు, ఆస్తులకు ప్రత్యేక నంబర్లు

**విజయవాడ ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అమరావతి రాజధాని పరిధిలో ఆస్తుల చిట్టాను ఆధునీకరించనున్నారు. దీని కోసం జియోడేటా బేస్ ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రతి ఆస్తి, వ్యక్తులు, వారి ఆర్థికస్థితిగతులు, భూములకు సంబంధించిన సమగ్ర వివరాలూ ఇక సిఆర్‌డిఏ దగ్గర ఉండనున్నాయి. దీనికోసం సిఆర్‌డిఏ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది. డిజిటల్ అమరావతి పేరుతో ఈ సర్వే చేపట్టినా భవిష్యత్‌లో ఆస్తులకు సంబంధించిన నిర్వహణ, వాటిపన్నులు వంటి అంశాలు ఇందులో కీలకం కానున్నాయి. దీనికి తోడు ఆస్తివిలువ ఆధారంగా పన్నులు వసూలు చేసే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఇదే పద్ధతిని అమరావతిలోనూ అమలు చేయనున్నారు. దీనికోసం జియో డేటాబేస్‌ను రూపొందించనున్నారు. రాజధాని నిర్దేశిత ప్రాంతంలో ఉన్న వ్యక్తులు, వారి ఆస్తులు, నివాసాలు, భూమి ఇతర అంశాలకు సంబంధించిన అన్ని వివరాలనూ సమగ్రంగా ఈ డేటాలో ఉంచనున్నారు. దీనికోసం 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఒక గ్రిడ్‌గా రూపొందించనున్నారు. మొత్తంగా 60 చదరపు కిలో మీటర్ల నివాస ప్రాంతాలు, 160 చదరపు కిలోమీటర్ల భూములకు సంబంధించిన 30 అంశాలతో కూడిన సమాచారాని పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నారు. దీని ఆధారంగా భవిష్యత్ లావాదేవీలు నిర్వహిస్తారు. అలాగే ప్రతి వ్యక్తికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో చేర్చనున్నారు. ప్రస్తుతం ఉంటున్నవారు, కొత్తగా వచ్చేవారి వివరాలనూ ఎప్పటికప్పుడు ఆధునీకరించనున్నారు. ప్రస్తుతం ప్రపంచబ్యాంకు అప్పు తీసుకుంటున్న ప్రభుత్వం తిరిగి చెల్లింపుకు రాజధాని పరిధిలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రత్యేకంగా చూపించారు. దీనికోసం ఇప్పుడున్న 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న భూములు, ఆస్తుల వివరాలనూ డిజిటలైజ్ చేయనున్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న రోడ్లు, భవనాలు, వ్యక్తిగత ఆస్తులకు ప్రత్యేక నెంబర్లు కేటాయించనున్నారు. దీనికోసం మూడుదశల్లో డ్రోన్ సర్వే నిర్వహిస్తారు. మొత్తం సమాచారాన్ని భవిష్యత్ అవసరాలకు ఎలావినియోగించుకోవాలనే ప్రణాళికను రెండోదశలో చేపట్టనున్నారు. మొత్తం సర్వే పూర్తయిన తరువాత యూనిట్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్(యుఎల్ పిఐఎన్), యూనిక్ ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ నెంబరు(యుపిఐఎన్), డిజిటల్ డోర్ నెంబర్స్ (డిడిఎన్) కేటాయించనున్నారు. ఈసర్వేతో ప్రస్తుతం ఉన్నవీధుల వివరాలూ, డోర్ నెంబర్లు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రస్తుతం అమరావతికి నగరానికి ఎక్కడకెక్కడ ప్రవేశమార్గాలున్నాయి, 29 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న అన్నిరకాల నిర్మాణాలు, ఆస్తుల వివరాలనూ సమగ్రంగా సేకరించనున్నారు.

# తొక్కిసలాట ఘటనపై సిఐడి విచారణ

>> ఫ్యాన్స్ వస్తున్నందును ముందస్తు జాగ్రత్తగా మరింతగా బలగాలను పెంచి కట్టడిచేయడంలో విఫలం అయినట్లు సిద్ధరామయ్య సర్కారు భావించింది. తదుపరి ఆర్సీబీ, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లపైనా చర్యలుంటాయని దర్యాప్తు నివేదిక అందిన తర్వాత వారిపైనాచర్యలుంటాయన్నారు. ముందుగా వీరిని సస్పెండ్‌చేయడంతోపాటు కేసును సిఐడికి బదలీచేసింది.చిన్నస్వామి స్టేడియం ఇన్‌ఛార్జిపైనా చర్యలకు ఆదేశం.అలాగే ఆర్సీబీ ఈవెంట్ సంస్థ, ఆర్సీబీ ప్రతినిధిపైనా కేసులు నమోదుచేయాలని సిఎం సిద్ధరామయ్య ఆదేశాలు జారీచేసారు. ఈకేసులో మొత్తం ఐదుగురు పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటువేసారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ సభ్యులను కూడా అరెస్టుచేయాలని సిఎం ఆదేశించారు. అలాగే రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. సమగ్ర నివేదికను 30 రోజుల్లో అందచేయాలని నిర్దేశించామని సిఎం వెల్లడించారు. విజయోత్సవాలవేళ జరిగిన తొక్కిసలాట ఆపై మరణాలు, తీవ్ర గాయాలపాలయిన సంఘటనపై సమాచార హక్కు కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదుపై కబ్బన్‌పార్కు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసారు. ఆర్సీబి ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డిఎన్ఎ ఎంటర్‌టైన్‌మెంట్స్, కర్ణాటకక్రికెట్ అసోసియేషన్‌సహా తొక్కిసలాటతో సంబంధం ఉన్న అందరిపైనా కేసులునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. నేరపూరిత నిర్లక్ష్యం ఈకకేసులో సంస్థలను నిందితులుగాచేర్చింది. బిఎన్ఎస్‌లోని ఐదు సెక్షన్లకింద కేసులునమోదుచేసామన్నారు.

మరోవైపు ఈకేసు దర్యాప్తును సిఐడికి బదలీచేస్తున్నట్లు సిద్ధరామయ్య సర్కారుప్రకటించింది. కోర్టుకు ఇచ్చిన ప్రగతినివేదికలో కూడా స్పష్టంచేసింది. తదుపరి దర్యాప్తుకోసం సిట్ ఏర్పాటుకావాలన్న ఆదేశాలతోపాటు ఎఫ్ఐఆర్ కాపీని సిఐడికి అప్పగించింది. ఇప్పటికే మెజిస్టీరియల్ విచారణజరుపుతున్నామని తొక్కిసలాటకు కారణాలు, లోపాలు జవాబుదారీ తనం వంటి అంశాలు పరిశీలించేందుకు డిప్యూటి కమిషనర్ బెంగళూరు, జిల్లా మేజిస్ట్రేట్‌లో 15రోజుల్లోపు విచారణనివేదిక ఇస్తారని తెలిపింది. స్టేడియం వద్ద 2.5 లక్షలమంది గుమికూడారని, బెంగళూరు నగర పోలీసులు 1380, కెస్ఆర్‌పి ప్లాటూన్లు 325 మందిని మోహరించి భారీ బందోబస్తు ఏర్పాట్లుచేసామన్నారు. కానీ జనం భారీగా తరలిరావడంతో పలుగేట్లవద్ద తొక్కిసలాట జరిగి 11 మందిచనిపోయారని, 56 మంది గాయపడినట్లు వివరించింది. 1,6,7,17 నుంచి 21 గేట్లవద్దనే ప్రాణనష్టం జరిగింది. వైద్యసాయం వెంటనే అందించామని, క్షతగాత్రుల్లో 50 మంది ఔట్‌పేషెంట్లుగా చికిత్సపొందారని, మరో ఆరుగురికి ఇంకా చికిత్స జరుగుతోందని తెలిపింది. స్టేడియం వద్ద పోలీస్ సిబ్బందితోపాటు మూడు ఫైర్‌ఇంజన్లు, రెండు అంబులెన్స్‌లు, రెండు డి-స్వాట్ యూనిట్లు, ఒక నీటి ట్యాంకర్, కమాండ్ కంట్రోల్‌వాహనం ఏర్పాటుచేసినట్లు కోర్టుకు వివరించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం ప్రకటించామని, క్షతగాత్రుల వైద్యఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపింది. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌సైతం మృతులకు రూ.5 లక్షల చొప్పునపరిహారం చెల్లించనున్నట్లుప్రకటించింది.

**మృతులకుటుంబాలకు రూ.10 లక్షలు..ఆర్సీబీ**

విజయోత్సవాల విషాదంపై రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం స్పందించింది. తన అధికారిక సోషల్‌మీడియా హ్యాండిల్‌పై పోస్టుపెట్టి వరుసగా అప్‌డేట్లు ఇచ్చింది. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.10 లక్షలచొప్పున పరిహారం ఇస్తామని వెల్లడించింది. అలాగే గాయపడిన వారి సహాయార్థం ఆర్సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటుచేస్తున్నట్లుప్రకటించింది. ప్రభుత్వంనుంచి మృతులు ఒక్కొక్కరికి రూ.10 లక్షలుపరిహారం ప్రకటించగా కర్ణాటక క్రికెట్ అసోసియేషన్‌కూడా ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షలచొప్పున పరిహారం అందిస్తామని ముందుకువచ్చింది.

## వారం - వర్జ్యం

తేది : 06-06-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి తె.4.48
హస్త ఉ.6.33
వర్జ్యం మ.3.35-సా.5.24
దు.ఉ.8.12-9.04, 2) మ.12.33-1.25
శుభ సమయం : ఉ.9.10-9.45
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** వివాహ, ఉద్యోగయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెట్టినా ముందుకు సాగుతారు.

**వృషభం :** కుటుంబ సభ్యులతో అకారణంగా విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**కర్కాటకం :** భూముల క్రయం విక్రయాలలో లాభాలు పొందుతారు. అనుకోని ఆహ్వానాలు అందుతాయి.

**సింహం:** ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా వుండదు. వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి.

**కన్య :** పట్టుదల పెరుగుతుంది. పారిశ్రామిక, కళారంగాలవారికి కొంత అనుకూలంగా వుండును.

**తుల :** శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. వస్తులాభం.

**వృశ్చికం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన చికాకులు పెడతాయి. ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటుకాగలదు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు నిదానంగా పూర్తి చేస్తారు. చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురవుతాయి.

**మకరం:** వృత్తి-వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు.

**కుంభం:** ఎదుటివారిని ఆకట్టుకొని ముందుకుసాగుతారు. దీర్ఘకాలిక సమస్యలు ఎదురై వేధిస్తాయి.

**మీనం:** మిత్రులసాయంతో ముఖ్యమైన పనులు కొంతవరకు పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో హతం

>> కేంద్ర కమిటీ సభ్యుల్లో సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్నాడు. సుధాకర్ ఎన్‌కౌంటర్‌పై బస్తర్ ఐజీ విడుదల చేసిన ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నారు. నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి సభ్యుడు పాపారావుతోపాటు మరికొందరు సభ్యులు ఉన్నట్లు నిఘావర్గాలకు సమాచారం అందిందని ఈ క్రమంలో వారినే లక్ష్యంగా చేసుకొని డిఆర్జీ ఎస్టీఎఫ్ కోబ్రా సంయుక్త బలగాలు నేషనల్ పార్క్ ఏరియాలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయని అన్నారు.మావోల స్థావరాన్ని గుర్తించిన భద్రతా బలగాలు వారిపై కాల్పులు జరిపారని ఈ కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ మృతిచెందాడని ఘటన ప్రాంతంలో మావోయిస్టు ఆయుధాలు ఇతర సామాగ్రి లభ్యం అయ్యాయని తప్పించుకున్న మావోల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందని అన్నారు.కాగా ఈ ఎన్ కౌంటర్‌పై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఎదురుకాల్పులు జరిగితే కేంద్ర కమిటీ సభ్యుడు ఒక్కరే ఎలా చనిపోతారని ఆయనకు ఉన్న భద్రతా వలయంలో ఎవ్వరికీ ఏమి కాకుండా ఉంటుందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

మావోయిస్టు ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న అగ్రనేతలను కేంద్ర కమిటీ సభ్యులను టార్గెట్ చేస్తు ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది.అగ్రనేతలను హతమార్చితే క్రింది స్థాయి కేడర్ నిస్తేజం అలుముకొని లొంగుబాట్లు అధికంగా ఉంటాయని కొందరు ప్రాణభయంలో ఉద్యమాన్ని వీడి స్వచ్ఛందంగా జన జీవనంలో కలుస్తారనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన విధానం లాగా కనిపిస్తుంది. గడిచిన ఐదు నెలల కాలంలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు చలపతి మనోజ్ సుధాకర్ తోపాటు మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు మృతిచెందారు. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక గుడ్డు మరికొందరు నేతలు ఉండటం గమనార్హం..

# బీచ్ ఫెస్టివల్ ఆరంభం

>> రవీంద్ర అన్నారు. మంగినపూడి బీచ్ లో ఇంత పెద్ద ఫెస్ట్ నిర్వహించడం గర్వంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. 2018లో బీచ్ ఫెస్టివల్ అత్యంత ఘనంగా నిర్వహించామని కానీ గత పాలకులు దీనిని నాశనం చేసారని మండిపడ్డారు. బీచ్ లోకి రావడానికి కూడా లేకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీచ్ టూరిజం అభివృద్ధికి ఈ సభ ద్వారా తొలి అడుగు వేశామని అన్నారు. 3 రోజుల పండుగలో అడ్వెంచర్ స్పోర్ట్స్, పారా గ్లైడింగ్, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీ బాల్, కయాకింగ్ సహా అనేక ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. దేశంలో అన్ని రుచులు ఒకే చోట అందించబోతున్నామని మంత్రి తెలిపారు. హోటల్స్, రిసార్ట్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

**అమెరికాలో ఉంటే ఇంత ఆనందం ఉండేది కాదు**

తనది కృష్ణా జిల్లా అని ఇక్కడే పుట్టామని తానా మాజీ అధ్యక్షులు కోమటి జయరాం తెలిపారు. అమెరికాలో ఇటువంటి బీచ్ ఉంటే కమర్షియల్ చేస్తారన్నారు. కానీ ఇక్కడ మాత్రం ఆ పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. పర్యాటకంగా అభివృద్ధి చెందితే ఈ ప్రాంతానికేనా గుర్తింపు వస్తుందని వెల్లడించారు. మచిలీపట్నం బీచ్ టూరిస్ట్ హబ్‌గా అభివృధి చెందాలని ఆకాంక్షించారు. మచిలీపట్నం పర్యాటక అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

# నెల్లూరు జిల్లాలో ఘోర ప్రమాదం

>> 9మందిమహిళలు అదేగ్రామానికి చెందినఆటోలో పొగాకు గ్రేడింగ్‌కు సమీపగ్రామమైన టి.ముస్తాపురంకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి నుంచి ముస్తాపురం వెళ్లేందుకు ఏఎస్‌పేట క్రాస్ రోడ్డులో ఆటో మలుపుతిప్పుతున్న సమయంలో మర్రిపాడు నుండి నెల్లూరుకు వెళుతున్న కారు ఢీకొనింది. ఈ సంఘటనలో వెంకట్రావుపల్లికి చెందిన ఆటో డ్రైవర్, యజమాని అయిన దగ్గుమాటి పుల్లారెడ్డి (45), ఆటోలో ప్రయాణిస్తున్న అజీమా(50)లు ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. గౌసున్నీసా, సలీమా, హబీబున్నీసా, అన్వర్‌జాన్, రాబియాబి, మస్తాన్‌బి, బియాన్, బి.గౌసున్నీసా, వరలక్ష్మిలు తదితర 7మందికి తీవ్రగాయాలైనాయి. కారులో ప్రయాణిస్తున్న తిక్కవరంకు చెందిన చంద్రా నారాయణస్వామికి, మర్రిపాడుకు చెందిన గంగవరపు శ్రీనివాసులు నాయుడుకు గాయాలైనాయి. సంఘటన తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్, స్థానిక ఎస్ఐ జిలానీలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కారులో గాయపడిన వారిని వారి బంధువులు నెల్లూరులోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు. ఏఎస్‌పేట క్రాస్ రోడ్డులోని ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న వెంకట్రావుపల్లిలోని క్షతగాత్రులైన వారి బంధువులు పెద్ద సంఖ్యలో ఆత్మకూరులోని జిల్లా వైద్యశాలకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆసుపత్రి ప్రాంగణంలో బంధువర్గాల ఆర్తనాదాలతో దద్దరిల్లింది. ప్రమాద కారణాలను బాధితుల ద్వారా తెలుసుకున్న ఆత్మకూరు సిఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# అత్యాధునిక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్

## రూ.850 కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు



**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోనే అత్యాధునిక రైల్వేస్టేషన్‌గా విజయవాడ జంక్షన్ రూపుదిద్దుకుంటోంది. వచ్చే మూడు దశాబ్దాల్లో పెరగనున్న ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించేందుకు నీతి ఆయోగ్ పచ్చజెండా ఊపింది. రైల్వేస్టేషన్ తాజాగా కేటగిరి1లో చేరడంతో రూ.850 కోట్లతో పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రోజుకు 1.14 లక్షలు, రద్దీ వేళల్లో గంటకు 9,120 మంది ప్రయాణికులు ఈ రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. 2061 నాటికి రోజుకు 2 లక్షలకు చేరుతారనేది అంచనా. దానికి తగ్గట్టుగా రద్దీ సమయాల్లో ఒకేసారి 20 వేల మంది

### ప్లాట్‌ఫాంల సంఖ్య 12కు పెరిగే అవకాశం

ప్రయాణికులు వచ్చి వెళ్లేలా సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రస్తుతం ప్రధాన మార్గం వైపు మాత్రమే అభివృద్ధి అంతా సాగుతుండగా కొత్త రైల్వేస్టేషన్‌లో పశ్చిమం వైపు కూడా కార్యకలాపాలు విస్తరించనున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేలోనే కీలకమైన స్టేషన్ విజయవాడ. నిత్యం లక్ష మంది, పండగలు, సెలవు రోజుల్లో 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. 10 ప్లాట్‌ఫాంలున్న స్టేషన్ నుంచి నిత్యం 250కి పైగా ప్రయాణికుల రైళ్లు, 80 గూడ్సు బండ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోనే ముఖ్యమైన రైల్వేజంక్షన్ కావడంతో ఆదాయంలోనూ అగ్రస్థానంలో ఉంటోంది. చారిత్రక, వారసత్వ సంపద కలిగిన స్టేషన్‌గా, ఐదు ప్రవేశ ద్వారాలతో విజయవాడ అరుదైన గుర్తింపు పొందింది. ఏడాదికి వచ్చే ఆదాయం రూ.500 కోట్లు దాటడంతో గతేడాది బెజవాడ రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ 1 హోదా సాధించింది.ప్రయాణికుల రాకపోకలు, వారికి అందుతున్న సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైల్వేస్టేషన్లను వివిధ కేటగిరీలుగా విభజిస్తుంది. ఏటా రూ. 500 కోట్ల కన్నా ఎక్కువ వార్షిక ఆదాయం లేదా 20 మిలియన్ల ప్రయాణికుల రాకపోకలు సాగించే స్టేషన్లకు ఎన్ఎస జీ 1 హోదా కేటగిరీ ఇస్తారు. ఢిల్లీ సహా కొన్ని రాష్ట్రాల రాజధానుల్లో ఉన్న టాప్ రైల్వేస్టేషన్లకు మాత్రమే ఇప్పటి వరకు ఈ హోదా ఉండగా తాజాగా విజయవాడ రైల్వేస్టేషన్ ఆ జాబితాల చేరింది. కేంద్ర ప్రభుత్వం విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఎన్ఎస్‌జీ 1 హోదా కేటాయించింది. రాష్ట్రంలో ఈ హోదా కలిగిన ఏకైక రైల్వేస్టేషన్ ఇదొక్కటే. ఎన్ఎస్ జీ 1 హోదా కోసం విజయవాడ రైల్వే స్టేషన్ చాలా ఏళ్లుగా పోటీపడుతోంది. 201718లో కేవలం రెండు ప్రమాణాల్లో వెనకబడిపోయి హోదా చేజార్చుకుంది. ఐదేళ్ల తర్వాత 202324 రైల్వే బోర్డు తాజా సమీక్షలో రూ. 528 కోట్ల వార్షిక ఆదాయంతో ఎన్ఎస్ జీ 1 హోదా ఒడిసిపట్టుకుంది. 202324లో దాదాపు 16.84 మిలియన్ల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించారు. కొత్తగుర్తింపుతో దేశంలోని టాప్ 28 స్టేషన్లతో ఉన్న ఎలైట్ గ్రూప్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ చోటు దక్కించుకుంది. దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ తర్వాత ఎన్ఎస్ జీ 1 హోదా కలిగిన స్టేషన్ విజయవాడ మాత్రమే. ఇక్కడ ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

## ప్యానెల్ అడ్వకేట్‌గా ఎన్.శ్రీనివాసరావు నియామకం



**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ తరఫున ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్, రాష్ట్ర వినియోగదారుల హక్కుల కమిషన్, అమరావతి ప్యానల్ అడ్వకేట్‌గా రాష్ట్ర హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ తరఫున మూడు జ్యుడీషియల్ ఫోరంలలో కేసులను వాదించేందుకు, న్యాయ సలహాలు అందించేందుకు నర్రా శ్రీనివాసరావును తమ ప్యానల్ అడ్వకేట్‌గా మూడు సంవత్సరాల కాల పరిమితికి నియామకం చేశారు. ఈ మేరకు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విజయవాడ జోన్ అధికారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్రా శ్రీనివాసరావు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుండి మాస్టర్ ఆఫ్ లా పట్టాను పొందారు. 1999లో రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదిగా నమోదయ్యారు. గత 26 సంవత్సరాలుగా న్యాయవాదిగా సేవలందిస్తున్న శ్రీనివాసరావు గుంటూరు జిల్లా కోర్టు, పలు హైకోర్టులు, సుప్రీంకోర్టులో కక్షిదారులకు సేవలందించారు. ప్రస్తుతం కెఎల్ యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలకు న్యాయ సలహా దారునిగా పని చేస్తున్నారు. శ్రీనివాసరావుకు పలువురు న్యాయవాదులు అభినందించారు.

# తిరుమల సమాచారం

## తిరుమలలో 80శాతం పచ్చదనం పెంచేలా చర్యలు

### -2వేల మొక్కలు నాటేందుకు శ్రీకారం - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅటవీప్రాంతంలో కొలువైన తిరుమలకొండపై 80శాతం పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ఇందులో భాగంగా తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో రెండువేల మొక్కలు నాటేకార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తిరుమలలో ఇప్పటికే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలుచేస్తున్నామని, మరింతగా ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు పటిష్ట ప్రణాళికలు అమలుచేస్తున్నామన్నారు. వనమహోత్సవంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు గురువారం ఉదయం తిరుమలలోని ఆక్టోపస్ భవనం వద్ద అదనపు ఇఒ వెంకయ్యచౌదరి మొక్కలు నాటారు. స్వయంగా నీరుపోశారు. మొక్కలను నాటడం కాదని, వాటి సంరక్షణ ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. తిరుమలకు వస్తున్న భక్తులు తమవెంట తెచ్చుకుంటున్న ప్లాస్టిక్ నీళ్ళసీసాలు, ప్లాస్టిక్ సంచులు, ఆహారపదార్థాల కవర్లను ఘాట్‌రోడ్లలో విసురుతున్నారని, దీనివల్ల ఘాట్‌రోడ్లపై,పరిసరాల్లో ప్లాస్టిక్ అధికంగా పేరుకుపోతోందన్నారు. భక్తులుకూడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తిరుమలలో ప్రతి చెట్టుకు ప్రాధాన్యత ఉందని, పరిశోధన చేసి 40 స్థానిక మొక్క జాతులు నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎఫ్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఇఇ సుధాకర్, ఎఫ్ఆర్ఒ దొరస్వామి పాల్గొన్నారు.

## తిరుచానూరు పద్మావతి అమ్మ తెప్పోత్సవాలు



**తిరుమల,జూన్ 5ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు ఐదురోజులు జరగనున్నాయి. ఈనెల 7వతేదీ శనివారం సాయంత్రం నుండి 11వతేదీ వరకు అమ్మవారి పుష్కరిణి పద్మసరోవరంలో నిర్వహిస్తారు. పాంచరాత్ర ఆగమ పూజలు అందుకుంటున్న పద్మావతి అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తున్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి జ్యేష్ట శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు రమణీయంగా తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తిప్పలు, సంసార దు:ఖాలుతొలగి మోక్షం సిద్ధిస్తుంది. పద్మసరస్సులో బంగారు పద్మంనుండి ఆవిర్భవించిన అలిమేలుమంగ జీవకోటికి మాతృమూర్తిగా మారి భవజలధిలో మునిగిపోకుండా రక్షించి సర్వసౌఖ్యాలు ప్రసాదిస్తారని తెప్పోత్సవాల అంతరార్థం. ఐదురోజులు తెప్పోత్సవాల్లో తొలిరోజు రుక్మిణీసత్యభామసమేత శ్రీకృష్ణస్వామి, రెండోరోజు సుందరరాజస్వామి, మూడవరోజు నుండి పద్మావతిఅమ్మవారు తెప్పలపై విహరిస్తారు. ప్రతిరోజూ రాత్రి 7.30గంటల నుండి 8.30గంటల వరకు తెప్పోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా తిరుచానూరులో అమ్మవారు 10న రాత్రి గజవాహనంపై, 11న గరుడవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## అనారోగ్యం అనూహ్యమైనది.. మనిషి చేతుల్లో లేనిది హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్త ప్రతినిధి:** అనారోగ్యానికి ఎప్పుడు గురవుతామనేది మనిషి చేతుల్లో లేని వ్యవహారం.మానవ నియంత్రణలో లేని ఇలాంటి విషయాల్లో..అనారోగ్యం పాలైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు లేకపోతే పరీక్షలు రాయడానికి అనర్హులవుతారనే నిబంధన పెట్టడానికి వీల్లేదు.ఇలాంటి నిబంధన సహేతుకం కాదు అని హైకోర్టు స్పష్టం చేసింది. అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేకపోయిన ఓ విద్యార్థి సెమిస్టర్ ఫలితాలు వెంటనే ప్రకటించాలని, తరగతులకు అనుమతించాలని విజయనగరం జిల్లా రాజాంలో ఉన్న జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(జీఎంఆర్ఐటీ)కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల ఈ మేకు తీర్పు ఇచ్చారు.జీఎంఆర్ఐటీలో బీటెక్ కౌశిక్ బిటెక్ చదువుతున్నారు.అనారోగ్యం వల్ల గతేడాది కొన్ని రోజులు తరగతులకు హాజరుకాలేక పోయారు. హాజరు తక్కువవుతుందని మూడో సెమిస్టర్ పరీక్షకు కళాశాల అనుమతించక పోవడంతో ఆ విద్యార్థి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం పరీక్ష రాయడానికి అనుమతినిచ్చింది. కౌశిక్ మరో వ్యాజ్యం వేస్తూ ఫలితాలు వెల్లడించేలా ఆదేశించాలని, నాలుగో సెమిస్టర్‌కు హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. ఈ రెండు వ్యాజ్యాలపై న్యాయమూర్తి విచారణ జరిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులకు ఇంత శాతం హాజరు తప్పని సరిగా ఉండాలని నిబంధన సరికాదు. ఈ నిబంధన ప్రభుత్వం తెచ్చింది కాదు. ప్రైవేటు కళాశాల జీఎంఆర్ తీసుకువచ్చింది. అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. మెగా డిఎస్సీకి నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

## మద్యం కుంభకోణం నిందితుల బెయిలు పిటిషన్లపై విచారణ వాయిదా

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితుడు రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన బెయిలు పిటీషన్‌పై విజయవాడ సీబిఐ కోర్టు (ఏసిబీ కోర్టు ఇన్‌ఛార్జి)బుధవారం విచారణ జరిపింది. సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. అనంతరం బెయిలుపై విచారణ ఈ నెల 6కు వాయిదా పడింది. మరోవైపు విజయవాడ జిల్లా జైలు బ్యారెక్‌లో ఒక్కడినే ఉన్నానని, కనీసం ఇద్దరు ఉండే మరో బ్యారెక్‌కు మార్చాలని కెసిరెడ్డి చేసిన అభ్యర్థనకు న్యాయాధికారి సానుకూలంగా స్పందించారు. కారాగార నిబంధనల ప్రకారం కెసిరెడ్డిని మరో బ్యారెక్ లోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను ఆదేశించారు. మరో వైపు ఇదే కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి,కృష్ణమోహనరెడ్డిలు బెయిలు పిటీషన్లు దాఖలు చేశారు.

## నగర వనంలో రూ.2 కోట్లతో మొక్కల పంపిణి

### జిల్లాలో 5లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక

### కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్



**శ్రీకాళహస్తి,జూన్ 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తికి సమీపంలోని రామాపురం రిజర్వాయర్ సమీపంలో రూ. 2కోట్లతో 'నగరవనం' కార్యక్రమాలకు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ శ్రీకారం చుట్టారు. హరితాంధ్ర పథకంలో భాగంగా బైరాజు కండ్రిగ సమీపంలోని అడవుల్లో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ పర్యావరణం, అటవీసంపద బాగుంటేనే మనందరం కాలుష్యరహిత ఆరోగ్యకర జీవనం కల్గి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడే దిశగా మొక్కలు నాటి తమ పరిసరాలను పచ్చగా ఉంచుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని ప్రస్తుతం 30శాతం నుంచి 50శాతానికి పెంచటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అధికారులు వివరించారు. నగరవనం రూ. 2కోట్లతో సమగ్రసదుపాయాలతో చేపట్టనున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రం,జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవం చేపట్టడం అభినందనీయం అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కల్పించాలన్నారు. తిరుపతి జిల్లాలో 5లక్షలకు పైగా మొక్కలు నాటాలన్నదే లక్ష్యంగా వివరించారు. గురువారం జిల్లాలోని ప్రతి గ్రామంలో అటవి, టిటిడి సంయుక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ మహత్తర కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్లాస్టిక్ వాడకం మన జీవన శైలిలో భాగమైపోయిందన్నారు. మనం ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు. చెట్టు కొట్టివేయటం వల్ల కానీ ప్లాస్టిక్ ఎక్కువ వాడకం వల్ల ప్రమాదం కొని తెచ్చుకున్నామన్నారు. కెవిబిపురం నుంచి గిరిప్రదక్షిణ సంబంధించిన కనెక్టివిటి రోడ్డు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఇక్కడ స్థానిక ప్రజలకు ఆదాయాలు పెరుగుతాయని వివరించారు. అంతేకాక ఉద్యోగవకాశాలు లభిస్తాయని కలెక్టర్ వెంకటేశ్వరన్ వివరించారు. అటవీ సంరక్షణ అధికారి సెల్వం మాట్లాడుతూ భారత ప్రభుత్వం యొక్క ప్రధాన ఆటవీకరణ చొరవ అయిన వన మహోత్సవం వేడుకలు 1950లో ప్రారంభించబడ్డాయని వివరించారు. ఇప్పటికి వరుసగా 75 సంవత్సరాలుగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు.

## ప్రతి జిల్లా కేంద్రంలో వైద్యుల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్ రెన్యువల్

**విజయవాడ,జూన్5.ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో ప్రతి జిల్లా కేంద్రంలో వైద్యుల సౌకర్యార్థం రిజిస్ట్రేషన్ రెన్యువల్‌తో పాటు ఇతర సదుపాయాలను అందించే కార్యక్రమాన్ని 13 జిల్లా కేంద్రాల్లో ప్రారంభిస్తున్నామని చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి దశగా విజయనగరంలో ఈ నెల 7, 8 తేదీల్లో ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా నేడు ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యక్రమ బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి, సభ్యులు డాక్టర్ ఎస్. కేశవరావు బాబు, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో వైద్య మండలి సిబ్బంది ఆయా జిల్లా కేంద్రాల్లో సేవలందిస్తారు. గతంలో రెన్యువల్ పూర్తయిన తర్వాత మాత్రమే రెన్యువల్ చేసేవారు, ఇప్పుడు 3 నెలల ముందు కూడా రెన్యువల్ సౌకర్యం కల్పిస్తున్నామని చైర్మన్ వివరించారు. అలాగే, ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో, 21, 22 తేదీల్లో కాకినాడలో, 28, 29 తేదీల్లో తిరుపతి మెడికల్ కాలేజీలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమాల్లో మండలి సభ్యులు డాక్టర్ సుజాతా, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ కె. సుబ్బా నాయుడు, డాక్టర్ స్వర్ణ గీత, రిజిస్ట్రార్ రమేష్ పాల్గొంటారు. ఈ కార్యక్రమం వైద్యులకు సౌలభ్యాన్ని అందించడంతో పాటు రాష్ట్రంలో వైద్య సేవలను మరింత మెరుగుపరిచే దిశగా ఒక ముఖ్యమైన అడుగని చైర్మన్ అన్నారు.

## భద్రతకే తొలి ప్రాధాన్యత - అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుని పనితీరు


### - క్యూలైన్లకు చేరుకునేముందే నిశిత తనిఖీలు

### - టిటిడి నూతన సివిఎస్ఒ మురళీకృష్ణ



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీవారి ఆలయం భద్రతతోబాటు భక్తులకు రక్షణ కల్పించడమే తొలి ప్రాధాన్యత ఉంటుందని టిటిడి నూతన సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ తెలిపారు. భద్రత పరంగా టిటిడిలో నిమగ్నమైన విజిలెన్స్ సెక్యూరిటీ విభాగంతోబాటు పోలీస్, ఆక్టోపస్, టిటిడి సెక్యూరిటీ, ప్రైవేట్ సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ విభాగాలతో సమన్వయంగా వ్యవహరించి, అవసరమైన మేరకు పనితీరు సాగిస్తానన్నారు. భక్తులు నిషేధిత వస్తువులు తిరుమలకు తీసుకురాకుండా మరింతగా అవగాహన కల్పించేలా చూస్తానన్నారు. టిటిడి భద్రతలో పోలీసుశాఖ ఒకటని, ఆ శాఖతో సత్సంబంధాలు కలిగి ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ పరస్పరం అవగాహనతో ముందుకెళతానన్నారు. తిరుమలలోని వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లోనికి ప్రవేశించే ముందే తనిఖీలు మరింత పటిష్టంగా,నిశితంగా చేయిస్తానన్నారు. భక్తులు కూడా తమవెంట సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నిషేధిత పదార్థాలు తీసుకురాకూడదని ఆయన కోరారు. గతంలో తిరుమల,తిరుపతిలో పోలీసుశాఖలో పనిచేసిన అనుభవం ఉండటంతో ప్రస్తుతం టిటిడి సివిఎస్ఒగా నియమితులు కావడం కొంతవరకు అవగాహనతో ముందుకెళతానన్నారు. టిటిడి సివిఎస్ఒగా నియమితులైన కెవి మురళీకృష్ణ గురువారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆలయ సాంప్రదాయం పాటిస్తూ స్వామివారి రంగనాయకుల మండపంలో భక్తివిశ్వాసాలతో బాధ్యతలు తీసుకున్నారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి అదనపుఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి చిత్రపటం బహుకరించారు. నూతన సివిఎస్ఒ వెంట విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్(వింగ్), సురేంద్ర,ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్ ,ఆలయ పేష్కార్ రామకృష్ణ ఉన్నారు. అనంతరం ఆయన కొంతసేపు క్యూలైన్ల నిర్వహణ గమనించారు.

## ఎపి మీడియా అకాడమి, చైర్మన్‌గా ఆలపాటి సురేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ



**విజయవాడ జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి, చైర్మన్‌గా ఆలపాటి సురేశ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రెవిన్యూ కాలనీలో సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమి కార్యాలయంలో గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాత్రికేయ వృత్తిలో ప్రమాణాలు మెరుగు పరచేందుకు తాను అత్యంత ప్రాధాన్యత యివ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. మీడియా విస్తృతి, సంక్షిష్టత కారణంగా యీ నిర్ణయం అవసరమని ఆయన అభిప్రాయ పడ్డారు. మీడికా అకాడమి ప్రాథమిక విధుల్లో ఇది ఒకటని ఆయన యీ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా, సోషల్ మీడియాను దృష్టిలో వుంచుకుని అవసరమైన సందర్భాల్లో నియంత్రణ చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. సరియైన సమాచారాన్ని పొందడంలో యిది ఒక భాగమే కనుక మీడియా అకాడమి పరిధిలో లేకపోయినా యీ విషయపై దృష్టి సారించాల్సి వుంటుందన్నారు. తనను నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుసభా ముఖంగా ధన్యవాదాలు తెలిపారఅంతకుముందు తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలని చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సురేశ్ కుమార్‌కు సూచించారు. సి.రాఘువాచారి మీడియా అకాడమి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించి ఆలపాటి సురేశ్ కుమార్‌కు ఎపియుడబ్ల్యూజె, ఎపిడబ్ల్యూజెఎఫ్ నేతలు ఇతర జర్నలిస్టు సంఘాల నాయకులు ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్ , హిందూ రెసిడెంట్ ఎడిటర్ రెడ్డప్ప, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్ స్వర్ణలత జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ ఉన్నారు.

## శ్రీవారి ఆలయంలో 9నుండి జ్యేష్టాభిషేకాలు



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి విగ్రహాలు అరిగిపోకుండా పరిరక్షణకు మూడురోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏడాది జూన్‌మాసంలో జ్యేష్టానక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు,కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఈనెల 9వతేదీ సోమవారం రుత్వికులు శాంతి హోమం నిర్వహిస్తారు. హోమాలు, అభిషేకాలు, శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులకు వజ్రకవచం అలంకరిస్తారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు యధావిధిగా కైంకర్యాలు నిర్వహించి ఉత్సవమూర్తులకు ముత్యాలకవచం ధరింపజేస్తారు. చివరగా మూడవరోజు 11వతేదీ బుధవారం విశేష పూజలు,అభిషేకాలు జరిపించి మళ్ళీ బంగారుకవచం ధరింపజేస్తారు. బంగారుకవచంలోనే ఏడాదంతా విశేష పూజలు, ఉత్సవాలు జరిపించుకుంటారు. ఇప్పటికే ఈ మూడురోజుల జ్యేష్టాభిషేకాలకు ఆన్‌లైన్‌లో సేవా టిక్కెట్లును గృహస్థభక్తులు అందుకున్నారు.

## దంపతులు ఒకేచోట పనిచేసేలా వెసులుబాటు

### బదలీలపై వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్యారోగ్య శాఖలో సాధారణ బదిలీ ప్రక్రియలో ఐచ్ఛిక స్థానాల ప్రాధాన్యతలు తెలియచేసే గడువు ముగిసిన క్రమంలో తదుపరి కౌన్సిలింగ్‌తో పాటు బదిలీలు చేపట్టాల్సిన ప్రక్రియకు మంత్రిత్వ శాఖ స్పష్టతనిచ్చింది. ఈ విషయంపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు అందరు వి భాగాధిపతులతో బుధవారం నాడు రెండు గంటల పాటు చర్చించి రూపొందించిన కార్యాచరణ సూత్రాలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదించారు. జిల్లా స్థాయి విభాగాధిపతుల వరకు ఈ బదిలీ ప్రక్రియలో పాల్గొనే అధికారులంతా ఒకే స్పష్టమైన అవగాహనతో బదిలీలపై ఆయా స్థాయిల్లో పారదర్శకంగా, సహేతుకమైన నిర్ణయాన్ని తీసుకునేందుకు ఈ సూచనల్ని రూపొందించారు. ప్రస్తుతం ఒకే చోట పనిచేస్తున్న దంపతుల్లో ఒక్కరైనా అదే చోట ఐదేళ్ళలోపు పనిచేసి ఉంటే వారిని అదే చోట కొనసాగించవచ్చు..బదిలీల నిర్ణయాల్లో మొదట ఐదేళ్ళ పదవీకాలం పూర్తిచేసిన వారికి బదిలీ స్థానాలపై నిర్ణయాన్ని తీసుకోవాలి..ఆ తర్వాత 2 నుండి ఐదేళ్ళలోపు ఒకే చోట పనిచేసిన వారి బదిలీలపై వారి ఐచ్ఛికాల్ని బట్టి కొత్త స్థానాలపై నిర్ణయాలు తీసుకోవాలి..ఐదేళ్ళ సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి వారు సూచించిన స్థానాల్లో పోస్టింగ్ లభించకపోతే వారికి కౌన్సిలింగ్ చేపట్టాలి..2 నుండి ఐదేళ్ళ లోపు ఒకే చోట పనిచేసే వారు కోరుకున్న చోట బదిలీ దొరకకపోతే వారిని ప్రస్తుత స్థానంలో కొనసాగించాలి..కాంట్రాక్టు నియామకాలతో రెగ్యులర్ పోస్టుల్లో పనిచేస్తున్న వారు ప్రస్తుతానికి యథావిధిగా కొనసాగుతారు. ఆ రెగ్యులర్ స్థానాలు ఖాళీలుగా పరిగణించబడవు. వివిధ విభాగాల్లో వివిధ స్థాయిలో ప్రస్తుత సాధారణ బదిలీల నిమిత్తం ప్రకటించని ఖాళీల గురించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు వాకబు చేశారు. ఇందుకు స్పందిస్తూ విభాగాధిపతులు (హెచ్‌వోడీలు)తెలిపిన వివరాలు మేరకు.వైద్య కళాశాలల్లో జాతీయ వైద్య సంఘం(ఎన్ఎంసి) నిబంధనల మేరకు వైద్య అధ్యాపకులను కొనసాగించేందుకు కొన్ని ఖాళీలను చూపలేదు.పిపిపి వాధానంలో నిర్వహించాల్సిన వైద్య కళాశాలల్లో గతంలో నియమించిన వారిని రీఎంప్లాయిమెంట్ చేయాల్సిన అవసరాల దృష్ట్యా మరికొన్ని ఖాళీలను ప్రకటించలేదు.ఒకే చోట ఐదేళ్ళ సర్వీసు పూర్తి చేసిన దాదాపు అందరికి కొత్త స్థానాల్లో బదిలీ చేసే వీలుంటుందని, అలా కుదరని కొన్ని సందర్భాల్లో తగు కారణాలను పరిశీలించి నిర్ణయాన్ని తీసుకుంటామని కృష్ణబాబు తెలిపారు.

## 28 హోంగార్డు పోస్టులకు 12,569 దరఖాస్తులు

### - ప్రాథమిక పరిశీలన అనంతరం 7,684 మంది ఎంపిక

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి** ఆంధ్రప్రదేశ్ సిఐడీ విభాగంలో 28 హోంగార్డు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా...వాటి కోసం ఏకంగా 12,569 మంది ధరఖాస్తు చేసుకున్నారు. భారీ సంఖ్యలో ధరఖాస్తులు రావడంతో ప్రాథమిక పరిశీలన చేపట్టి తదుపరి పరీక్షలకు 7,684 ధరఖాస్తుదారులను సిఐడీ అధికారులు ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మంగళగిరి లోని ఏపీఎస్పీ బెటాలియన్ మైదానంలో శారీరక కొలతల(ఫిజికల్ మెజర్‌మెంట్స్) పరీక్షలు,ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టనున్నారు. ఎవరెవరు ఏయే తేదీల్లో హాజరుకావాలనే విషయమై షెడ్యూల్‌ను సిఐడీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఇంటర్మీడియట్ కనీస విద్యార్హతగా కలిగిన ఈ హోంగార్డు పోస్టులకు బిటెక్,బీసిఎ,బిఎస్సీ కంప్యూటర్స్ పట్టభద్రులు సహా అనేక వృత్తి విద్యా కోర్సులు చేసిన వారూ ధరఖాస్తు చేసుకున్నారు. ఇవి శాశ్వత ఉద్యోగాలు కూడా కావు.

వార్త

ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న అదనపు కోరికను కలిగి ఉండడాన్ని సామర్థ్యం అంటారు.

-హెచ్.గిల్బర్ట్స్

# పర్యావరణంతో పరాచికాలా?

విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకు వస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణాలవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి,చేస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగి పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం అత్యంత దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు కూడా చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు నుంచి మొదలు పెడితే కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్నివిధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో చేసే కార్యక్రమం కోసం నిత్యం అన్వేషణ కొనసాగుతున్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత్ జనాభా 145 కోట్లకు చేరుకోవడానికి ఇంకా ఎక్కువ కాలం పట్టదని అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నదని, ప్రధానంగా అటవీ సంపద వేగంగా హరించుకుపోతున్నదని స్పష్టం చేసింది. భారత్‌లో రోజుకు దాదాపు మూడువందల ముప్ఫైఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి నివేదికలో వివరించింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయ ప్రాజెక్టుల కోసం యథేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకం నియంత్రించలేకపోతున్నారు. దీనివల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ఒక ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవికాగితాలకే పరిమితమైపోతున్నాయి. ఇక పెట్రోలు, డీజల్ వంటి ఇంధనాల్ వాడకం గూర్చి చెప్పక్కరలేదు. వాహన కాలుష్యనియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. వీటితోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ వాయుకాలుష్యాన్ని పెంచుతున్నది. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు పడకపోడం అకాలంలో భారీ వర్షాలు ఒకేసారి, ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం లాంటివి ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. వ్యవసాయరంగంపై తీవ్రప్రభావం చూపుతున్నది. అంతే కాదు వరదలు, తుఫాన్‌లతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతంఈశాన్య రాష్ట్రాలను అధికవర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. సిక్కిం, అసొం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరం, నాగాలాండ్, మేఘాలయాల్లో కుంభవృష్టి కురిసింది. ఫలితంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ వర్షపు బీభత్సానికి ఇప్పటికే నలభై మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. యేటాదాదాపు మూడువందల ఎనభైకిపైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార లెక్కలే వెల్లడిస్తున్నాయి. ఈ ఉపద్రవాలతో యేటా లక్షలాది మంది ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే ఇటీవల పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల వల్ల ప్రాణ, ఆస్తుల నష్టం కొంతవరకు నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి విజృంభణకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి బయటపడలేకపోతున్నారు. మొన్న ఆ మధ్య చైనాలో ప్రకృతి సృష్టించిన విలయం ఇందుకు సజీవ సాక్ష్యంగా చెప్పొచ్చు. ఆర్థికంగానో,సాంకేతిక పరంగానో ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని చైనీయులు కూడా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు. భారీ వరదలతో ఎల్లోనదీ ఉగ్రరూపం దాల్చి నగరాలకు నగరాలనే ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయే కాదు ప్రపంచంలోని అనేక దేశాలు ఈపరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. చిన్నచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి దారుణంగా తయారవుతున్నది. మొన్న బెంగళూర్ నగరం, నిన్న ముంబయి విపత్కరల పరిస్థితులు ఎదుర్కొన్నాయి. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు,పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సి ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యంచేసినా ఇలాంటి ప్రళయాలు తప్పవు. భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు, గౌరవాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.



అరిస్టాటిల్

ఓ మర్రిగింజ మహావృక్షమైనట్టే, చిత్తశుద్ధితో చేసే చిన్న సత్కార్యం మహాఫలితాలను ఇస్తుంది.



కె.స్టానిస్లావిస్కి

# ప్రజావాక్కు



### యువతను ఆకర్షిస్తున్న డిజిటల్ విప్లవం

ఆధునిక డిజిటల్ విప్లవంతో ప్రపంచం మన చేతిలోకి వచ్చింది. సమాచార మార్పిడిలో వేగం పెరిగింది. కానీ ఇదే డిజిటల్ ప్రపంచం నేటి యువతను, చిన్నారులను ప్రమాదకరమైన మార్గాలవైపు నడిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియా, ఒటిటి ప్లాట్‌ఫారమ్‌లలో అశ్లీల కంటెంట్ విపరీతంగా పెరిగిపోతుండటం ఆందోళనకరం. టీనేజర్ వయసులోనే లైంగిక ఆలోచనలు పెరగడం, అమ్మాయిలను వస్తువుల్లా చూడ దంవంటి పరిణామాలు ఆవిష్కృతమవుతున్నాయి. చిన్నా రులు కూడా మొబైల్ ద్వారా ఈ విషపూరిత కంటెంట్‌కు చేరువ అవుతుండటం మరింత భయంకరం. ఇది దేశ భవిష్యత్తుకు ముప్పు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పల్లెల్లో ఊపందుకోనున్న రాజకీయం

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి.ఎన్నికల రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉన్నారు. సర్పంచ్,ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే పల్లెల్లో మళ్లీ రాజకీయం ఊపందుకోనుంది. ఒకవైపు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, యువకులు చొరవ చూపుతున్నారు.గ్రామాలలో మహిళాసంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలతో నిత్యం సమావేశమవుతున్నారు.

- సింగు లక్ష్మీనారాయణ, జయశంకర్ భూపాలపల్లి

### ఫీజుల పెంపు సమంజసం కాదు

ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో దడ మొదలైంది. ఫీజులు,పుస్తకాలు, యూనిఫాం,బ్యాగులు ఇతరసామగ్రి కొనాలంటే తల్లిదండ్రులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పాఠశాలలపై నియంత్రణ లేకపోవడంతో ఫీజుల భారం పెరిగింది.ఏడాది సంపాదనంతా బడికే అని వాపోతున్నారు. కుటుంబంలో ఇద్దరు విద్యార్థులుంటే అంతే. దాదాపు రూ. లక్ష వరకు భారం పడుతోంది. ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై నియంత్రణ విధించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లిజిల్లా

### ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరించాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ డివిజన్ వారు తహసిల్ పౌర సరఫరాల మొదలగు ప్రాథమిక పరిపాలన కార్యాలయాలు చాలా వరకు అధ్వాన్న స్థితిలో ఉన్నవి. ఈ భవనాలను శుభ్రపరచకపోవడం వలన అత్యంత భయంకర దృశ్యంగా కనిపిస్తుంటాయి. సున్నం రంగులు వేసినట్టు కనిపించడం లేదు. కిటికీలు తలుపులు మరీ దారుణంగా ఉన్నాయి. మూత్రశాలలు అధ్వాన్నస్థితిలో ఉన్నవి. కొన్ని కార్యాలయాలు పై అంతస్తులో ఉండడం వలన స్త్రీలు వయోధికులు మెట్ల మార్గం నుండి పోవడం గగనంగా మారుతున్నది. కార్యాలయాల ఫర్నిచర్ ఇక్ష్వాకుల కాలంనాటివి ఇంకా ఉపయోగిస్తున్నారు. ఫైల్స్ భద్రపరచడానికి సరైన వ్యవస్థ లేదు. కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఉపయోగించే కేబుల్స్ కరెంటు వైర్లు వేలాడుతుంటాయి.ప్రభుత్వాలకు ప్రజలకు ప్రధాన వారధులైన ఈ కేంద్రాల ఆలనాపాలన పట్టించుకోకపోవడం శోచనీయం.

-దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

### సైనికులను ఆదుకోవాలి

యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు సర్వ లాంఛనాలతో ప్రభుత్వ ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించడం గౌరవప్రదమైన సంస్కారం. యుద్ధాలలో పాల్గొని ప్రాణాలతో బయట పడ్డవారిని పట్టించుకునేదెవరు? వీరికి ఠంచనుగా పెన్షను యిస్తున్నారు. వీరిలో చాలామంది బయటకు వచ్చిన తరువాత సరైన ఉద్యోగాలురాక చిన్నాచితక కొలువులు చేసుకుంటూ సంసారాలను ఇద్దుకొస్తున్నారు. యుద్ధ భూమిలో మరణించిన వారికి మాత్రం భార్యలకు ప్రభుత్వ పెన్షన్‌తోబాటు గుత్తగా అధికమొత్తం ఇవ్వడం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, కొన్ని వందల గజాలస్థలాన్ని ఉచితంగా ఇస్తున్నారు.యుద్ధాల్లో వీరోచితంగా పోరాడి ప్రాణాలతో బయట పడినవారికి రిక్తహస్తాలే.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ప్రజా ప్రతినిధులకు విద్యార్హతలు నిర్ణయించాలి

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికలలో ఎన్నికయ్యే ప్రజా ప్రతినిధులకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటుగా విద్య అర్హతలను కూడా నిర్ణయించాలి.పదవతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి విద్య అర్హతలను ప్రజా ప్రతినిధుల గ్రామస్థాయి, మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, హోదాలను బట్టి విద్యా అర్హతలను నిర్ణయించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయాల్సిందే

**విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత,విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు.**

దాడిశెట్టి శ్యామ్ కుమర్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ యాజమాన్యాల కింద పనిచేస్తున్న ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు విద్యాశాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించిన స్థాయిలో తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించకపోవడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు శాతం క్రమక్రమంగా తగ్గుతూ పోతున్నాయన్న విషయాన్ని విద్యాశాఖ గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి. కారణాలు ఏవైనా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయి నుండి ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల స్థాయివరకు తరగతి గదికి అనువైనటువంటి విద్యార్థుల సంఖ్య లేని పాఠశాలలే ఎక్కువగా గోచరిస్తుండడం విశేషం. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల్లోని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థుల శాతమే ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువగా ఉంటుందనే భిన్న వాదనలు లేకపోలేదు. దీని కారణం గ్రామీణ, పట్టణ ప్రాంతాలు మొదలుకొని కనీస ఆర్థిక పరిస్థితులు ఉన్న కుటుంబాలు ప్రభుత్వ పాఠశాలల పట్ల అనాసక్తి చూపడం, ప్రభుత్వ బడిలో తమ పిల్లల్ని చదివించడం అంటే కొందరు తమ హోదాకు దర్పణంగా లేదనే భావించేవారు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. మరికొందరిలో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలపై అవగాహన లేకపోవడం, ప్రభుత్వ పాఠశాల ఆవశ్యకత గుర్తించలేకపోవడం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండడానికి కారణమైన ఉండొచ్చు అని భావన కొందరిలో లేకపోలేదు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత చదువులు కలిగి అత్యున్నతమైన అనుభవం కలిగినటువంటి ఉపాధ్యాయులు ఉండడం, విశాలమైన క్రీడా ప్రాంగణం క్రీడా సామాగ్రి, సైన్స్ ప్రయోగశాల పరికరాలు,ప్రయోగశాల గదులు సరిపడా, తరగతి బోధనా గదులతో, మంచినీటి సౌకర్యం, బాల బాలికలకు వేరువేరు సానిటేషన్ వ్యవస్థలతో పాటు మౌలిక వసతులను సాధ్యమైనంత త్వరితగతిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా గణనీయంగా ఉన్నతీకరించబడుతుండటం శుభ సూచకమే. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు విద్యావ్యవస్థకు పటిష్టమైనటువంటి విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలతో సమావేశాన్ని నిర్వహిస్తుండడం, ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక బడిబాట లాంటి కార్యాచరణను చేపట్టడం గమనార్హం. ఈ క్రమంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచే విధంగా విషయ బోధన అభ్యసనలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం అనేక కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ సౌకర్యంతో పాటు తరగతి గదులకు ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేసిన సందర్భంలో వీటిని విషయ బోధనలో వినియోగించేందుకు ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని బోధన ఉపాధ్యాయులకు కావలసిన వృత్యాంతర శిక్షణ కార్యక్రమాలను



ఇటీవల ప్రభుత్వ విద్యాశాఖ నిర్వహించింది. అంతేకాకుండా ప్రభుత్వం కోట్ల రూపాయల బడ్జెట్‌తో ఉపాధ్యాయుల కొరత లేకుండా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నాణ్యమైన తెలుగు ఇంగ్లీష్ మాధ్యమాల్లో మెరుగైన విద్యా బోధనతో సహా పాఠ్యాంశాలతో పాటు పౌష్టికాహార విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ, డాక్టర్లచే వైద్యపరీక్షలు నైతిక విలువలతో కూడిన మార్గదర్శకత యోగ అభ్యసనం, క్రీడలు సైన్సు సాహిత్య, సంస్కృతి కార్యక్రమాలలో అభిరుచి కలిగించడం, కంప్యూటర్ల వాడకం,అభ్యసనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అవగాహన కల్పించడం ఇలాంటి అనేక సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్నప్పటికీ, కారణాలేవైనా ప్రస్తుత పరిస్థితులు పరిశీలిస్తే స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాల స్థాయి వరకు విద్యార్థుల సంఖ్య మాత్రం ఒక్క సెక్షన్‌కే పరిమితమై ఉండడం గాని అంతకంటే తక్కువగానే ఉండడం శోచనీయం. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మండలానికి ఒక మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలతో పాటు సంక్షేమ హాస్టల్ కూడా విస్తరించడంతో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీటిపైనే ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. అలాంటప్పుడు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా నిలదొక్కుకుంటాయో అనే సందేహాలు కలగకమానవు. ముఖ్యంగా గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సైతం ప్రైవేటు పాఠశాలలు ఎక్కువ అవుతుండడం ప్రాథమిక స్థాయి చదివే పిల్లలు ఎక్కువ శాతం ప్రవేట్ స్కూల్ వైపు ఆసక్తి చూపిస్తుండడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చాలావరకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నది. తద్వారా ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఉనికి అంతంత మాత్రంగానే ఉంటుంది. కారణాలేవైనా ప్రభుత్వ విద్యాశాఖ విద్యార్థులు చదువు కొరకు అనేక కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశాల ద్వారా, బడిబాట కార్యక్రమాల ద్వారా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను తెలియచేయాలి.ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు అన్ని వర్గాల వారితో పాటు ఉపాధ్యాయుల సహకారంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏది ఏమైనప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల విధివిధానాలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపినప్పుడే ప్రభుత్వాలు విద్యాశాఖ విద్యార్థులకు అవసరమైన అనేక సదుపాయాలపై దృష్టి సారిస్తాయి. త్వరితగతిన నెరవేర్చడానికి కూడా కృషి చేస్తాయి. కానీ ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన విద్యార్థులు నమోదు లేనప్పుడు ప్రభుత్వాలు ఆచితూచి ఆలోచించవలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రత్యామ్నాయంగా రేషనలైజేషన్ లాంటి కార్యక్రమాలను చేపడుతున్నాయి. పాఠశాలలో పిల్లలను చేర్పించే బాధ్యత పూర్తిస్థాయిలో తల్లిదండ్రులకే కల్పించబడింది. కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకత,విలువలను గుర్తించి స్వచ్ఛందంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించితే గానీ అన్నివర్గాల వారితో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల వారి విద్యాభివృద్ధికి జ్యోతులుగా ప్రభుత్వ పాఠశాలలు మనుగడ కొనసాగిస్తాయనడంలో సందేహం లేదు. •

# ప్రభుత్వానికి భూములిస్తే రైతులకు లాభదాయకమే!

గరిమెళ్ల రామకృష్ణ

అమరావతి రాజధాని చుట్టూ మరింత భూసేకరణపై భిన్న వాదనలు చేస్తున్నారు. రైతుల కోణం నుంచి చూస్తే భూమిని ప్రభుత్వ అవసరాల కోసం ఇవ్వడమే ఉత్తమం! ఒక్క అమరావతి ప్రాంతంలోనే కాదు, రాష్ట్రంలో ఎక్కడ భూసేకరణ జరిగినా రైతులు తమకు ఆమోదయోగ్యమైన రీతిలో ప్రభుత్వానికి ఇవ్వడమే రైతులకు మేలు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న వార్తలు నిత్యం పత్రికల్లో చూస్తున్నాం! వ్యవసాయం అంటే ప్రకృతితో జూదం. ఈ జూదంలో ఓటమే కానీ గెలుపు లేదు! ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఎన్ని మాటలు చెప్పినా రైతుల తలరాతను మార్చే పరిస్థితి లేదు. విత్తనం దగ్గర నుంచి పండించిన పంట అమ్మే వరకు రైతులు కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన దుస్థితి నెలకొంది. పంటల బీమా వంటి పథకాల వలన రైతులకు పెద్దగా ఒరిగింది కూడా లేదు. ఏ పంట వేస్తే గిట్టుబాటు ధర వస్తుందో ముందస్తుగా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే ఒక సమగ్ర విభాగం మన వ్యవసాయ శాఖలో లేని పెద్దలోపం! ప్రభుత్వాలు కూడా రైతులకు న్యాయం చేసే పరిస్థితి లేదు. రాజకీయ పక్షాలు కార్పొరేట్ వర్గాలు ఇచ్చే విరాళాలతోనే మనుగడ కొనసాగిస్తున్న నేపథ్యంలో పాలకులు వాళ్లకు వ్యతిరేకంగా కానీ నష్టం కలిగే విధంగా కానీ నిర్ణయాలు చేయలేరు. చట్టాలు చేసినా, మద్దతు ధరలు ప్రకటించినా అమల్లో పూర్తిగా వైఫల్యమే! భూములు కోల్పోయిన రైతులు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించమని పాలకులను



కోరవచ్చు. అది కొంతవరకు సాధ్యం అవుతుంది కూడా. భూములు కోల్పోయిన రైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా రైతులు షరతులు పెట్టవచ్చు. అలా ఉద్యోగాలు అవసరం లేనివారు, అవకాశం లేని కుటుంబాల వారు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడానికి ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. వ్యవసాయంపై ఆసక్తి, చేయగల సత్తా కలవారు కొత్తగా సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందే ప్రాంతాలను అధ్యయనం చేసి, గుర్తించి, చౌకధరల్లో భూములు కొనుగోలు చేసి వ్యవసాయం కొనసాగించవచ్చు. ఈ విధానం, ఒరవడి నిజాం నవాబు పాలన కాలం నుంచి ఉన్నదే! ఇక రాజధాని ప్రాంతంలోని రైతులు రాజధాని నిర్మాణం, అందుకు ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అనుమానాలు, ఆందోళన పడవలసిన అవసరం లేదు. జరుగుతున్న పరిణామాలు తమకు మేలు చేస్తాయన్న సానుకూల దృక్పథంతో ముందుకు రావాలి. ఈ సందర్భంగా రైతులు 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించే వరకు తమ పిల్లలకు వివాహం జరిపించడం కూడా కష్టంగా ఉందన్న దైన్యస్థితి బహిరంగంగా చెప్పుకున్న వైనం మరచిపోకూడదు! ఇదే సందర్భంలో కొంతమంది దుర్బుద్ధి, దురాలోచనతో చెప్పే తప్పుడు మాటలను రైతులు నమ్మిమోసపోకూడదు! హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాల మాదిరి అమరావతి కూడా బహుముఖంగా అభివృద్ధి చెందుతుంది. అందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు తప్పనిసరి. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గట్టిగా కృషి చేస్తున్న పరిస్థితి స్పష్టంగా కనబడుతోంది. పలు అంతర్జాతీయ సంస్థలు ఆయనపై నమ్మకం, విశ్వాసంతో ముందుకు వస్తున్నాయి. ఇందుకు రైతుల సహకారంతోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు.అంతిమంగా అభివృద్ధి ఫలాలు రైతులకు కూడా దక్కుతాయి! •

# ట్రంప్ ఆర్థిక దోపిడి విధానాలతో ఆందోళన



డాక్టర్ కత్తి పద్మారావు

డొనాల్డ్ ట్రంప్ అధికారానికి వచ్చిన తర్వాత ఆయన దుందుడుకు చర్యలకు అమెరికా అంతర్గతంగాను, అమెరికా బయట దేశాలు అతలాకుతలం అవుతున్నాయి.డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచానికి అమెరికా మరింత వేగంగా దూరమైపోతోంది. ఆర్థిక, విదేశాంగవిధానాలూ, సైనిక వ్యూహంలో మార్పులు వస్తున్నాయి. ట్రంప్ నేడు ప్రపంచ దేశాలన్నింటిపై ప్రతీకార సుంకాలు విధిస్తానంటున్నారు. పనామా కాల్వను, గ్రీన్లాండ్ను స్వాధీనం చేసుకుంటామన్నారు.కెనడా, మెక్సికోలు తమ దేశంలో కలిసిపోవాలనీ, గాజా నుంచి పాలస్తీనీయులు వెళ్లిపోవాలనీ వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి వలసదారులను వెళ్లగొడతామంటూ గగ్గోలు రేపారు. ఇజ్రాయేల్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నందుకు ఏకంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుపైనే ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు ట్రంప్! ఉక్రెయిన్‌కు సాయం చేస్తూపోతే మూడో ప్రపంచ యుద్ధం వస్తుందనడం, ఇంతవరకు చేసిన సాయానికి ప్రతిగా ఆ దేశంలోని అరుదైన ఖనిజవనరులను తనకివ్వాలని ఆయన డిమాండ్ చేయడం ప్రపంచాన్ని నివ్వెరపరచింది. అన్నిదేశాల మీద సుంకాలు విధిస్తున్న విధానానికి ప్రపంచ దేశాలు అన్నికూడా విస్తుపోతున్నాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ బాంబు పేల్చారు. అనుకున్నట్లుగా విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలువడ్డించారు. భారతదేశ ఉత్పత్తులపై 26శాతం టారిఫ్ వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. వియత్నాం ఉత్పత్తులపై 46 శాతం, చైనాపై 34 శాతం, యూరోపియన్ యూనియన్ (ఈయూ)పై 20శాతం, స్విట్జర్లాండ్‌పై 31, తైవాన్‌పై 32, జపాన్‌పై 24, యూకేపై 10 శాతం సుంకాలను ఖరారు చేశారు. అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు తేల్చిచెప్పారు. ఏప్రిల్ 2వ తేదీని 'విముక్తి దినం'గా ప్రకటించారు. ఈ విషయంగా ఆయన పన్నులు ప్రకటించకముందే ప్రపంచ దేశాల ఆర్థిక శాస్త్రవేత్తలంతా అనేక రూపాల్లో ఈ విషయాలను వెల్లడిస్తూనే వచ్చారు. వారు ఈ విధానాల వల్ల అమెరికా కూడా ఒంటరైపోతుందని, అమెరికాలోని ప్రజలు కూడా సంక్షోభానికి గురవుతారని ఒక వారంగా అనేక విశ్లేషణలు ఇలా వెలువడుతూనే వచ్చాయి. ట్రంప్ ఈసారి 1.4 లక్షల కోట్ల డాలర్ల విలువైన సుంకాలను పెంచేందుకు రంగం సిద్ధం చేస్తుండటం ఇండియానే కాదు, మొత్తం ప్రపంచ ఆర్థిక రంగాన్నే తీవ్రంగా ప్రభావితం చేయనుంది! విదేశాల నుంచి అమెరికా చేసుకున్న మొత్తం దిగుమతుల విలువ నిరుడు 6.6శాతం మేర పెరిగి 4.1 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అదే సమయంలో ఆ దేశ వస్తుసేవల ఎగుమతులేమో 3.2 లక్షల కోట్ల డాలర్లకే పరిమితమయ్యాయి. చైనా,వియత్నాం, మెక్సికో, తైవాన్, జపాన్, కెనడా, దక్షిణ కొరియా, ఇండియా, థాయ్‌లాండ్ తదితరాలతో పాటు యూరోపియన్ యూనియన్ దేశాలతోనూ అమెరికాకు భారీ వాణిజ్యలోటు ఉంది. దాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న డొనాల్డ్ ట్రంప్ దిగు



మతులపై ప్రతీకార సుంకాల ద్వారా వేలకోట్ల డాలర్ల అదనపు ఆదాయాన్ని రాబట్టాలని భావిస్తున్నారు. తన ఎన్నికల వాగ్దానమైన పన్నుల కోతలను అమలు చేయడానికి ఈ నిధులను వినియోగించుకోవాలన్నది ఆయన ఆలోచనగా చెబుతున్నారు. కానీ, ఆక్రమంలో ఆయన అమెరికాను ఏకాకిని చేస్తున్నారు.ఇప్పటికే ట్రంప్ విధించిన సుంకాలను ఎదుర్కోవడానికి చైనా, జపాన్, దక్షిణ కొరియా ఏకతాటిపైకి వస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈయూ దేశాలు సైతం గట్టిగా ప్రతిస్పందించడానికి సంసిద్ధమవుతున్నాయి. ఏతావతా అగ్రరాజ్య పరపతిని పణంగా పెట్టి మరీ ట్రంప్ ఆడుతున్న సుంకాల చదరంగం ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందో చూడాలి! దగ్గర దగ్గర ప్రపంచంలో ఉన్న ఏ ఆర్థిక మేధావి కూడా అమెరికాకు అనుకూలంగా ఒక్కవాక్యం కూడా రాయడం లేదు అనేది స్పష్టమైన అంశం. నిజానికి అమెరికాతో వాణిజ్యం సాగిస్తున్న 'పది' ప్రధాన దేశాల్లో ఇండియా ఒకటి. అంతేకాక ఇప్పుడు అమెరికా అధ్యక్షునిపై అక్కడ వాణిజ్య సంస్థల భాగస్వామ్యం ఒత్తిడి కూడా బలంగానే ఉంది. ఈవిషయంగా వాషింగ్టన్ ఒక కథనాన్ని కూడా ప్రచురించింది. ఆ కథనం ఇలా ఉంది. అమెరికా ఎగుమతులను పెంచేందుకు, టారిఫ్స్, నాన్ టారిఫ్ల, నియంత్రణ అడ్డంకులను తగ్గించాలని భారత్ను ఒత్తిడి చేయాల్సిందిగా అమెరికా పరిశ్రమ సంఘాలు, కంపెనీలు ట్రంప్ ప్రభుత్వాన్ని కోరాయి. యుఎస్ చాంబర్ ఆఫ్‌కామర్స్ (యుఎస్సిసి), కొలైషన్ ఆఫ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్ (సిఎస్ఐఐ) ప్రముఖ బైక్ కంపెనీ హార్లే డేవిడ్సన్ వంటివి ఈ జాబితాలో ఉన్నాయి. ఏప్రిల్ 2న పరస్పర సుంకాల విధింపు ప్రకటనకు ముందు అమెరికా వాణిజ్య ప్రతినిధి (యుఎస్‌ఆర్)కి ఈ మేరకు విజ్ఞప్తి చేశాయి. భాగస్వామ్య దేశాల చట్టవ్యతిరేక వాణిజ్య పద్ధతులపై యుఎస్టిఆర్ ఇటీవల సమీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. భారత వినియోగదారులకు అవసరమైన ఔషధాలను తక్కువ ధరలకు పొందేందుకు వీలుగా ఆరోగ్య సంరక్షణ రంగంలో వాణిజ్యాన్ని పెట్టుబడులను ప్రోత్సహించేలా ఔషధ తయారీ ఉత్పత్తులపై భారత్ దిగుమతి సుంకాలను తగ్గించాలని అమెరికాలోని అతిపెద్ద వాణిజ్య సంప్రదింపుల సంస్థ యుఎస్ఐస్సిసి కోరింది. ప్రపంచ సరఫరా గొలుసును బలోపేతం చేసే ఔషధ తయారీకి రెండవ స్థానంలోకి అనుమతించే నిబంధనలను చేర్చడానికి అవసరమైన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కోరింది. పేటెంట్ పొందిన మందులు, స్టెంట్లు, వైద్య పరికరాలపై జాతీయ ప్రాముఖ్య మెడిసిన్స్ జాబితా కింద ధరల నియంత్రణను, భారత్లో మెడిసిన్ తయారీ ఉత్పత్తుల పెట్టుబడులను నిరోధించే వాణిజ్య విధానాలను, నకిలీ మెడిసిన్ ముప్పును కూడా యుఎస్సిసి ప్రస్తావించింది. సిటిస్కానర్లు, ఇతర అధునాతన శస్త్రచికిత్సకు అవసరమైన పునరుద్ధరించబడిన పునర్వినియోగించే వైద్య పరికరాల దిగుమతిని భారత్ అనుమతించాలని కోరింది. అమెరికన్ కంపెనీల లాభదాయకతను ప్రతికూలంగా ప్రభావితం చేసే సిన్ /డిమెరిట్ వస్తువుల వర్గీకరణ కింద ఆల్కహాల్ లేని పానీయాలపై 28 శాతం జిఎస్టిని తగ్గించాలని యుఎస్సిసి కోరింది. అమెరికా నిజానికి ప్రపంచ దేశాలకు ఎన్నో సాంకేతిక అంశాలను, సాంస్కృతిక విస్తృత అంశాలను నేర్పిందనే వాదన కూడా ఉంది. సాంకేతికంగా ప్రపంచానికి అనేక పరికరాలు అందించగలిగిన స్థాయిలో వుంది. అయితే నేడు ఇవన్నీ తిరగబడుతున్నాయి. ట్రంప్ పాలనలోని 'అమెరికా ఫస్ట్' విధానం అమెరికా ప్రయోజనాలనే అన్నింటికంటే ముందు ఉంచడానికి ప్రయత్నిస్తుంది. భారతదేశం ఇలాంటి ఒడిదుడుకులను ఎన్నింటినో ఎదుర్కొంది. ఎంతోమంది ప్రపంచనియంతలను చూసింది. భారతదేశం చేయాల్సిన పని దేశీయ సంపదను పెంచుకోవడం చైనా, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్,కెనడా వంటి దేశాలతో సంబంధాలను మరింతగా మెరుగుపరచుకోవడం భారతదేశంలో వున్న మేధావులకు, విద్యావంతులకు, సాంకేతిక పరిజ్ఞానులకు అవకాశాలు మెరుగుపరచుకోవడం. భారత దేశ ఔన్నతిని పునరుజ్జీవన శక్తితో అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగ స్ఫూర్తితో మహోజ్వలమైన జాతీయ భావనతో ముందుకు నడవవలసిన చారిత్రక సందర్భం ఇది. ఆ దిశగా ముందుకు నడుద్దాం. •

# 19 దేశాల పౌరులపై అమెరికా కఠిన ఆంక్షలు

## ఉత్తర్వులు జారీచేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీకాలాన్ని గుర్తుకు తెస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. జాతీయ భద్రతను ప్రధానకారణంగా చూపుతూ, 19 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించడంపై కొత్తగా కఠినమైన ప్రయాణ ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులపై ఆయన సంతకం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, 12 దేశాల పౌరులు అమెరికాలో ప్రవేశించడంపై పూర్తి నిషేధం అమల్లోకి రానుండగా, మరో 7 దేశాల వారికి పాక్షిక పరిమితులు వర్తిస్తాయి. పూర్తిస్థాయి ప్రయాణ ఆంక్షలు ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో ఆఫ్ఘనిస్థాన్, బర్మా, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిట్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి. అలాగే బురుండి, క్యూబా, లావోస్, సియెర్రా లియోన్, టోగో, తుర్క్‌మెనిస్థాన్, వెనిజులా దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించే విషయంలో పాక్షిక పరిమితులను ఎదుర్కోనున్నారు. 2025 జనవరి 20న ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వు 14161 ప్రకారం ఈ చర్య తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. తీవ్రవాదం, జాతీయ భద్రతతో సహా వివిధ దేశాల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ముప్పుపై సమగ్రమైన అంచనా వేసిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.

సందర్శకులు, వీసా దరఖాస్తుదారుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం అసాధ్యంగా ఉన్న దేశాలను గుర్తించాలని, అలాంటి దేశాలు జాతీయ భద్రతకు ముప్పు కలిగించే అవకాశం ఉందని ఆ కార్యనిర్వాహక ఉత్తర్వు సంబంధిత ఏజెన్సీలను ఆదేశించింది. కాగా, 2017లో ట్రంప్ విధించిన ప్రయాణ నిషేధం, ముఖ్యంగా మెజారిటీ ముస్లిం దేశాలను లక్ష్యంగాచేసుకున్నప్పుడు అనేక న్యాయస్థానాల్లో సవాళ్లను ఎదుర్కొంది. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు నెలల తరబడి జాగ్రత్తగా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇటువంటి ఆంక్షలు విధించే అధికారం అధ్యక్షుడికి ఉందని ట్రంప్ వర్సెస్ హవాయి కేసులో సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించిందని వైట్ హౌస్ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్ గుర్తు చేసింది. అయితే, ఈ కొత్త ప్రయాణ నిషేధంనుంచి చట్టబద్ధమైన శాశ్వత నివాసితులు గ్రీన్ కార్డ్ హోల్డర్లు, ఇప్పటికే వీసాలు కలిగి ఉన్న వారు, కొన్ని ప్రత్యేక వీసా కేటగిరీల వారికి, అమెరికా జాతీయ ప్రయోజనాలకు అవసరమైన వ్యక్తుల ప్రవేశానికిమినహాయింపులు కల్పించారు. ఈ చర్యను అధ్యక్షుడు ట్రంప్ విదేశీ తీవ్రవాదులు, ఇతర జాతీయ భద్రత, ప్రజా భద్రతకు ముప్పు కలిగించే వారినుంచి అమెరికాను రక్షించడానికి ఉద్దేశించిన సాధారణ భద్రతా ప్రమాణాలు అని వివరించారు.

## బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్

**ముర్షిదాబాద్, జూన్ 4:** సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఓ జవాన్‌ను బంగ్లాదేశ్ వాసులు కిడ్నాప్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఉన్న అంతర్జాతీయ సరిహద్దు వద్ద ఓ బీఎస్ఎఫ్ జవాన్‌ను బంగ్లాదేశీయులు కిడ్నాప్ చేసి అతడిని బందీగా ఉంచారు. కొన్ని గంటల తర్వాత అతడిని విడుదల చేశారు. నుర్పుర్ జిల్లాలోని కథాలియా అనే గ్రామం దగ్గర ఉన్న అంతర్జాతీయ సరిహద్దు దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది. సుతిర బీఎస్ఎఫ్ క్యాంప్ సమీపంలోని చాందనిచౌక్ దగ్గర గల అంతర్జాతీయ సరిహద్దు నుంచి కొందరు బంగ్లాదేశీయులు అక్రమంగా భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వారిని ఆ బిఎస్ఎఫ్ జవాన్ అడ్డుకున్నాడు. దాంతో అతడిని ఆ ముష్కరులు కిడ్నాప్ చేసి బందీ చేశారు. వారందరూ బంగ్లాదేశ్‌లోని చపాయ్ నవాబ్‌గంజ్ ప్రాంతానికి చెందిన వారేనని తెలుస్తోంది. బిఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్ అయిన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొన్ని గంటల్లోనే ఆ జవాన్‌ను ముష్కరులు విడిచిపెట్టేశారు. ప్రస్తుతం ఆ జవాన్ క్షేమంగానే ఉన్నాడని సౌత్ బెంగాల్ ఫ్రాంటియర్ బిఎస్ఎఫ్ వెల్లడించింది. అయితే ఈ కిడ్నాప్ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# అమెరికాలో వలసదారుల అరెస్టులు

### ఒక్కరోజులోనే 2200 మంది

**వాషింగ్టన్, జూన్ 5:** అమెరికాలో వలసదారుల అరెస్టులు ప్రారంభమైనాయి. ఆ క్రమంలో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 2,200 మందిని అరెస్ట్ చేశారు. దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహాయకులు స్టీఫెన్ మిల్లర్, హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఒక్క రోజులోనే 3 వేల మందిని అరెస్ట్ చేయాలని ఆదేశించారని పేర్కొనడంతో ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయని తెలిపింది. అయితే ఒక్క రోజులోనే ఇంత మందిని అరెస్ట్ చేయడం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమమని స్పష్టం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసిఇ అధికారులు అల్టర్‌నేటివ్ టు డిటెక్షన్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకున్న వారిని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమం కింద పత్రాలు లేని వలసదారుల వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా.. యాంకిల్ ద్వారా స్మార్ట్ యాప్స్‌తోపాటు జియో లోకేషన్ పరికరాల ద్వారా వారిని పర్యవేక్షిస్తుంటారు. అలాగే వారు తరచూ ఐసిఇ కేంద్రాలకు రావాల్సి ఉంటుందని ఇప్పటికే వారికి అధికారులు స్పష్టం చేశారు. అయితే ఎడిటిలో నమోదైన వలసదారులు ఐసిఇ కార్యాలయాలకు రావాలంటూ సందేశాలు పంపుతున్నారు. అలా వచ్చిన వారిని అరెస్ట్ చేసి కార్లలో తరలిస్తున్నారు. గతంలో ఐసిఇ పిలుపు వచ్చినా హాజరు కానీ వారిని దేశం విడిచి వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. గతంలో వలసదారులను వెనక్కి పంపిస్తామని ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# తల్లితండ్రులను పట్టించుకోని సంతానంపై కఠినచర్యలకు ప్రత్యేక చట్టం

## అసోం ప్రభుత్వం 2017 చట్టం పూర్తి స్థాయిలో అమలు



**గువాహతి, జూన్ 5:** అస్సాం రాష్ట్ర ప్రభుత్వం 2017లో తీసుకువచ్చిన ప్రాణం చట్టం అనేది ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులు, దివ్యాంగ సోదరుల సంరక్షణ కోసం తీసుకువచ్చిన ప్రత్యేక చట్టం. ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న సంస్థలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , కంపెనీ చట్టం ప్రకారం నిర్వచించిన ప్రభుత్వ కంపెనీలు వంటి సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై వర్తిస్తుంది. ఈ చట్టం ద్వారా ఉద్యోగులపై తల్లిదండ్రుల పట్ల బాధ్యతను చట్టబద్ధంగా విధించడం జరిగింది. ఈ చట్టం ఎందుకు అవసరమైంది, సామాజిక మార్పులు, పట్టణీకరణ పెరగడంతో కుటుంబ వ్యవస్థలో మార్పులు వస్తున్నాయి. పెద్దలు కొడుకులపై ఆధారపడే పరిస్థితుల్లో, కొంతమంది వారి బాధ్యతను తేలికగా తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అనాథుల్లా మారకూడదన్న ఉద్దేశంతో అసోం ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇది కేవలం కుటుంబ విలువలను పరిరక్షించడమే కాదు, ఉద్యోగులను ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా చేస్తుంది. ఈ చట్టం అన్ని స్థాయి ప్రభుత్వ ఉద్యోగులకూ వర్తిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో, ప్రభుత్వ అనుబంధం ఉన్న సంస్థల్లో, కంపెనీ చట్టం కింద ఉన్న సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. ఈ ఉద్యోగులపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు, వివాహం కాని దివ్యాంగ సోదరులు ఈ చట్టం ద్వారా రక్షణ పొందవచ్చు. ఉద్యోగిపై ఆధారపడే తల్లిదండ్రులు లేదా దివ్యాంగ సోదరులు ఈ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చు. ఉద్యోగి తన బాధ్యతలను నిర్వర్తించకపోతే, లేదా మౌలిక అవసరాలు కలిగించకపోతే, వారు అధికారుల వద్ద రాయితీగా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం "ఆధారిత తల్లిదండ్రులు" అంటే తమకు ఆదాయ మార్గాలు లేకపోయి, కొడుకు లేదా కుమార్తెపై ఆధారపడి జీవించే తల్లిదండ్రులు. వారు పెన్షన్ పొందకపోవడం, సొంత ఆదాయ మార్గం లేకపోవడం వంటి పరిస్థితుల్లో ఉంటే, వారిని ఈ చట్టం రక్షిస్తుంది. ఆధారిత దివ్యాంగ సోదరుడు/సోదరి అంటే వైకల్యం ఉన్న, వివాహం కాని వ్యక్తి. అటువంటి సోదరుడు/సోదరి తన జీవనాన్ని కొనసాగించడానికి తగిన ఆదాయం లేక, ఉద్యోగిపై ఆధారపడే వారిగా పరిగణించబడతారు.

వారిని తగిన విధంగా సంరక్షించడం ఉద్యోగి బాధ్యతగా ఈ చట్టం పేర్కొంటుంది. ఆధారిత తల్లిదండ్రులులేదా దివ్యాంగ సోదరులు ఫారమ్‌లో నియమిత అధికారికి ఫిర్యాదు ఇవ్వవచ్చు. ఇది రాతపూర్వకంగా ఉండాలి. ఎప్పుడు అయినా ఫిర్యాదు చేయొచ్చు. అధికారి దానిని స్వీకరించి విచారణకు తీసుకుంటారు. వారు ఫిర్యాదులను పరిశీలించి, 90 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలికి బెయిల్



**కోల్‌కత్తా, జూన్ 5:** ఆపరేషన్‌సింధూర్‌పై అభ్యంతరకరపోస్టులుపెట్టిన న్యాయవిద్యార్థిని శర్మిష్ట పనోలికి కోల్‌కత్తా హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. మతవిద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని ఆమెపై కోల్‌కత్తాపోలీసులు కేసులు నమోదుచేసిన సంగతి తెలిసిందే. రూ.10 వేల పూచీకత్తుతో ఆమెకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు ప్రకటించింది. గురుగ్రామ్‌లో అరెస్టు అయిన పనోలి ఈనెల 13వ రకూ జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. ఆపరేషన్ సిందూర్‌పై బాలివుడ్ నటుల మౌనం ప్రశ్నిస్తూ ఆమె ఇన్‌స్టాలో విడియోను పోస్టు చేసింది. ఆపోస్టు ఉద్రిక్తతలకు తావిచ్చింది. అనేకమంది సోషల్‌మీడియా యూజర్లు ఆమెను హెచ్చరిస్తూ వ్యాఖ్యలుపెట్టారు. దీనితో ఆమె ఆ విడియోను తొలగించి బహిరంగ క్షమాపణలు చెప్పింది. బెంగాల్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో పనోలిపై నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని ఆమె తరపు న్యాయవాది వాదించారు. వజాఖత్ ఖాన్ ఖాద్రి అనే వ్యక్తి గార్డెన్ రీచ్ పోలీస్‌స్టేషన్‌లో ఆమెపై ఫిర్యాదుచేసారు. విచిత్రం ఏమిటంటే ఫిర్యాదుచేసిన ఖాద్రికూడా పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇపుడు అంశంపై ముమ్మర దర్యాప్తుచేస్తున్నారు. ఒక మతపరమైన ట్రస్టు శ్రీరామ్ స్వాభిమాన్ పరిషద్ సంస్థ గార్డెన్‌రీచ్‌పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదుచేసింది. ముంబయి, అస్సాం, దేశంలోని ఇతర ప్రాంతాల్లోకూడా ఖాద్రిపై కేసులు నమోదయ్యాయి. విద్వేషకర ప్రసంగాలు చేస్తున్నారని, దీనివల్ల ఉద్రిక్తతలు,హింస పెచ్చరిల్లే ప్రమాదం ఉందని ఫిర్యాదులు నమోదయ్యాయి.


# తొక్కిసలాట ఘటనను రాజకీయంచేస్తున్న బిజెపి

### కన్నీటి పర్యంతం అయిన కర్ణాటక డిప్యూటీ సిఎం



**బెంగళూరు, జూన్ 5:** ఆర్సీబీ విజయం సందర్భంగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాటను ప్రతిపక్షం రాజకీయం చేస్తోందని, ఇది రాజకీయాలుచేసే సమయం కాదని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ అన్నారు. మీడియాతో మాట్లాడుతు జరిగిన సంఘటనపట్ల క్షమాపణలు చెపుతున్నానని, ఇది ఎంతో ఘోరమని ఆయన కన్నీటి పర్యంతం అయ్యారు. బెంగళూరు ప్రతిష్టను ప్రతిపక్షాలు మరింత దిగజారుస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తంచేసారు. పోలీసులు అనుమతులివ్వలేదన్న వార్తలపై ఆయనస్పందిస్తూ బిజెపి నేతల విమర్శలపై తానుస్పందించబోనని నేను కర్ణాటక ప్రజలకు జవాబుదారీ అని దేశ ప్రజలకు జవాబుదారీ అని ఆయనఅన్నారు. బిజెపి నాయకులే ఇలాంటి విషప్రచారానికి కుట్రదారులని డికె ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు శవరాజకీయాలుచేసుకోనీయండి, ఎన్ని మృతదేహాలపై వారు శవరాజకీయాలు చేసారన్నదానిపై నేను జాబితారూపొందిస్తానని అన్నారు. ఎంతో బాధగాఉంది. బాధితులు మన రాష్ట్రంవారు, బెంగళూరువారు మన సొంతకుటుంబం వారే. బెంగళూరు, కర్ణాటక ప్రతిష్ట పూర్తిగా పోయిందని మేం బాధ్యత తీసుకుంటున్నాం, ఎవ్వరినీ నిందించడంలేదని ఈ సంఘటన అనూహ్యంగా జరిగిందని, ఇంత భారీస్థాయిలో అభిమానులు వస్తారని ఎవ్వరూ ఊహించలేదని ఆయన అన్నారు.

# పాక్ 'మేడమ్-ఎన్' వలలో భారత్ ఇన్‌ఫ్లూయెన్సర్లు!



**ఇస్లామాబాద్, జూన్ 5:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) కింద పనిచేసే.. ఓ మహిళా వ్యాపారవేత్త భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను గూఢచర్యంలోకి లాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన నోషబ షెహజాద మసూద్ లాహోర్‌లో జయాన ట్రావెల్స్ అండ్ టూరిజం పేరిట ఓ సంస్థను నడుపుతోంది. షెహజాద భర్త పాక్ సివిల్ సర్వీసెస్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. షెహజాదకు నిఘా సంస్థ ఐఎస్ఐతో బలమైన సంబంధాలున్నాయి. భారత్‌కు చెందిన జ్యోతి మల్హోత్రా వంటి సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాకిస్థాన్‌లో పర్యటించేందుకు ఆమె సాయం చేస్తోంది. ఐఎస్ఐ ఆమెకు పెట్టిన కోడ్ నేమ్ 'మేడమ్ ఎన్'.

హిందూ, సిక్కు యాత్రికులకు పాకిస్థాన్‌లో పర్యటనలు ఏర్పాటు చేయించేది షెహజాదకు చెందిన సంస్థ ఒక్కటే. ఇది అక్కడి ప్రభుత్వానికి చెందిన ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డులో కలిసి పనిచేస్తోంది. దీనిని బట్టే ఆమెకు ఆ దేశ సైన్యం, ఐఎస్ఐతో ఉన్న బలమైన సంబంధాలు తెలుస్తాయి. ఈమె సంస్థ భారత్‌లోని ఢిల్లీ వంటి చోట్ల ట్రావెల్ ఏజెంట్లను నియమించుకొన్నట్లు తెలుస్తోంది. తాజాగా భారత్‌లో గూఢచర్యం ఆరోపణలపై పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్లు అరెస్టయ్యారు. వారిని ప్రశ్నించగా.. షెహజాద పాత్ర వెలుగు చూసింది. భారత్‌లో ఆమె దాదాపు 500 మందితో స్లీపర్‌సెల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించి పాక్ ఐఎస్ఐ, ఆర్మీనుంచి ఆమెకు స్పష్టమైన సూచనలు వచ్చాయి. పాక్‌కు వచ్చిన భారత ఇన్‌ఫ్లూయెన్సర్లను పాక్ సైనిక అధికారులు, ఐఎస్ఐకు షెహజాదనే పరిచయం చేస్తోంది. మన దేశంలోని దాదాపు 3,000 మంది ఈ సంస్థ నుంచి సాయం పొందినట్లు తెలుస్తోంది. వీరిలో దాదాపు 1500 మంది ఎన్నారైలు గత ఆరు నెలల్లోనే ఆ దేశాన్ని సందర్శించారు. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయంలో వీసా విభాగంలో ఈమెకు విశేషమైన పలుకుబడిఉంది. అక్కడి ఫస్ట్‌సెక్రటరీ (వీసా) సైహైల్‌కమర్,కౌన్సిలర్‌ఉమర్ ప్రేయర్‌తో బలమైన సంబంధాలున్నాయి. ఆమెనుంచి వచ్చే ఒక్క ఫోన్‌కాల్‌తో కోరుకున్న వారికి పాక్ వీసా లభించేది. అదే కార్యాలయంలో వీసా ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎహసాన్ ఉర్‌రెహ్మాన్ అలియాస్ డానిష్‌తో బలమైన పరిచయం ఉంది. 'మేడమ్ ఎన్' రికమండేషన్ ఉంటే భారతీయులకు విజిటర్ వీసావచ్చేసేది. జ్యోతి మల్హోత్రా వ్యవహారం వెలుగు చూడటంతో డానిష్‌ను భారత్‌నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే.



# నేరాల హబ్‌గా బీహార్!

## ఎఐసిసి నేత రాహుల్ ధ్వజం

**పాట్నా, జూన్ 5:** ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆద్వర్యంలో బీహార్ నేరాల హబ్‌గా మారిపోయిందని, నిరుద్యోగం మరింతగా వృద్ధిచెందిందని దీనివల్ల ప్రజలంతా ఉపాధిలేక వలసలు పోతున్నారని ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలి ఎంపి ఆరోపించారు. గయలో ఇటీవల జరిగిన సంఘటనను పురస్కరించుకని ఆయన ఈ వ్యాఖ్యలు చేసారు. అత్యాచార బాధితురాలి తల్లి అస్వస్థతకు గురయితే చికిత్సచేసేందుకువెళ్లిన వైద్యుడిని చెట్టుకు కట్టి తీవ్రంగా కొట్టిన సంఘటనను పురస్కరించుకుని ఆయన సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలుచేస్తూ పోస్టుపెట్టారు. అంతేకాకుండా చెట్టుకు కట్టేసి డాక్టర్‌ను కొట్టిన విడియోను కూడా ఆయన జతచేసారు. డాక్టర్ జితేంద్ర యాదవ్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారని ఈకేసులో నిందితులే ఈ ఘాతుకానికి పాల్పడినా ప్రభుత్వంనుంచి స్పందనలేదని ఆయన దుయ్యబట్టారు. అత్యాచార బాధితురాలు తల్లికి చికిత్సచేసినందుకే ఈ రేప్‌కేసు నిందితులు దారుణంగా డాక్టర్‌ను కొట్టారని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రం నేరాలకు హబ్‌గా మారిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని, వలసలు అందుకే పోతున్నారని ఆరోపించారు. ఇవే నితీష్‌కుమార్ బిజెపి ప్రభుత్వం వాస్తవ స్వరూపమని రాహుల్ ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రతినిధి షమా మహ్మద్ కూడా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర స్థాయిలో విమర్శలుచేసారు. తొమ్మిదేళ్ల అత్యాచార బాధితురాలికి వైద్యం నిరాకరించడంవల్లనే ఆమె చనిపోయిందని ఆరో పించారు. బీహార్‌ను నేరస్తులే నడిపిస్తున్నట్లుగా కనిపిస్తోందని ఆరోపించారు. మోడీని తీష్‌కుమార్ ప్రభుత్వం పూర్తిగా నేరస్తులకు, నేరముఠాలకు, దౌర్జన్యకారులకు లొంగిపోయిందని విమర్శించారు.

# పినాకిమిశ్రాను వివాహమాడిన మహువామొయిత్రా

### ఇద్దరూ ఎంపీలే, రెండురాష్ట్రాల్లో ప్రాతినిధ్యం



**కోల్‌కత్తా, జూన్ 5:** తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా బిజెడి ఎంపి పినాకి మిశ్రాను వివాహమాడినట్లు తెలిసింది జర్మనీ నగరం బెర్లిన్‌లో గతనెల మూడో తేదీ జరిగిన ఈ వివాహానికి సంబందించిన వారి ఫోటో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అయింది. రెండు పర్యాయాలు లోక్‌సభ ఎంపిగా కృష్ణనగర్ నియోజక వర్గంనుంచి ఎన్నికైన మొయిత్రా పినాకి మిశ్రాను వివాహమాడారు. ఒడిశాలోని పూరి నియోజకవర్గంనుంచి మిశ్రా ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఉన్న మొయిత్రా ఒంటినిండా బంగారు నగలతో మిశ్రాతో నడుస్తున్నట్లు కనిపించారు. 1974 అక్టోబరు 12వ తేదీ అస్సాంలో జన్మించిన మొయిత్రా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి ఆ తర్వాత 2010లో టిఎంసిలో చేరారు. కృష్ణనగర్‌నుంచి 2019లో మొదటిసారి ఎన్నికకాగా మళ్లీ 2024లో కూడా ఎన్నికయ్యారు. పార్లమెంటులో నియంత్రృత్వానికి సంబంధించిన ఆరు సూచనలు అన్న అంశంపై ఆమెచేసిన ప్రసంగంతో అందరిదృష్టిలోకి వచ్చారు. ఇక పినాకి మిశ్రా 1959 అక్టోబరు 23న ఒడిశాలోని పూరిలోజన్మించారు. సీనియర్ రాజకీయవేత్త, న్యాయవాదికూడా ఢిల్లీ వర్సిటీ నుంచి లా డిగ్రీ సాధించారు. మిశ్రా తన రాజకీయ ప్రయాణం ఐఎన్‌సినుంచే ప్రారంభించారు. 1996లో పూరి సీటును ఎన్నికయ్యారు. ఆ తర్వాత నవీన్ పట్నాయక్ బిజుజనతాదళ్‌లో ఎన్నికయి అనేకసార్లు అంటే 2009, 2024, 2019ల్లో కూడా ఎన్నికయ్యారు.

# ఆర్సీబీ విజయోత్సవాల వేళ విధుల్లో 1000 మంది పోలీసులు

### హైకోర్టుకు వెల్లడించిన కర్ణాటక ప్రభుత్వం

**బెంగళూరు, జూన్ 5:** ఆర్సిబి విజయోత్సవాల వేళ బెంగళూరులో సంభవించిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానానికి వివరించింది. ఘటన సమయంలో చిన్నస్వామి స్టేడియం పరిసర ప్రాంతాల్లో 1000 మందికి పైగా పోలీసులు మాత్రమే విధుల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే అంతకుముందు ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ మాట్లాడుతూ ఆర్సిబి ఈవెంట్‌కు 5 వేల మంది పోలీసులులతో భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పడం గమనార్హం. తొక్కిసలాట ఘటనపై విమర్శలు రావడంతో ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటోగా పరిగణించింది. వేడుక కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం విషాదంగా మారింది.ఇలాంటి ఘటనలను మనం నివారించగలమా? భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ఏం చేయగలం. అన్నవి ఆలోచించాలి అని కోర్టు అభిప్రాయపడింది. అనంతరం ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదిస్తూ ఈ స్టేడియం సామర్థ్యం 35 వేలు మాత్రమే. సాధారణ సమయాల్లో 30 వేల టికెట్లు మాత్రమే ఇస్తారు. కానీ నిన్నటి కార్యక్రమానికి దాదాపు 2.5 లక్షల మందికి పైగా అభిమానులు వచ్చారు. అందరినీ లోపలికి పంపిస్తారని వారు భావించారు. మధ్యాహ్నం నుంచే రద్దీ మొదలవగా సాయంత్రానికి కిక్కిరిసిపోయి పరిస్థితి చేయిదాటిపోయింది అని వివరించారు. తాము నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించలేదని ప్రభుత్వం ఈ సందర్భంగా తెలిపింది. వాదనలు విన్న ధర్మాసనం దీనిపై తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# యుఎస్ వీసా కోసం సోషల్ మీడియా ఖాతాల తొలగింపు!

### 'వెట్టింగ్' ప్రభావం..




**వాషింగ్టన్, జూన్ 5:** వలసదారుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థులకు వీసాలు మంజూరు చేయడానికి ముందు వారి సోషల్ మీడియా ఖాతాలను తనిఖీ చేస్తామని అమెరికా ప్రభుత్వం చెప్పింది. ఈ పరిణామాలు అమెరికాలో చదవాలని కలలు కంటోన్న భారతీయ విద్యార్థుల్లో గుబులు రేపుతోంది. దాంతో వివాదానికి దారితీస్తాయని భావిస్తోన్న పోస్టులను వారి డిలీట్ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగిస్తున్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

వీసా ఇంటర్వ్యూల సమయంలో వారి రాజకీయ పరమైన అభిప్రాయాలు తప్పుగా అర్థం చేసుకుంటారేమోననే ఆందోళన ఇందుకు కారణమవుతోంది. మామూలుగా చేసే కామెంట్, ఎలాంటి హాని తలపెట్టని పోస్టును కూడా పరిగణనలోకి తీసుకొని వీసాను ఎక్కడ తిరస్కరిస్తారోనని వారు భయపడుతున్నారు. అమెరికా అధికారులు అనుమతించని కంటెంట్‌ను లైక్ లేక షేర్ చేయడం వల్ల ఇబ్బంది ఎదురవుతుందని, ఇలా ఆకస్మికంగా పోస్టులు, ఖాతాలు తొలగించడం కూడా అనుమానాలు రేకెత్తిస్తుందని వీసా కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు. విద్యార్థి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు గత ఐదు సంవత్సరాల కాలానికి సంబంధించి సోషల్ మీడియా వివరాలు అందించాలని ఇమిగ్రేషన్ అధికారులు కోరతారని నిపుణులువెల్లడించారు. దాంతో వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేయడానికి వీలు కలుగుతుందన్నారు. వారినేపథ్యం వీసా లక్ష్యాలకు సరిపోతుందా లేదా?అని తనిఖీ చేస్తారు. చిన్నపాటి రాజకీయ కార్యకలాపాలు, వివాదాస్పద కామెంట్లను వీసా పరిశీలన సమయంలో అనుమానాస్పదంగానే పరిగణిస్తారని హెచ్చరిస్తున్నారు.

**ఏమిటీ సోషల్ మీడియా వెట్టింగ్..?**

వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్ని 'సోషల్ మీడియావెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. దీనిపై ప్రస్తుతం అమెరికా సన్నాహాలు చేపట్టింది. అప్పటివరకు విద్యార్థులకు వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను నిలిపివేశారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# తీవ్ర నేర ప్రవుర్తి వ్యక్తి పై పి.డి. చట్టం అమలు చేసిన ప్రభుత్వం.

## - ఎస్పీఅద్నాన్ నయీం అస్మి

**భీమవరం జూన్ 5 ప్రభాతావార్త :** హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, దోపిడీ వంటి 12 తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో నిందితుడుగా ఉంటూ, చట్టాన్ని తరుచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తున్న భీమవరం పట్టణానికి చెందిన కొత్తపల్లి విక్టర్ బాబు అనే నిందితుడిపై "పీడీ యాక్ట్" ప్రయోగించినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అన్నారు. గురువారం 1టౌన్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. పోలీసు ఆదేశాలను ధిక్కరించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేసారు. పీడీ చట్టం కొత్తపల్లి విక్టర్ బాబు ,తండ్రి యేసుబాబు, చిన్న అప్పారావు తోట, భీమవరం అని చెప్పారు.సత్ప్రవర్తనతో జీవించాలని జిల్లా పోలీసు అధికారులు పలు మార్లు హెచ్చరించినప్పటికీ, పోలీసు వారి ఆదేశాలను ధిక్కరిస్తూ జిల్లాలోని భీమవరం వన్ టౌన్, భీమవరం టూ టౌన్, కాళ్ళ, ఉండి పోలీస్ స్టేషన్ల పరిధిలో తరచూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, 12 తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా వున్న ,ఇతని ని ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నిర్భందించి, రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. విక్టర్ బాబు నేరచరితను వివరించారు. విక్టర్ బాబు ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతున్న కారణంగా నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా సదరు నిందితుడిపై పి.డి.యాక్టు అమలు చేయాలని కోరుతూ భీమవరం వన్ ఇన్స్పెక్టర్ శ ఎం.నాగరాజు గ జిల్లా పోలీసు కార్యాలయంకు ప్రతిపాదనలు పంపగా, వాటిని సిఫార్సు చేస్తూ జిల్లా కలెక్టర్ సి.నాగరాణికి ప్రతిపాదనలు పంపామన్నారు. పోలీసు ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ పరిశీలించి, నిందితుడి ప్రవర్తన సమాజానికి ప్రమాదకరంగా, శాంతిభద్రతలకు విఘాతం



కలిగించే వ్యక్తిగా మారుతున్నాడని భావించి, నిందితుడు విక్టర్ బాబును నిర్భందించి, రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించాలని ఉత్తర్వులు జారీ చేసారని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ముద్దాయిపై పిడి చట్టం ప్రయోగించడంలో విశేష కృషి చేసిన జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు , భీమవరం డీఎస్పీ ఆర్.జయసూర్య , భీమవరం 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. నాగరాజు ని ఎస్పీ అభినందించారు.

# పర్యావరణ దినోత్సవలో మొక్క నాటిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



**భీమవరం జూన్ 5 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు జరుపుకునే వేడుక కాదు, ఇది ప్రతి ఒక్కరి జీవితం లో భాగంగా నిత్యకృత్యంగా కొనసాగాల్సిన యజ్ఞమని కేంద్ర ఉక్కు మరియు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలన్నారు. కేంద్ర మంత్రిగా ఎన్నో బాధ్యతలు ఉన్నా, పర్యావరణ పరిరక్షణకు తాను ఎల్లప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తానని, ఇది నా వ్యక్తిగత కర్తవ్యంగా భావిస్తున్నానని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు

# సిసలిలో నా వైభవంగా పోలేరమ్మ విగ్రహప్రతిష్ఠ



**కాళ్ళ జూన్ 5(ప్రభాతవార్త) :** కోరిన కోరికలు తీర్చే తల్లి పోలేరమ్మని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురాం కృష్ణంరాజు అన్నారు. మండలంలోని సీసలిలో శ్రీపోలేరమ్మ, శ్రీపోతురాజు ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఆలయంలో రాతి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, మూర్తి హెూమం, గర్తన్యాసము, రత్నన్యాసము, యంత్రస్థాపన, బింబస్థాపన నిర్వహించారు బ్రహ్మశ్రీ యమ్. శ్రీనివాస సిద్ధాంతి (స్తపతి) పర్యవేక్షణలో త్రయాహ్నిక దీక్షతో, స్మార్థ ఆగమ శాస్త్ర ప్రకారము వేదపండితులు విగ్రహాలు ప్రతిష్ఠ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, చేశారు హెూమాలు నిర్వహించారు. గ్రామదేవత ఈవిగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాలనుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇంచార్జి జుత్తుగ నాగరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు. గ్రామదేవతకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కట్రెడ్డి సురేష్ కుమార్, నూకల భోగేంద్రబాబు, వాస్కూరి శ్రీనివాసరావు, తోట రామదాసు, గణేశ్న పద్మారావు, గణేష్ ని శ్రీనివాసరావు ( నల్లశ్రీను,)మాజీ ఎం.పీ.పీ. ఆరేటి వెంకటరత్నప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు గుండా బత్తుల వెంకట నాగేశ్వరరావు, ఆలయ పునర్నిర్మాణకమిటీ, జిమ్మా పెద్దలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.



# హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే ఆరిమిల్లి .



అత్తిలి – జూన్ 5 ( ప్రభాత వార్త ):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలుచేస్తున్నట్లు తణుకు శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు .అత్తిలి లో జరిగిన మండల పరిషత్ సర్వసభ్యసమావేశం లో శాసన సభ్యుడు రాధాకృష్ణ పాల్గొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిపనులు కూడా చేపట్టి అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పాఠశాలలు తెరిచేలోగా వారి ఖాతాలలో జమ అవుతాయన్నారు. ఆగష్టు 15 నుండి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో రహదారులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతులనుండి లక్ష్యాన్ని మించి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. వచ్చే వర్ష కాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా వైద్య , పంచాయతీ రాజ్ శాఖల వారు సమన్వయము తో చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా తణుకు మండలంలో 10 వేలు , ఇతర మండలంలో 5 వేలు వంతున నాటేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మూలించకని కోరారు.జూన్ 21 న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవము సందర్భంగా 2 కోట్ల మంది యోగాలో పాల్గొనాలనే ముఖ్యమంత్రి ధ్యేయన్ని నెరవేర్చాలని కోరారు. యోగా మానసిక శారీర వికాసం కు దోహదం చేస్తుందన్నారు. అత్తిలి ఎంపిపి మక్కా సూర్యారావు అధ్యక్షత వహించారు.మండల ఉపాధ్యక్షురాలు కొనకళ్ల విజయనిర్మల , సుంకర నాగేశ్వరరావు , జెడ్పిటిసి అడ్డాల జానకి , ఎంపిడిఓ పి శ్యామ్యూల్ , తహసీల్దార్ ద సిక వంశి ఎంపిటిసిజం లు , అధికారులు పాల్గొన్నారు.

# చాట్రాయి మండల తెదేపా అధ్యక్షుడిగా ఇజ్జిగాని

## - అధికారిక ప్రకటన చేసిన మంత్రి

**చాట్రాయి, జూలై 5, ప్రభాతవార్త :** చాట్రాయి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఆరుగొలను పేట గ్రామానికి చెందిన ఇజ్జి గాని వెంకటేశ్వరరావును నియామకం చేసినట్లు రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి కొలుసు పాదసారథి అధికారికంగా ప్రకటించారు.ఆరుగొలను పేట గ్రామానికి చెందిన ఇజ్జిగాని వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ మండల స్థాయిలో ఒక గుర్తింపు గల నాయకుడిగా ఎదిగారు. ఆరుగొలను పేట గ్రామానికి చిన్న వయస్సులోనే సర్పంచ్ గా విజయం సాధించారు. గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించారు. అంతేకాకుండా మండల స్థాయి నాయకులతో సమన్వయంతో ఉంటూ తనకంటూ ప్రత్యేకతను సాధించారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తూ వచ్చారు. వివాదరహిత వ్యక్తిగా మండలంలో పేరు సాధించడంతో ఇటీవల మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నిక కోసం మంత్రి పార్థసారథి అభిప్రాయ సేకరణ చేయడంతో ఇజ్జిగాని వైపు మండల నాయకత్వం మొగ్గు చూపించటంతో బీసీ గౌడ కులానికి చెందిన ఇజ్జిగాని అందరిని కలుపుకుంటూ మండల నాయకత్వాన్ని నడిపించాలని మంత్రి ఆదేశించారు.మండలంలో గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా మండల పార్టీ వ్యవహరించాలని ఏ గ్రామంలో గ్రూపులో ఉన్న క్షమించేది లేదని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మండలంలోని అన్ని గ్రామాల నాయకులను కలుపుకొని ముందుకు సాగాలని మంత్రి చెప్పినట్టు తెలుస్తోంది. ఆరుగొలను పేట గ్రామంలో పార్టీ అధ్యక్షుడు పదవి కూడా పానుగళ్ళ కోటేశ్వరరావుకు నియమిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల నాయకులకు సహకరిస్తూ పార్టీని ముందుకు నడిపి చాట్రాయి మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నడుం బిగించాలని మంత్రి ఆదేశించారు. ఏది ఏమైనా చాట్రాయి మండల అధ్యక్ష పదవి బీసీలకు దక్కటంపై సర్వత్రా వర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భంచాక ఇప్పటివరకు మండల పార్టీ బీసీలకు దక్కలేదు.



# జిల్లా పోలీస్ శాఖకు హై-టెక్ డ్రోన్ ను అందించిన రఘు రామ కృష్ణ రాజు

**భీమవరం జూన్ 5 ప్రభాతవార్త :**జిల్లా పోలీసు శాఖకు మౌలిక వసతులు కల్పనకై విశేష కృషి చేస్తున్న రఘు రామ కృష్ణ రాజు కు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి కృతజ్ఞతలు తెలిపారు.గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆకివీడు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన "వనమహోత్సవం" కార్యక్రమంలో ఉండి శాసన సభ్యులు రఘు రామ రాజు తో కలిసి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మొక్కలను నాటారు.ఈసందర్భంగా మాట్లాడారు. ఆకివీడు సర్కిల్ పరిధిలో పరిధిలో అసాంఘిక కార్యక్రమాల నిర్మూలన, ట్రాఫిక్ నియంత్రణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ మరియు ఇతర పోలీసింగ్ అవసరాల కొరకు వినియోగించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీతో కూడిన డ్రోన్ ను రఘు రామ కృష్ణ రాజు గా జిల్లా ఎస్పీ కి అందించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని స్మార్ట్ పోలీసింగ్ విధానంతో ముందుకు సాగుతున్న పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో డ్రోన్‌ను బహుకరించటం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు ,భీమవరం సబ్ డివిజన్ డిఎస్పీ ఆర్.జయసూర్య , ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. జగదీశ్వర్ రావు గారు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# జంగారెడ్డిగూడెంలో నారాయణ ఒలంపియాడ్ స్కూల్ నూతన భవన ప్రారంభోత్సవం

**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త:** అత్యున్నత ప్రమాణాలు నాణ్యతతో కూడిన విద్యను అందించడంలో దశాబ్దాలుగా నిరంతరం కృషి సలుపుతున్న నారాయణ విద్యా సంస్థలు విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి తోడ్పడాలని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని మండవల్లి సోంబాబు పెట్రోల్ బంకు పక్కన అన్ని హంగులతో, సౌకర్యాలతో నారాయణ ఒలంపియాడ్ స్కూల్ నూతన భవనం ప్రారంభ కార్యక్రమం గురువారం నారాయణ విద్యాసంస్థలు జనరల్ మేనేజర్ వి. విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఒలంపియాడ్ స్కూల్ నూతన భవనం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 200 బ్రాంచీలకు పైగా ఉన్న నారాయణ విద్యాసంస్థలు డైరెక్టర్ పొంగూరి రమాదేవి ఆధ్వర్యంలో దినదిన అభివృద్ధి చెందుతూ అనేక మంది మంచి విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా ఎజిఎం పి రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయవంతంగా అన్ని అవకాశాలను అందిపుచ్చు కోవడానికి ఇంటిగ్రేటెడ్ సిలబస్ తో కూడిన కరిక్యులం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. దీనికి విద్యార్థులే నిదర్శనం అన్నారు. దీనికి కారణం ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ విలువలతో కూడిన విద్యతో ఘనవిజయం సాధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ వి.లక్ష్మీ నారాయణ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, ఏఓ పవన్ , ఉపాధ్యాయ బృందంతో పాటు బీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి,పట్టణ ప్రముఖులు మండవల్లి సోంబాబు,జడ్పిటిసి పోల్నాటి బాబ్జి, కౌన్సిలర్ కఠారి వాసు నాయకులు పరిమి సత్తిపండు,మండవ లక్ష్మణరావు, కొండ్రెడ్డి కిషోర్,రావూరి కృష్ణ, పెనుమర్తి రామ్ కుమార్,చెరుకూరి శ్రీధర్,గుమ్మడి



ప్రసాద్,నంబూరి రామచంద్ర రాజు,మేకా ఈశ్వరయ్య,బొబ్బర రాజ్ పాల్ కుమార్, పాతూరి అంబేద్కర్, తదితరులు పాల్గొన్నారు. నారాయణ ఒలంపియాడ్ స్కూల్ నూతన భవనంలో వివిధ విద్యా భాగాలను ఎమ్మెల్యే రోషన్ కుమార్,కరాటం రాంబాబు, తదితరులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రోషన్ కుమార్ ను నారాయణ ఒలంపియాడ్ స్కూల్ మేనేజ్మెంట్ ఘనంగా సత్కరించారు.

# మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

**ఆగిరిపల్లి జూన్ 5 ప్రభాతవార్త :** పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎండిఓ బి భార్గవి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృక్షో రక్షతి రక్షితః వృక్షాలను పెంచితే అవి పర్యావరణాన్ని రక్షిస్తాయని ఆమె అన్నారు. స్థానిక ఎస్ డబ్ల్యూ పిసి కార్యాలయంలో గ్రామ సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి విక్టర్ బాబు డిప్యూటీఎంలో ఆనందబాబు తదితరులు మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అంగన్వాడి టీచర్స్ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




# మొక్కలు నాటడం మానవాళి సంక్షేమం కోరడం

**నరసాపురం ప్రభాతవార్త :**ప్రపంచ పర్యావరణ దినోత్సవం స్థానిక శ్రీ వై ఎన్ కళాశాల లో ఎన్. ఎస్.ఎస్., ఎన్.సి.సి., నరసాపురం మండల న్యాయ సేవాదికార సంస్థ మరియు సామాజిక సేవా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలను నాటడం జరిగినది. ఈ కార్యక్రమంలో జూనియర్ డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్. వరలక్ష్మీ మాట్లాడుతూ, 'పర్యావరణ పరిరక్షణ ప్రక్రియలో భాగంగా మనమందరం విధిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, ప్రజలలో కూడా అవగాహన కల్పించి వారిచేత కూడా మొక్కలను నటించే ప్రక్రియలను చేపట్టాలని, విద్యార్థి దశ నుండి ఈ విధంగా చేసినట్లయితే రాబోయే కాలంలో పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని ' అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డా. చినమిల్లి సత్యనారాయణ రావు, గవర్నింగ్ బాడీ సభ్యులు మరియు అకడమిక్ అడ్వైజర్ రంగినీడి సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ చింతపల్లి కనక రావు, వైస్ ప్రిన్సిపాల్ బెజవాడ వెంకట రత్నం, డా. కె ఎస్ వి రంగారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ , లీగల్ సర్వీసెస్ సభ్యులు చల్లా దానయ్య నాయుడు, ఫణికర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ చింతా సోమేశ్వరి, సాధె యాకోబు, ఎన్.సి.సి. ఏ.ఎన్. ఓ. సునీత, కోర్టు సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు, ఎన్.ఎస్.ఎస్. కేడేట్స్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# సత్యవరంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట



**పెనుమంట్ర, జూన్-05, ప్రభాతవార్త:** మండలంలోని వెలగలేరు శివారు సత్యవరం గ్రామంలో వేం చేసియున్న స్వయంభు శ్రీ నాగవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణం మరియు స్వామి వారి విగ్రహ ప్రతిష్ట గురువారం వైభవంగా జరిగింది. స్వామి వారికి అమ్మవారికి గత మూడు రోజుల నుండి భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. మూడో రోజైనా గురువారం ఆలయ కమిటీ విగ్రహ ప్రతిష్ట చేపట్టి అన్న సమారాధన ఘనంగా ఆలయ కమిటీ నిర్వహించింది.

# మూగజీవాలను హింసించిన, వధించిన,అక్రమంగా రవాణా చేసిన చట్టరీత్యా కఠిన చర్యలు

**భీమవరం జూన్ 5 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం గురువారం జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మనుషుల మాదిరిగానే జంతువులకు కూడా ఆకలి, దప్పిక, స్పర్శ కలిగి ఉంటాయని, సహజ సిద్ధ వాతావరణంలో జీవించాలని కోరుకుంటాయన్నారు. కావున మూగ జీవాల పట్ల ప్రేమను కలిగి ఉండాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, దూడలను వధించకూడదని, ఎవరైనా చట్ట విరుద్ధంగా పశువులను రవాణా చేసిన, వధించినా చట్ట ప్రకారంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జంతు రవాణా చట్టం 1978 ప్రకారం పశువులను రవాణా చేయాలంటే పశుసంవర్ధక శాఖ నుండి ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలన్నారు. కేంద్ర మోటార్ వెహికల్ చట్టం 2015 ప్రకారం రవాణా శాఖ నుండి ప్రత్యేక లైసెన్స్ పొందిన వాహనములోనే



పశువులను తరలించాల్సి ఉంటుందన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, రవాణా శాఖలు వారి డివిజనల్, మండల స్థాయి కమిటీలను అప్రమత్తం చేసి ఆవులు, దూడలు, పెయ్యలను అక్రమంగా జంతు వధకు రవాణా కాకుండా, జంతు వద జరగకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఎవరైనా చట్టం ఉల్లంఘించిన ఎడల వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. తొలుత గోవధ నిషేధం చట్టం అవగాహనపై డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు, కమిటీ సభ్యుల చేతుల మీదుగా గోడపత్రికను ఆవిష్కరించారు.

# స్విఫ్ట్ డిజైర్ కారు-ఐసర్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొని ఒక వ్యక్తి మృతి

**మొగల్తూరు జూన్ 5 (ప్రభాతవార్త)** ముత్యాలపల్లి బ్రిడ్జిపై గురువారం ఉదయం 5,52 నిమిషములకు, మచిలీపట్నం నుండి రావులపాలెం వెళుతున్న, ఏపీ 37 %వయ%1272 నెంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారు, ఏపీ 37 యు సి7123 నెంబర్ గల ఐసర్ వ్యాన్, మొగల్తూరు మండలం నక్క వారి పాలెం లో ఉన్న వర్మ మెరైన్ కంపెనీ, వాహనం, ఈ రెండు వాహనములు ముత్యాలపల్లి బ్రిడ్జిపై, 5,52 నిమిషాలకు ఎదురెదురుగా ఢీకొనడంతో. స్విఫ్ట్ డిజైర్ లో ఉన్న మచిలీపట్నానికి చెందిన వ్యక్తి కర్రి వెంకటరెడ్డి, చావు బతుకుల మధ్యలో కొట్లాడుతుండగా, ఈ సమాచారం అందుకున్న మొగల్తూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, 108 అంబులెన్స్ వాహనంపై నరసాపురం ప్రభుత్వాసుపత్రికి, సిపిఆర్ చేసుకుంటూ, ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగింది, ఐసర్ వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తుల్లో, ఒక వ్యక్తి రొయ్యల గ్రేడర్, వ్యాను నుంచి కాలువలో పడిపోవడంతో.



అక్కడే ఉన్న కొల్లాటి దుర్గాప్రసాద్. కొందరు వ్యక్తులు పడవ తీసుకుని వెళ్లి గ్రేడర్ను రక్షించారు, గ్రేడర్ కు స్వల్ప గాయాలయ్యాయి, ఐచర్ వ్యాన్ లో ఉన్న రెండు వ్యక్తి డ్రైవర్ పరారీలో ఉన్నాడు, ఆసుపత్రికి తీసుకువెళ్లిన కర్రీ వెంకటరెడ్డి ని డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు, మొగల్తూరు పోలీసులు జరిగిన సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి, - జిల్లా పరిషత్ చైర్పర్సన్ గంట పద్మశ్రీ ప్రసాద్,

**పెనుమంట్ర, జూన్-05, ప్రభాతవార్త:** మండలంలోని ఆలమూరు సచివాలయ కార్యాలయ ఆవరణలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్పర్సన్ గంట పద్మశ్రీ ప్రసాద్ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ మనుగడ అడవుల మీద ఆధారపడి ఉందని అన్నారు. ఇందుకోసం పర్యావరణన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు మొక్కలను పెంచి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కడలి ఏడుకొండలు, తేతలి వెంకట్రామారెడ్డి, గ్రామ సర్పంచ్, స్థానిక యం.పి.టి.సి. సభ్యులు, స్థానిక కూటమి నాయకులు, యం.పి.డి.వో పాల్గొన్నారు.



## వృక్షాలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త : వృక్షాలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం కాలుష్యాన్ని అరికడదాం అని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం వనం మనం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారందరితో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి రమణ,చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి,టిడిపి సీనియర్ నాయకులు రావూరి కృష్ణ,కొండ్రెడ్డి కిషోర్,డాక్టర్ దాసరి శేషు, మహంకాళి రామ్మోహనరావు, పెనుమర్తి రామ్ కుమార్,కౌన్సిలర్లు పిపిఎన్ చంద్రరావు,వలవల తాతాజీ, మారిశెట్టి బాల చిట్టమ్మ,చెరుకూరి శ్రీధర్,నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతిని కాపాడుకోవాలి, ఎమ్మెల్యే పితాని,



పెనుమంట్ర, జూన్-05, ప్రభాతవార్త: ప్రకృతి మనందరి ఆస్తి అని, దానిని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై పై ఉందని ఆచంట శాసనసభ్యుల పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం పెనుగొండ, ఆచంటలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కల నాట్లే కార్యక్రమాన్ని పితాని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవులను కాపాడడం, నీటి వనరులను సంరక్షించడం మన కర్తవ్యం అని అన్నారు. ఈ దిశగా ప్రభుత్వము భారీగా కార్యక్రమాలను చేపడుతోందన్నారు. మొక్కలు వల్ల స్వచ్ఛతతో కూడిన పరిసరాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. అందుకే స్వచ్ఛ భారత్ లో భాగంగా, 'స్వచ్ఛాంధ్ర'గా ముందుకు సాగుతున్నాం అన్నారు. చెత్తను శుద్ధ ఇంధనంగా మలుచుతూ ప్రకృతిని సంరక్షిస్తున్నాం అన్నారు. ఈ సంవత్సరం పర్యావరణ దినోత్సవం థీమ్ ం ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలన అని, ఇది మనందరి బాధ్యత అని అన్నారు.

## ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలి



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ తెలిపారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సమావేశమునకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ అధ్యక్షత వహించారు. ముందుగా కమిటీ కన్వీనర్ డాక్టర్ బేబీ కమల ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు కంచర్ల గణేష్,నాయుడు శ్రీనివాస్, డి.వెంకటలక్ష్మి, కోటగిరి ప్రమీల, కమిషనర్ కె.వి.రమణ పట్టణ టిడిపి అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్,చింతలపూడి టిడిపి అడ్వైజర్ రావూరి కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

## నేడు నాగిరెడ్డిగూడెంలో ఎమ్మెల్యే రేషన్ కుమార్ పల్లెనిద్ర

జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : పల్లె వెలుగు స్వర్ణ గ్రామం కార్యక్రమంలో భాగంగా చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి గ్రామ సభల్లో సంబంధిత అధికారులతో కలిసి స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో ముచ్చటించి,వారి సమస్యలను తెలుసుకొని,ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు.

## పారజాత గిరిలో వనం మనం



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెంలోని గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆవరణలో వనం మనం కార్యక్రమంలో భాగంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి మాని కల రాంబాబు ఆధ్వర్యంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నల్లూరి ఋషికేష్ ,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతి రాజు,దండు ధనరాజు, గొట్టుముక్కల భాస్కర రాజు , ఆలయ సిబ్బంది పాల్గొన్నారు .

**కోర్టు ప్రాంగణంలో :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ప్రాంగణంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జ్ సిహెచ్ కిషోర్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ జి ఎస్ ఆర్ మూర్తి, న్యాయవాదులు పోలీసులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ ఆలయం నందు పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు ప్రవచనం నిర్వహణ



మొగల్తూరు జూన్ 5 (ప్రభాతవార్త) శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు పురస్కరించుకుని గురువారం 12వ రోజు కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 6 గంటలకు, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు గారిచే ప్రవచనా కార్యక్రమం నిర్వహించారు, ఆయన, పలు టెలివిజన్ ఛానల్లో, వివిధ శీర్షికలు నిర్వహిస్తూ, వేలాది ఎపిసోడ్ తో పాటు, పలు సాహిత్య ఆధ్యాత్మిక అంశాలపై ప్రసంగాలు చేశారు, పద్య కావ్యాల పరిశోధన, పాటలు వంటి వివిధ అంశాలపై గరికపాటి రాసిన 14 పుస్తకాలు ప్రచురితమయ్యాయి, దారుణ బ్రహ్మ రాక్షసుడు , అవధాన శారద వంటి బిరుదులు, కళా రత్న, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభ పురస్కారం, కొప్పరపు కవులు పురస్కారం, తదితర పురస్కారాలు, కనకాభిషేకాలు, సువర్ణ కంకణాలు మొదలైన గౌరవాలు అందుకున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

### - తహసిల్దార్ ఈశ్వర్



చాట్రాయి, జూన్ 5, ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉందని చాట్రాయి మండల తహసిల్దార్ ఈశ్వర్ చెప్పారు. తహసిల్దార్ కార్యాలయంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్కసారైనా తమ తల్లిదండ్రుల పేరుతో ఒక మొక్కను నాటాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణం కలుషితం కాకుండా ఉండాలంటే మొక్కలు పెంపకం అవసరమని దీనివల్ల కాలుష్యం నివారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మందపాటి బసవ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జి గాని వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు ఆదిమూలం నాగమోహన శర్మ, జనసేన మండల ఉపాధ్యక్షుడు తుమ్మల జగన్, ఎండిఓ విజయలక్ష్మి, ఏపీవో, ఏపిఎం, పలు కార్యాలయాలు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చనుబండ గ్రామంలో జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, నక్కా రాముల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మండలంలో అన్ని గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## జనసేన ఆధ్వర్యంలో ప్రజా తీర్పు దినం



అత్తిలి – జూన్ 5 ( ప్రభాత వార్త ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అనుకూలం గా ప్రజలు తీర్పు ఇచ్చిన సందర్భంగా అత్తిలి మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రజా తీర్పు దినం ను పాటించారు. బస్ స్టేషన్ సెంటర్ వద్ద మండల జనసేన పార్టీ అధ్యక్షుడు దాసం ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి విజయోత్సవాన్ని నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి , పట్టుదలతో బల్లిపాడు లో....రాష్ట్ర ప్రజలు చరిత్రను తిరగ రాశారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నాటి పాలక పక్షాన్ని ఓడించి జనసేన, టిడిపి, బీజేపీ ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించి ఏడాది పూర్తయిన సందర్భంగా 'పీడ విరగడై ఏడాది' అనే కార్యక్రమాన్ని బల్లిపాడు జనసేన పార్టీ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమము లో గోదావరి జిల్లాల రీజినల్ కొ ఆర్డినేటర్ కాట్నం విశాలి , జిల్లా కార్యదర్శి అన్నెం విశ్వప్రభు, బడేటి త్రినాథ్,ఆకుల రామ చంద్రరావు, కె అప్పారావు,,జన సైనికులకు వీర మహిళలు పాల్గొన్నారు.

## ఈడూరు లో ప్రారంభమైన వరాల వెంకన్న కల్యాణోత్సవాలు.



అత్తిలి – జూన్ 5 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం ఈడూరు లో గల వరాల వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఘనం గా ప్రారంభమయ్యాయి . తెల్లవారుఝామున భక్తులచే గోవింద మాలా దీక్ష స్వీకరణ కార్యక్రమం జరిగింది. సన్నిధి నాగ వెంకట సత్య సూర్య రామలింగేశ్వరరావు , వీర పద్మ , మామిడిపల్లి రాంబాబు , నాగమణి దంపతులచే సుప్రభాత సేవ , మేలుకొలుపు , తోమాల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. వరాల వెంకటేశ్వర స్వామి వారిని పెండ్లి కుమారునిగాను , శ్రీ దేవి , భూదేవిలను పెండ్లికుమార్తెలుగా అలంకరించారు. పడాల వెంకటేశ్వరరావు దంపతులు శేష వస్త్రాలు సమర్పించారు . అల్లూరు సత్యనారాయణరాజు , సీతారామరాజు దంపతులచే వివిధ పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి.



అత్తిలి – జునె5 ( ప్రభాత వార్త ): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ అత్తిలి గ్రంధాలయాధికారి డి. కృష్ణారావు కోరారు. అత్తిలి శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణ లో భాగంగా పరిసరాలను పరిశుభ్రతపై రిసోర్స్ పర్సన్ బి. నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. కాలుష్య కారకాలను వివరించారు. రిటైర్డ్ టీచర్ కె. వెంకట్రావు పి . వెంకటేశ్వరరావు, ఎన్ దుర్గాప్రసాద్ ,కె. అనుపమ, ఎం. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



జీలుగుమిల్లి, జూన్-05, ప్రభాతవార్త: మండలంలోని అన్ని పంచాయతీలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఇంచార్జ్ మండల అభివృద్ధి అధికారి నిఖిల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ప్రభుత్వం లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం చేపట్టిందని, ఆ మొక్కలను సంరక్షించే బాధ్యత అందరిదీ అన్నారు. మండలానికి 15వేల మొక్కలను నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జాన్ వెస్లీ, అటవీ శాఖ సిబ్బంది రాంబాబు, మారిష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వివేకానంద పాఠశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కొవ్వూరి సింధు భవిత 582/600

పెనుమంట్ర, జూన్-05, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు వివేకానంద పాఠశాల పది విజేతలకు ప్రతిభ అవార్డ్ లు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ ప్రతిభా పురస్కారాలు చెల్లబోయిన ప్రణీత, కొవ్వూరి సింధు భవితకు దక్కినట్లు పాఠశాల డైరెక్టర్ గుడిమెట్ల రామారెడ్డి గురువారం తెలిపారు. వీరికి స్కూల్ అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## వ్యవసాయ అనుబంధ రంగాల రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహణ



మొగల్తూరు జూన్ 5 (ప్రభాతవార్త) యూనియన్ బ్యాంక్ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు వ్యవసాయ అనుబంధ రంగాల రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ హెడ్ వెంకన్న బాబు మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మరియు డ్వాక్రా సంఘాలకు, మరియు అనుబంధ రంగాలకు సంబంధించి అధికారులకు, యూనియన్ బ్యాంక్ తీస్తున్నటువంటి సేవలు కోసం, యూనియన్ బ్యాంక్ అందిస్తున్న రుణాలకు సంబంధించి, బ్యాంకు వారిని సంప్రదించినట్లయితే, ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరికి వ్యవసాయ మరియు పాడి పరిశ్రమల వృద్ధి కై రుణాలు మంజూరు చేయబడునని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సీఎం క్రెడిట్, శ్రీధర్, ఎల్డిఎం, నాగేంద్రప్రసాద్, రాబిడి డిపార్ట్మెంట్, మార్టిన్, వంశి, బ్రాంచ్ మేనేజర్, వై, మధుబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, నీలిమ మామ్, మండల అగ్రికల్చర్ ఆఫీసర్, ఎస్, అబ్దుల్ రహీం, తదితర యూనియన్ బ్యాంక్ సిబ్బంది, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వృద్ధులకున రేషన్ సరుకులు పంపిణీ చేసిన తాసిల్దార్ కే రాజ్ కిషోర్

మొగల్తూరు జూన్ 5 (ప్రభాతవార్త) ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1 నుండి రేషన్ డిపోలు వద్దనే సరుకులు తీసుకోవాలని, 60 సంవత్సరములు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడం లో భాగంగా, గురువారం , మండల తాసిల్దార్ కే రాజ్ కిషోర్, మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కల వారి తోట సమీపంలో ఉన్న, కుక్కల హనుమంతరావు, పెరాలసిస్ పేషెంట్ , ఇంటి వద్దకు వెళ్లి రేషన్ బియ్యం, షుగరు, అందించడం జరిగింది

## జంతువధ నిషేధం పోస్టర్ ఆవిష్కరణ.


అత్తిలి – జూన్ 5 ( ప్రభాత వార్త ): జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంతు వ ధ నిషేధం పోస్టర్ ను తణుకు శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఆవులు , దూడలు , ఒంటెల వధ నిషేధమన్నారు. వాటిని వధించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా జంతు సంక్షేమ సంఘ డైరెక్టర్ ఆల్తి అజయ్ కుమార్ , ఎంపిపి మక్కా సూర్యారావు , జెడ్పిటిసి అడ్డాల జానకి , మండల ఉపాధ్యక్షులు సుంకర నాగేశ్వర్రావు , కొనకళ్ల విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## వేలేరుపాడులో వనమహోత్సవ కార్యక్రమం



వేలేరుపాడు, జూన్ 5, ప్రభాత వార్త :ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వన మహోత్సవ కార్యక్రమంలో వేలేరుపాడు మండలంలోని తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, రేపాకగొమ్ము పంచాయతీ ఆఫీసులలో ఎంపీడీవో శ్రీహరి, ఆర్ఐ భుజంగరావు, తెదాపా మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, జనసేన మండల అధ్యక్షులు గణేసుల ఆదినారాయణ, రేపాకగొమ్ము సర్పంచ్ సోడే వెంకమ్మ తదితరులు మొక్కలను నాటారు. మొక్కలు నాటిన తదనంతరం ప్రతి ఒక్కరు మొక్కలను పరిరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యాలయాల్లోనూ అంగనవాడి సెంటర్ల నందు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, వీఆర్వోలు మరియు ఉపాధి హామీ సిబ్బంది, ఎమ్మార్పీ సిబ్బంది, వైద్య సిబ్బంది, వెలుగు సిబ్బంది, పాల్గొనడం జరిగింది. వనమహోత్సవ కార్యక్రమంలో శాఖమూరి సంజీవులు, మేచినేని. సంజయ్, కొమ్మల వెంకటేశ్వరరావు, కరటూరి రాధాకృష్ణ, పసుపులేటి లక్ష్మయ్య, కట్టం రాంబాబు, కోటిపల్లి ముత్యాలరావు, సారే బాబ్జి ,పొట్ల మోహన్ దొర, కె. క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ పై డ్రోన్లు



అత్తిలి – జునె5 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలంలో రైతులకు సబ్సిడీ పై 2 డ్రోన్లు ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయాధికారి టికె రాజేష్ తెలిపారు. అత్తిలి మండల పరిషత్ సర్వసభ్యసమావేశం ఎంపిపి మక్కా సూర్యారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏ ఓ మాట్లాడారు. ఉపాధి హామీ పథకం క్రింద పచ్చగడ్డి ని పెంచే రైతులకు ఎకరాకు 69 వేలు అందచేస్తారని పశు సంవర్ధక శాఖ అధికారి శంకర భావ నారాయణ తెలిపారు. కొత్తగా 37 గోకులం షెడ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అత్తిలి ఆరోగ్యకేంద్రం పరిధిలో 2 ఆశా వర్కర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వైద్యాధికారి నాగరాజు తెలిపారు. టెక్నీషియన్ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. మంచిలి పిహెచ్సి పరిధిలో పాలి లో ఆశా వర్కర్ పోస్ట్ ఖాళీగా నున్నట్లు వైద్యాధికారి తెలిపారు. నాబార్డ్ నిధులతో అత్తిలి గుమ్మంపాడు రోడ్ కు కోటి 9 లక్షలు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఏ ఈ సూర్యనారాయణ తెలిపారు. రేషన్ కార్డులలో కొత్తగా 1776 మంది నమోదు అయినట్లు తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. గతంలో ఇండ్లస్థలం మంజూరైన లబ్ది దారులకు అనుకూలంగా లేక ఇండ్లు నిర్మించుకోని వారి స్థలాలు అభివృద్ధికి ఎమ్మెల్యే రాధాకృష్ణ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిపి మక్కా సూర్యారావు తెలిపారు. వసతి గృహాల్లో అధికంగా విద్యార్థులను చేర్చుకోవాలని ఆ శాఖ అధికారిని కోరారు. మంచిలి డ్రైన్ గత 10 సంవత్సరాలుగా త్రవ్వక పోవటం వల్ల ఈ డు రు తదితర పంట పొలాలు మునిగి పోతున్నాయని మండల ఉపాధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు తెలిపారు. కాలువలు త్రవ్విన మట్టి గట్లు పై వేయటం వల్ల ప్రయాణికులకు అసౌకర్యంగా ఉందని పాలూరు ఎంపీటీసీ శర కడం రామలింగ విష్ణు మూర్తి అన్నారు. అత్తిలి లో విద్యుత్ లోఓల్టేజ్ నివారించాలని ఎంపిటిసి బుద్ధా ల రాంబాబు , గీతా కోరారు. దువ్వ ధనమ్మ గుడి నుండి వరిగేడు వరకు అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని జెడ్పిటిసి అడ్డాల జానకి కోరారు .

## విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్ తప్పనిసరి.



అత్తిలి – జూన్ 5 ( ప్రభాత వార్త ): విత్తనాలు కొనుగోలు చేసేటప్పుతూ తప్పనిసరిగా బిల్ తీసుకోవాలని డాట్ కోఆర్డినేటర్ ఫణికుమార్ అన్నారు. సార్వా పంటకు అనవసరంగాఎరువులు వాడొద్దని కోరారు. అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్ములో తప్ప ఇతర సమయంలో కాంప్లెక్స్ ఎరువులు వాడరాదని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు , ఆరుతడి పంటలు , ఆయిల్ పామ్ తోటలపై మారుటే రు పరిశోధనా స్తానం లో గల ఆయిల్ పామ్ శాస్త్ర వేత్త యమ్ వి ప్రసాద్ ప్రత్యామ్నాయ పంటలు , ఆరుతడి పంటలు పామ్ ఆయిల్ పంటలపై అవగాహనా కల్పించారు . . కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త దిబోరా, డాక్టర్ బిందు ప్రవీణ, మండల వ్యవసాయాధికారి టికే రాజేష్ , ఎంపిటిసిజం ముదునూరి దుర్గ భవాని , చేకూరిశ్రీనివాస్ సర్పంచ్ వట్టికూటి అనంత లక్ష్మి గొడవర్తి తిరుపతిరావు రైతులు తదితరులు పాల్గొన్నారు .

## ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయండి

### - తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసిన తాట్కూరుగోమ్ము కాలనీ గ్రామస్తులు



వేలేరుపాడు,జూన్ 5, ప్రభాత వార్త : ప్రతి సంవత్సరం జూన్ జూలై ఆగస్టు సెప్టెంబర్ నెలలో వరదల సమయంలో వలసలు వెళ్లడం వలన ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ పంటలు కోల్పోయి, గృహాలు నేలమట్టమై తిండి గింజలు, నిత్యవసరాలు లేక నానా ఇబ్బందులు పడుతున్న మా కుటుంబాలను 41.15 కాంటూర్లో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయవలసిందిగ వేలేరుపాడు మండలంలోని తాహాసిల్దార్ కార్యాలయంలో తట్కూరు గోమ్ము కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రతి సంవత్సరం వరదలు రావడం వలన మా గృహాలకు సైతం నష్టపరిహారం అందుతుందని, 2013 సంవత్సరం మా యొక్క అసైన్మెంట్ భూములకు నష్టపరిహారం ప్రభుత్వం అందించిందని, 2022లో వచ్చిన వరదల వలన మా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం వలన వేరే ప్రాంతానికి దాన్ని తరలించడం జరిగిందని ఇంతకంటే రుజువులు అవసరం లేదని మా యొక్క గ్రామం ప్రతి ఏడు వరదల్లోనే ఉంటుందని తెలియజేయడానికి అన్నారు. ఎన్నిసార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ అధికారుల నుండి స్పందన రావడం లేదని, అధికారులు ప్రతి యేడు వరదల సమయంలో మునిగిన మా గృహాలను చూస్తూనే ఉన్నారని సర్వేలు చేస్తూనే ఉన్నారని, ఇప్పటికైనా మా గోడు విని మా గృహాలను అధికారులు పరిశీలించి తక్షణమే మా గ్రామానికి ఆర్ అండ్ ఆర్ నిధులు విడుదల చేయాలని తట్కూరుగొమ్ము గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## ఘనంగా వన మహోత్సవం కార్యక్రమం



కొయ్యలగూడెం ప్రభాతవార్త మే 5: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. భావితరాలకు మనందరం కలిసి పర్యావరణాన్ని కాపాడాలని మండల ప్రజా పరిషత్ అధికారి కిరణ్ కుమార్ అన్నారు ఈ సందర్భంగా మండల కార్యాలయం నందు ఎంపీపీ గంగ మాల రామారావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యాలయంలో మొక్కలను నాటారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉంటే అందరూ ఒక్కొక్క మొక్కను నాటాలని చెప్పారు. పర్యావరణం కాలుష్యంతో ఉంటుందని తద్వారా మానవాళికి మరియు ఓజోన్ పొరా పరిరక్షణకు బాధ్యతతో మొక్కలను నాటాలని తెలియజేశారు. ప్రస్తుత కాలంలో నగరాల్లోనే కాకుండా గ్రామాలలోనూ ఫ్యాక్టరీలు నెలకొల్పి గాలి నీరు నేల కలుషితంతో నిండిపోయాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పరంపూడి గ్రామపంచాయతీ సెక్రటరీ సురేష్ మరియు సచివాలయ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.


## గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్ పై శిక్షణ



పెనుమంట్ర, జూన్-05, ప్రభాతవార్త: మండలంలోని మా ర్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయురాలు పి. సువర్ణ గౌరి పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ స్టోరీస్ చెప్పడం జరిగిందని గ్రంథ పాలకుడు పిటిఎస్ కుమార్ గురువారం తెలిపారు. సదవడం అంటే మాకెంతో ఇష్టం కార్యక్రమంలో భాగంగా పిల్లలు చేత కథలు బుక్స్, మరియు జి.కె. బుక్స్ చదివించడం జరిగిందన్నారు. పిల్లల చేత యోగ కూడ చేయించడం జరిగిందన్నారు ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో సి.హెచ్. జ్యోత్స్న అంజనా దేవి శ్రీ, సి హెచ్. ఆనంది,యమ్.డి. కలిమ్, కె.ఝాన్సీ, కె. తరుణ్ కూమార్, కె. శ్రావ్య, బి. అద్విత్ కృష్ణ, పి. పవన్, డి. రాజు తదితర పిల్లల పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోంది. నవీన్ చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమౌళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10,

# 'రానా నాయుడు సీజన్ 2': నాగనాయుడు పాత్ర సూపర్బ్



2012 న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రధన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్‌గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# 'లక్ష్మీ నరసింహా' రీరిలీజ్ బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది

గాడ్ అఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ లక్ష్మీ నరసింహా మరోసారి థియేటర్స్‌లో అలరించడానికి సిద్ధమైయింది. జయంత్ సి.పరాన్జీ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత బెల్లం కొండ సురేష్ నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలైన ఘన విజయాన్ని అందుకుంది. ఈ చిత్రాన్ని 4కె వెర్షన్‌లో జూన్ 8న థియేటర్స్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రీ రిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ వెర్షన్‌లో కొత్త పాట యాడ్ చేశారు. మందేసినోడు అంటూ సాగే పాటని భీమ్స్ సిసిరోలియో అన్ స్టాపబుల్ వైబ్‌తో కంపోజ్ చేశారు. స్వరాగ్ కీర్తన్ హై ఎనర్జీతో పాడిన ఈ సాంగ్‌కి ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ మాస్‌ని కట్టిపడేసే లిరిక్స్ అందించారు. రీరిలీజ్ ప్రెస్ మీట్‌లో ఈ సాంగ్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ప్రెస్ మీట్‌లో నిర్మాత బెల్లం కొండ సురేష్ మాట్లాడుతూ, అందరికీనమస్కారం. ఈ సినిమా రీరిలీజ్‌ని లైఫ్‌లో మర్చిపోలేను. 21 ఏళ్ల తర్వాత లక్ష్మీ నరసింహా సినిమాని రీరిలీజ్ చేస్తున్నానంటే నందమూరి అభిమానులకు ఏదో ఒక స్పెషల్, సర్ప్రైజ్ ఇవ్వాలి. ఎలాంటి సర్ ప్రైజ్ అని ఆలోచన వచ్చినప్పుడు.. ఈ సినిమా కోసం రెండు సాంగ్స్ చేశాం. ఒక సాంగ్‌ని షూట్ చేసాంగాని సినిమాలో లేదు. ఆ సాంగ్‌ని ఎలాగైనా రీరిలీజ్‌లో యాడ్ చేయాలి అని ఆలోచన వచ్చింది. ప్రసాద్ ల్యాబ్స్‌లో నెగిటివ్ దొరికింది. కానీ సౌండ్ దొరకలేదు సౌండ్ లేదు. ఒన్లీ పిక్చర్ ఉంది. పిక్చర్ ప్రింట్ చేసి ఫస్ట్ చంద్రబోస్‌కి, తర్వాత డైరెక్టర్‌కి, భీమ్స్‌కి పంపించాను. వాయిస్, లిరిక్ రాసి రికార్డు చేయాలని చెప్పాను. బోస్ ఇది ఎలా పాజిబుల్ అన్నారు. చేస్తేనే పాజిబుల్ అవుతుందని చెప్పాను. ఒకసారి ప్రయత్నించమని చెప్పాను. అయితే ఈ ప్రయత్నాన్ని అద్భుతంగా చేశారు. ఈ పాటని డిస్ట్రిబ్యూటర్స్‌కి వినిపిస్తే పాట అద్భుతంగా ఉంది. కొత్త సినిమాల్లో పెట్టండి బ్లాక్ బస్టర్ అవుతుంది అని చెప్పారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావాలని మన



స్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ జయంత్ సి.పరాన్జీ మాట్లాడుతూ, అందరికినమస్కారం. సురేష్‌కి థాంక్యూ. ఇలాంటి కొత్త ఐడియాలన్నీ సురేష్‌కి వస్తాయి. ఆడియో లేని ఈ సాంగ్‌కి ఏదైనా చేద్దామని ఆయన అన్నప్పుడు నేను ఇంపాజిబుల్ అని చెప్పాను. ఆయన, చంద్రబోస్, భీమ్స్ కలిసి ఈ అద్భుతం చేశారు. ఒక ఇంపాజిబుల్ టాస్‌ని పాజిబుల్ చేసి చూపించారు. ఇళయరాజా ఇలాంటి ఒక ప్రయోగం చేశారని ఎప్పుడో విన్నాను. అయితే అది ఒక మాంటేజ్ సాంగ్.



ప్రేక్షకుల మనసుల్ని గెలిచిన కల్ట్ క్లాసిక్ హిట్ అందాల రాక్షసి మరోసారి అలరించడానికి సిద్ధమైంది. ఈ ఎవర్ గ్రీన్ లవ్ స్టోరీ జూన్ 13న రీరిలీజ్ కాబోతోం

# 13న 'అందాల రాక్షసి' రీరిలీజ్

ది. నవీన్‌చంద్ర, రాహుల్ రవీంద్రన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. వారాహి చలనచిత్రం బ్యానర్‌పై సాయి కొర్రపాటి, ఎస్.ఎస్. రాజమౌళి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10, 2012న విడుదలై ఘన విజయాన్ని సాధించింది. భిన్నమైన ప్రేమ కథ, లోతైన భావోద్వేగాలతో ప్రేక్షకుల మనసులో నిలిచిపోయేలా ఈ సినిమా అద్భుతంగా తెరకెక్కించారు దర్శకుడు హను రాఘవపూడి. రధన్ మ్యూజిక్ ఎవర్ గ్రీన్ గా నిలిచింది. ఇందులో పాటలన్నీ సూపర్ హిట్‌గా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాకు కల్ట్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడీ మ్యాజిక్ మళ్లీ బిగ్ స్క్రీన్‌పై ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

డైలాగ్ కింగ్ సాయి కుమార్ ప్రస్తుతం ఏ చిత్రంలో నటిస్తే ఆ చిత్రం బ్లాక్ బస్టర్ అవుతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది ఆయన నటించిన సినిమాలన్నీ కూడా బ్లాక్ బస్టర్ హిట్లుగా నిలిచాయి. ఇక ఆయన నటించిన కమిటీ కుర్రోళ్లు, లక్కీ భాస్కర్, సరిపోదా శనివారం, మెర్సీ కిల్లింగ్ వంటి చిత్రాలకు గద్దర్ అవార్డులు కూడా వచ్చిన సంగతి తెలిసిందే. అలాంటి సాయి కుమార్ ప్రస్తుతం తెలుగు, కన్నడ భాషల్లో చౌకీదార్ అనే సినిమాను చేస్తున్నారు.

# 'చౌకీదార్' నుంచి సాంగ్

ఈ చిత్రంలో పృథ్వీ అంబర్, ధన్యా రమ్యకుమార్ జంటగా నటిస్తున్నారు. చౌకీదార్ మూవీని వీఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ మీద డా.కల్లహల్లి చంద్ర శేఖర్ నిర్మిస్తుండగా, చంద్రశేఖర్ బండియప్ప తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈచిత్రానికి సంబంధించిన ఓ ఎమోషనల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. నాన్న గొప్పదనం చాటి చెప్పేలా గుండెను పిండేసేలా ఓ చక్కటి బాణీని అందిం చారు. నాన్నా అంటూ సాగే ఈ పాటను సంతోష్ వెంకీ రచించగా, విజయ్ ప్రకాష్ ఆలపించారు. సచిన్‌బస్రూర్ అందించిన బాణీ అయితే ప్రతీ ఒక్కరినీ కదిలించేలా ఉంది. తండ్రి త్యాగాల్ని, మోసే బాధ్యతల్ని, చూపించే ప్రేమను చాటేలా పాటను రచించారు. ఇక లిరికల్ వీడియో చూస్తుంటే సాయి కుమార్ తండ్రిగా మరోసారి ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉన్నారు. పృథ్వీ అంబర్, సాయి కుమార్ మధ్య మంచి ఎమోషనల్ సీన్స్ ఉండేట్టుగా కనిపిస్తోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ప్రకటించనున్నారు.





శ్రీనిధి శెట్టి నయా లుక్

అపోలో ప్రొడక్షన్స్ పతాకంపై రావూరి వెంకట స్వామి నిర్మాతగా బాహుబలి కట్టప్ప సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం కట్టప్ప జడ్జిమెంట్. తీర్పుగల్ విర్కపడుమ్ తమిళ చిత్రాన్ని తెలుగులో కట్టప్ప జడ్జిమెంట్ పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు నిర్మాత వెంకట స్వామి. బాహుబలి కట్టప్ప అంటే తెలుగులో తెలియని ప్రేక్షకులు వుండరు. అంతలాఎడతెగని

# 13న 'కట్టప్ప జడ్జిమెంట్' విడుదల



అనుబంధం ఉంది తెలుగులో సత్యరాజ్ గారికి. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం యు/ఏ సర్టిఫికెట్ అందుకుంది. జూన్ 13న తెలుగులో విడుదల చేయడానికి నిర్మాత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యర్థి పాత్రలో మధు సూదనరావు అద్భుతంగా నటించారు. పూర్తి మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అనడంలో సందేహం లేదు. కట్టప్ప ఏ విషయంలో ఎలాంటి జడ్జిమెంట్ ఇచ్చాడో వెండితెరపై చూసి తెలుసుకోండి. ఈ చిత్రానికి ధెరన్ దర్శకత్వం వహించారు. మరియు స్మృతి వెంకట్, సత్యరాజ్, హరీష్ ఉత్తమన్ మరియు మధుసూధన్ రావు, రవిప్రసాద్ ప్రధాన పాత్రలు పోషించారు.

90స్‌లో యూత్ కలల రాకుమారి. 1994లో విడుదలైన తమిళ చిత్రం కాదలన్ ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే

# 90స్‌లో నగ్మా యూత్ కలల రాకుమారి

అందం, అభినయంతో కట్టిపడేసింది. తెలుగు, తమిలం, మలయాళం, హిందీ భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇంతకీ హీరోయిన్ నగ్మా గుర్తుందా..?



ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్. 1994లో విడుదలైన కాదలన్ అనే తమిళ సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించింది. సూపర్ స్టా రజినీకాంత్ జోడిగా బాషా చిత్రంతో సూపర్ హిట్ అందుకుంది. అలాగే తెలుగులో మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించింది. సినీరంగంలో నగ్మా చెల్లెల్లు సైతం హీరోయిన్లుగా రాణించారు. నగ్మా చెల్లెల్లు మరెవరో కాదు.. జ్యోతిక, రోషిణి. దశాబ్దాలపాటు సినీరంగంలో వరుస సినిమాలతో అలరించిన నగ్మా.. 2008 నుంచి సినిమాలకు దూరంగా ఉండిపోయారు. చాలా కాలం తర్వాత నగ్మా ఫోటోస్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఇటీవలే సూర్య, జ్యోతిక దంపతుల కుమార్తె దియా ఇంటర్ పూర్తి చేసింది. తాజాగా ఆమె గ్రాడ్యుయేషన్ వేడుకలకు సంబంధించిన ఫోటోస్ షేర్ చేస్తూ తల్లిదండ్రులుగా తాము గర్వపడుతున్నామంటూ రాసుకొచ్చింది జ్యోతిక. అయితే ఈ కార్యక్రమంలో నటి నగ్మా కూడా పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది నగ్మా. అందులో ఆమె గుర్తుపట్టలేనంతగా మారి పోయింది.

ఎలక్ట్రిక్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎఫర్ట్ లెస్ యాక్టింగ్, అద్భుతమైన కామిక్ టైమింగ్‌తో అలరించే మాస్ మహారాజా రవితేజ, ఫ్యామిలీ ఎంటర్టైనర్ల మాస్టర్, దర్శకుడు కిషోర్ తిరుమలతో కలిసి ఆర్‌టి76 ప్రాజెక్ట్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. క్వాలిటీ, హై ఎంటర్ టైన్మెంట్ వాల్యూస్‌తో సినిమాలని అందించడంలో పాపులరైన ప్రతిష్టాత్మక ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే ఈ చిత్రం ఈరోజు ముహూర్తపు వేడుకతో ఘనంగా ప్రారంభమైంది. దర్శకుడు కిషోర్ తిరుమల, రవితేజ సిగ్నేచర్ స్టయిల్, కామెడీతో కూడిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌ని రాశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ కథలో రవితేజ తనదైన ఎనర్జీతో అలరించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో రవితేజ వెరీ స్టైలిష్ అవతార్‌లో, డిజైనర్

# ఎస్‌ఎల్‌వి సినిమాస్ గ్రాండ్ లాంచ్

సూట్ ధరించి కనిపిస్తున్నారు. ఎయిర్ క్రాఫ్ట్ సీటులో హాయిగా కూర్చున్న అతను, ముందు సీటుపై ఒక కాలు క్యాజువల్‌గా ఆనించి, ఒక చేతిలో వైన్ బాటిల్, మరో చేతిలో పుస్తకంతో కనిపించడం అదిరిపోయింది. ఇది ఇప్పటివరకు రవితేజ మోస్ట్ స్టైలిష్ లుక్‌ను సూచిస్తుంది. అతను పట్టుకున్న పుస్తకంలో సీ ఇట్ అండ్ సే ఇట్ స్పానిష్‌లో ఉంది, ఇది అతని పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. బ్లాక్‌బస్టర్ ధమాకా కోసం చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించిన తర్వాత భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి రవితేజతో మళ్ళీ వర్క్ చేస్తున్నారు. ప్రసాద్ మూరెళ్ల డీవోపీగా పని చేస్తున్నారు. అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ చేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఆర్‌టి76 రెగ్యులర్ షూటింగ్ జూన్ 16 నుండి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుంది. ఈ చిత్రం 2026 సంక్రాంతికి థియేటర్లలో రిలీజ్ కానుంది. తారాగణం: రవితేజ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కిషోర్ తిరుమల, నిర్మాత: సుధాకర్ చెరుకూరి, బ్యానర్:ఎస్‌ఎల్‌వి సినిమాస్ డీవోపీ: ప్రసాద్ మూరెళ్ల సంగీతం: భీమ్స్ సిసిరోలియో ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్ ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: విజయ్ కుమార్ చాగంటి.



బుద్ధి చిన్నది అయితే అన్నీ వివాదాలుగానే ఉంటాయి. కర్ణాటకలో జరుగుతున్న మైసూర్ శాండల్ సబ్బు ప్రచారకర్త నియామకం విషయంలో అదే జరుగుతోంది. మైసూర్ శాండల్ సబ్బును తయారు చేసే కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జంట్స్ కంపెనీ తమ ఉత్పత్తుల ప్రచార కర్తగా

# మైసూర్ శాండల్‌కు ప్రచారకర్తగా తమన్నా భాటియా



తమన్నా భాటియాను నియమించుకుంది. రెండేళ్లకు ఆరు కోట్ల రూపాయుల చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే మన సబ్బుకుతమన్నా ఎందుకని కన్నడ నటీమణులు లేరా అని అక్కడి కన్నడ ఉద్యమ సంఘాలు తమ పని ప్రారంభించాయి. మైసూర్ సబ్బును మైసూర్‌లోనో.. కర్ణాటకలోనే అమ్మడం లేదని.. దేశ వ్యాప్తంగా అమ్ముతున్నామని.. దేశవ్యాప్త మార్కెట్ కోసం అందర్నీ పరిశీలించిన తర్వాతనే తమన్నాను ఎంపిక చేసుకున్నామని ఆ సంస్థ చెబుతోంది. దీపికా పదుకొనే, రష్మికను కూడా పరిశీలించామని.. కానీ అన్ని అంశాలను చూసిన తరవాత తమన్నానే ఎంపిక చేసుకున్నామన్నారు. తమన్నాకు నేషనల్ వైడ్ పాపులారిటీ ఉంది. సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోయర్లున్నారు. కేఎస్డీఎల్ అనేది ప్రభుత్వ సంస్థ. అందుకే ఇది మరింత వివాదాస్పదం చేస్తున్నారు. మరో మూడేళ్లలో మైసూర్ శాండల్ సోప్ మార్కెట్‌ను ఐదు వేల కోట్ల రూపాయలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అది నార్త్‌లో మార్కెట్ పెంచు కుంటేనే సాధ్యమవుతుందని అనుకుంటున్నారు. కానీ అక్కడ కన్నడ సంఘాలు మాత్రం.. మా సబ్బు.. మా నటి అని వితండవాదం చేస్తున్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చెట్టును కౌగిలించుకున్న ఫొటోను షేర్ చేస్తూ ఎమోషనల్ పోస్ట్ చేసింది హీరోయిన్ నభా నటేష్. ఆమె ఇన్ స్టా గ్రామ్ ద్వారా చేసిన ఈ పోస్ట్ నెటిజన్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పోస్ట్‌తో నేచర్ గురించి నభా బ్యూటిఫుల్ మెసేజ్ ఇచ్చిందంటూ నెటిజన్స్ కామెంట్స్ రాస్తున్నారు. తన సోషల్ మీడియా పోస్ట్‌లో నభా స్పందిస్తూ ఈ రోజు ఒక చెట్టును కౌగిలించుకున్నాను...ఆ చెట్టు కూడా నన్ను తిరిగి కౌగిలించుకుందనే భావన కలిగింది.

# నభా నటేష్ ఎమోషనల్ పోస్ట్



ఎంతో అందమైన ఈ ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అతిథులం మనం. ఇక్కడ ప్రకృతి మనకెన్నో గొప్ప అనుభవాలు ఇస్తోంది. ఈ ప్రకృతి ని, పర్యావరణాన్ని అనుభూతి చెందడం మాత్రమే మనకున్న హక్కు. ఈ సంతోషాలు ఇచ్చిన నేచర్‌కి రుణ పడి ఉంటాను. అని పేర్కొంది. ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ మూవీస్‌లో నటిస్తోంది నభా నటేష్. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభుతో పాటు మరో ప్రెస్టీజియస్ మూవీ నాగబంధంలో నటిస్తోంది.

# జయ జయహే అక్షర దేవళ్ల !



తెలంగాణ అధికారిక గీతానికి అద్భుతమైన నాట్యంతో అందరి మనసులు దోచుకుంటోంది అక్షర దేవళ్ల. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊది, ప్రతీ ఒక్కరి గుండెల్లో చైతన్యాన్ని నింపిన ఈ అందెశ్రీ పాటకు తెలంగాణ సాకారమైన పదేళ్ల తర్వాత అధికారిక హోదా దక్కింది. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీత స్వరకల్పనలో కొత్తదనం అందుకున్న జయ జయహే తెలంగాణ పాటకు సంప్రదాయ నృత్యంతో మరింత అందాన్ని అక్షర దేవళ్ల తీసుకొచ్చింది. ఆమె నర్తించిన ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తెలంగాణ ప్రకృతి అందాల మధ్యన అద్భుతమైన హావభావాలతో నర్తించి జయ జయహే తెలంగాణ పాటకు అక్షర ప్రాణం పోసింది. తన తల్లి, గురు భావన పెదప్రోలు దగ్గర నృత్యశిక్షణ తీసుకున్న అక్షర దేవళ్ల మూడేళ్ల నుంచే ప్రదర్శనలు ఇస్తోంది. భామా కలపం నృత్య నాటకాన్ని ఇటీవలే ఏకధాటిగా గంటన్నర పాటు ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకొంది. అలాగే సమతా కుంభ్ రెండో వార్షికోత్సవ వేడుకల్లో ప్రత్యేక నృత్య ప్రదర్శన ఇవ్వడంతో పాటు, వెయ్యి మంది చిన్నారులు ప్రదర్శించిన "సహస్ర గోదా వైభవం" పాటకు నృత్య రీతులను సమకూర్చినందుకు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గ్లోబల్ స్టార్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డులు అందాయి. ఆమె నృత్య ప్రతిభకు ముగ్ధులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, తన ఆశ్రమానికి డ్యాన్స్ అండ్ కల్చరల్ అంబాసిడర్‌గా నియమించారు. ఆశ్రమంలో ఎలాంటి కార్యక్రమం జరిగినా అక్షర నృత్య ప్రదర్శనను తప్పనిసరి చేశారు. దీంతోపాటు మలేషియాలో గత ఏడాది జరిగిన బాటు కేవ్స్ ఫెస్టివల్‌లోనూ భారత దేశం తరపున నృత్య ప్రదర్శన ఇచ్చింది కూచిపూడి నృత్యంతోనే కాకుండా నటనతోనూ మెప్పిస్తూ ఆల్‌రౌండర్ అనిపించుకొంటోంది అక్షర. తెలుగు చిత్ర పరిశ్రమలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూ ఇప్పటికే దాదాపు 12 సినిమాల్లో నటించింది. ఆమె కీలక పాత్రలు పోషించిన ప్రభాస్ రాజాసాబ్, హీరో నితిన్ తమ్ముడు, దుల్కర్ సల్మాన్ ఆకాశంలో ఒక తార, డైరెక్టర్ కేకే తీసిన కేజేక్యూ, శోభిత దూళిపాళ్ల చీకట్లో సినిమాలు రాబోతున్నాయి. పుమా, అపర్ణ, మాంచెస్టర్స్ గ్లోబల్, దాదూస్, క్యారెట్ జ్యూయలరీస్ ప్రకటనల్లోనూ నటించింది. అటు నటన, ఇటు నృత్య ప్రదర్శనలతో బిజీగా ఉన్నా చదువులోనూ టాప్ ర్యాంకర్‌గా కొనసాగుతోంది. అన్నింటా ఆల్‌రౌండర్‌గా దూసుకెళ్తున్న అక్షర దేవళ్లకు ఆల్ ది బెస్ట్. ❑

# విద్యను సమాజ సేవకు జతచేస్తే..



ఇండోనేషియాలోని కొన్ని గ్రామాల ప్రజలకి కలుషిత నీరే శరణ్యం. దాంతో చిన్నా పెద్దా తేడా లేకుండా రోగాల బారిన పడటం చూసి చలించి మిస్ ఇండోనేషియా మోనికా కేజియా సెమింగ్. ఆ పరిస్థితులను మార్చాలనుకుంది. అదే తనని 'బ్యూటీ విత్ ఎ పర్పస్' టైటిల్‌ను గెలుచుకునేలా చేసింది. విద్యను సమాజ సేవకు జతచేస్తే... అది మరింత ప్రభావవంతమైన సాధనం అవుతుంది... అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తుందని నమ్మే అమ్మాయి మోనిక. ఇండోనేషియా లోని సుమత్రా నగరంలో పుట్టిపెరిగింది ఈమె. కెమికల్ ఇంజినీరింగ్ చేసింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తోంది. చిన్నప్పట్నుంచీ సంగీతం, బొమ్మలు గీయడం, సామాజిక సేవ అంటే ఇష్టం. పాఠశాల రోజుల నుంచే సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. అందులో భాగంగానే 2022లో కాంపంగ్ సిక్ అందుబాటులోకి వెళ్లింది. నీళ్లు, గాలి కలుషితం అవుతున్నాయి. మానవ మనుగడకు ముప్పుగా మారుతున్నాయి... లాంటి అంశాల్ని పుస్తకాల్లో చాలానే చదివాను. కానీ ప్రత్యక్షంగా చూసింది మాత్రం కాంపుంగ్ లోనే. చుట్టూ నదులూ, చెరువులతో అపార జలసంపద ఉన్న ప్రాంతం ఇది. కానీ, తాగడానికి గుక్కెడు మంచినీళ్లు లేవు. అక్కడి నదులూ, చెరువులన్నీ వ్యర్థాలతో కలుషితమయ్యాయి. దీనికి తోడు ఆ నీటినే నిత్యకృత్యాలు తీర్చుకోవడానికీ తాగడానికీ ఉపయోగిస్తున్నారు. అక్కడివాళ్లు పర్యవసానంగా అనారోగ్యాల బారిన పడుతున్నారు. చర్మ సంబంధిత సమస్యలు, కడుపు నొప్పి లాంటి కారణాలతో పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితులను మార్చాలనుకున్నా అనే మోనిక 2023లో 'వైడ్‌లైన్ ఫర్ లైఫ్‌లైన్' అనే ప్రాజెక్టును ప్రారంభించింది. సిసెక్ మూడు ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న నది నుంచి మంచినీళ్లు తెచ్చే ప్రయత్నం చేసింది. అందుకు ప్రత్యేక పైప్‌లైన్ వేసి, గ్రామంలో నిర్మించిన మంచినీటి ట్యాంకుకు పంపింది. అక్కణ్నుంచి ప్రజలు స్వచ్ఛమైన నీటిని పట్టుకుంటున్నారు.

**ఒక్క గ్రామంతో ఆగిపోకూడదని..**
ఇండోనేషియాలో క్యాంపుంగ్ లాంటి ప్రాంతాలు చాలానే ఉన్నాయి. మంచినీరు అందించాలంటే తన గళం దేశవ్యాప్తంగా వినిపించనుంది.



అందాల పోటీని అందుకు మార్గంగా ఎంపికచేసుకుంది. పోటీల్లో పాల్గొని 2024లో మిస్ ఇండోనేషియా కిరీటాన్ని దక్కించుకుంది. మిస్ వరల్డ్72కి అర్హత సాధించి, ప్రపంచ వేదికపై తన లక్ష్యాన్ని చెప్పి, న్యాయనిర్ణేతలను మెప్పించింది. బ్యూటీ విత్ ఎ పర్పస్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. తెలివి ఉన్నా నలుగురికి ఉపయోగపడనప్పుడు దానికి విలువ లేనట్లే. సామాజిక స్పృహ లేకుంటే అందానికి అర్థం లేదని చెప్పే మోనిక సేవా కార్యక్రమాలు ఇకపైనా కొనసాగించాలని కోరుకుంటూ....
ఆల్ ద బెస్ట్ చెప్పేద్దామా మరి! ❑

# జీవ గడియారం ఎక్కువ



ఏ ఇంట్లోనైనా మహిళలే త్వరగా లేచి పనులు చక్కబెడుతుంటారు. ఎందుకంటే, స్త్రీలు మగవారి కంటే తొందరగా నిద్ర నుంచి మేల్కొంటారట. వాళ్ల జీవ గడియారం ఎక్కువగా తూర్పు టైమ్ జోన్ ప్రకారం ఉంటుంది. అందుకే వాళ్లు త్వరగా నిద్ర లేచి, త్వరగా నిద్రపోతారట. పైగా ఆడవాళ్లకు మగవారి కంటే 20 నిమిషాల ఎక్కువ నిద్ర అవసరమవుతుందట. ❑

వయసునుబట్టి పేస్‌ప్యాక్ ఉపయోగించడం అలవాటు చేసుకోండి. తలారా స్నానం చేయడానికి ముందుగ అయిల్‌బాగా మసాజ్ చేసుకోవాలి. లేదా నిమ్మరసం పెరుగు శనగపిండి కలిపి శరీరానికి మర్దన చేసి స్నానం చేయండి. ❑

# వీటితో అలర్జీనా?

**ఆడవాళ్లకు, నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా.. వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొన్ని చర్మతత్వాలకు సరిపడవు. ముఖ్యంగా ఆర్టిఫిషి ఆడవాళ్లకు నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది.** అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొంతమంది చర్మతత్వాలకు సరిపడవు ముఖ్యంగా ఆర్టిఫిషియల్ నగల విషయంలో ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతుంటుంది. ఫలితంగా చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, మంట.. వంటి సమస్యలొస్తాయి. మరి, వీటి నుంచి విముక్తి పొందడమెలాగో తెలుసుకుందాం ..

◆ ఆర్టిఫిషియల్ నగల తయారీలో నికెల్ లోహాన్ని



వాడుతుంటారు. చాలామందిలో అలర్జీ రావడానికి ఇదే ముఖ్య కారణమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా సున్నితమైన చర్మతత్వం ఉన్న వారిలో దీని కారణంగా దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు. అలాంటి వారికే ఈ విబలు మేలు వస్తుంది.

◆ నగల అలర్జీ ఉన్న వారు వాటిని ధరించే ముందు మాయిశ్చరైజర్, పౌడర్, క్యాలమైన్ లోషన్స్, వంటివి రాసుకోవాలి. ఇవి చర్మానికి కవచంలా పనిచేసి ఆయా లోహాల ప్రభావం చర్మంపై పడకుండా చేస్తుంది. ◆ అవుటిఫిట్ ఏదైనా.. కొంతమంది మెడ దగ్గరగా ఉండే చోకర్.. వంటి బిగుతుగా ఉంటే జ్యుయలరీని ఎంచుకుంటారు. దీనివల్ల గాలి ఆడక కూడా అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే చాలా వరకు వదులుగా ఉండే నెకేపీస్‌లు, లాంగ్ చెయిన్స్,. ఎంపిక ఎంచుకోవాలి.

◆ ధరించే ముందు ట్రాన్స్‌పరెంట్ నెయిల్ పాలిష్‌ను నగలపై ఓ కోటింగ్ వేసి.. ఆపై వేసుకోవడం మంచిది. ఇది నగల్లోని లోహాల ప్రభావం చర్మంపై పడకుండా కాపాడుతుంది.

◆ ఆర్టిఫిషియల్ నగలే కదా అని వీటి విషయంలో చాలామంది శ్రద్ధ తీసుకోరు. తడిసినా, చెమట పట్టినా.. అలాగే వాటిని బాక్సుల్లో భద్రపరుస్తుంటారు. ఆ తడిదనం వల్ల నగల నాణ్యత, దెబ్బతిం టుంది. ఇది కూడా చర్మ అలర్జీలకు కారణమవుతుంది. కాబట్టి నగల్ని భద్రపరిచే ముందు పూర్తిగా ఆరనివ్వడం మేలు. అలాగే తేమ అధికంగా ఉండే ప్రదేశాల్లో వీటిని భద్రపరచ కూడదు. ❑

చెలి చిట్కా

# నమ్మాలంటే.. నవ్వాలి !

ఒక చిన్న నవ్వు.. చుట్టూ ఉన్న వాతావరణాన్నే మార్చేస్తుంది కదా! ఇది మానసిక ప్రయోజనాలనే కాదు, సామాజిక బంధాలు బలపడటంలోనూ కీలకపాత్ర పోషిస్తుందట. ఇతరులకు మనపై నమ్మకం ఏర్పడేలా చేసేదీ ఓ చిన్న స్మైలేనని జర్నల్ సైకలాజికల్ సైన్స్ పరిశోధనలు చెబుతున్నాయి. ఎదుటివారిని చూసి చిన్న నవ్వు నవ్వినప్పుడు.. నేను స్నేహపూర్వకంగా ఉంటాను. నాతో ప్రమాదం లేదు. నాతో ఎప్పుడైనా



మాట్లాడొచ్చు లాంటి పాజిటివ్ సంకేతాలు వాళ్లకు వెళతాయట. ఈ ఫీలింగ్ తెలియని వారికే కాదు, బాగా తెలిసిన వారికీ మనపై మరింత ప్రేమ, నమ్మకం ఏర్పడానికీ ఇది దోహదపడుతుందట. దీనికోసం పరిశోధకులు ఓ ప్రయోగం చేశారు. అందులోని వ్యక్తులను రెండు గ్రూపులుగా విభజించి తెలియని వ్యక్తితో ఇంటర్వ్యూ చేయించారు. దాన్ని వీడియో రికార్డు చేశారు. అందులో ఓ గ్రూపు వాళ్లకు నవ్వుతూ మాట్లాడమనీ, మరో గ్రూపు వాళ్లకు ఎలాంటి భావోద్వేగాలూ లేకుండా ఉండమనీ చెప్పారు. నవ్వుని వారితో పోలిస్తే నవ్వుతూ మాట్లాడిన వారు ఎక్కువ నమ్మదగిన వారిగా ఉన్నట్లు గుర్తించారట. కాబట్టి, ఇతరుల నమ్మకాన్ని చూరగొనాలంటే పెదవులపై చిరునవ్వు మాత్రం చెరగనీయొద్దు. ❑

# చర్మ సమస్యలకు చెక్ !

**మహిళలు ముఖ** సౌందర్యాన్ని తగ్గించే సమస్యల్లో ముడతలు, పిగ్మెంటేషన్ ప్రధానమైనవి. ముడతలతో వయసు పైబడిన వారిలా కనిపిస్తే.. పిగ్మెంటేషన్ మచ్చలతో ముఖమంతా అంద విహీనంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బాదం పప్పును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ఈ సమస్యలను అధిగమించవచ్చని చెబుతున్నారు నిపుణులు.



.క్యాలరీలు తక్కువగా ఉండే బాదం పప్పును చాలామంది బరువు తగ్గించుకోవడానికి స్నాక్స్‌గా వినియోగిస్తారు. ఇందులోని విటమిన్-'ఇ'తో పాటు మోనో అన్‌శ్చాచురేటెడ్ కొవ్వుల కారణంగా వీటిని నిత్య తీసుకునే మహిళల్లో గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తక్కువని అధ్యయనాల్లో తేలింది. ఇలా ఎన్నో ప్రయోజనాలున్న బాదం పప్పుతో మహిళల్లో ముఖం పైన ముడతలు, పిగ్మెంటేషన్ మచ్చలు కూడా మాయమవుతాయని చెబుతున్నారు నిపుణులు.

**ఈ.. అదే కారణం...**
బాదంలో విటమిన్6ఇ, అన్‌శ్యాచు రేటెడ్ కొవ్వులతో పాటు పలు పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి మెనోపాజ్ దశలో మహిళల ముఖంపైన ఏర్పడే ముడతలు, పిగ్మెంటేషన్ సమస్యల తీవ్రతను తగ్గించేస్తాయి అంటున్నారు చర్మసౌందర్య నిపుణులు.

**అందుకే ఇవి డైట్‌లో ఉండాల్సిందే !** ప్రతిరోజూ బాదం పప్పులు తినడం వల్ల మహిళల ముఖంపై ముడతలు తగ్గడమే కాకుండా చర్మంపు రంగులో కూడా మార్పులొస్తాయి. బాదం పప్పుల్లో విటమిన్'ఇ' అధికంగా ఉంటుంది. వీటితో పాటు అత్యవసర ఫ్యాటీ ఆమ్లాలు, పాలీఫినాల్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి.



మహిలలు తమ చర్మం ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు ఈ పోషకాలు ఎంతగానో సహకరిస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని మహిళలు, ముఖ్యంగా మెనోపాజ్ దశలో ఉన్న మహిళలు తమ రోజువారీ డైట్‌లో బాదం పప్పులను చేర్చుకోవడం ఎంతో ముఖ్యం అని వారు సూచిస్తున్నారు. ❑

# ఆరోగ్యానికి పండ్ల పిండ్లు

**నెలవారీ పచారీ సరకులు రాసేటప్పుడు సాధారణంగా మన జాబితాలో బియ్యప్పిండి, గోధుమపిండి, సెనగపిండి.. ఇవి ఉంటాయి కదా!**

ఇక నుంచి వీటితోపాటు.. అనాసపిండి, స్ట్రాబెర్రీపిండి, పనసపిండి వంటి పండ్ల పిండ్లు కూడా తోడుకావొచ్చు. పండ్లతో పిండి ఏంటా అని ఆలోచిస్తున్నారా? ఇది నిజమే. బేకింగ్ చేయాలన్నా, కొన్ని రకాల పిండి వంటలు చేయాలన్నా.. మనకి మైదా ఠక్కున గుర్తొస్తుంది. కానీ ఈ మైదాలో పీచు ఉండదు. పైగా కార్బొహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. దాంతో ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదని తేలిపోయింది. దాని



మోతాదుని తగ్గించుకొనేందుకు, ప్రత్యామ్నాయంగా మార్కెట్లో మనకి పండ్లతో తయారుచేసిన పనసపిండి, అరటిపిండి వంటి పండ్ల, పొడులు దొరుకుతున్నాయి. వీటిని గోధుమపిండివంటి వాటితో కలిపి వాడటం వల్ల అదనపు పోషకాలూ అందుతాయి.
రుచీ పెరుగుతుంది.



**పనసపిండి: ..** దీనిని చపాతీ పిండిలోకి, కూరల్లోకి, సూపుల్లోకి వేసుకోవచ్చు. పీచుతో పాటు ప్రొటీన్‌ని సమృద్ధిగా అందిస్తుంది రుచి కూడా పెరుగుతుంది.

**నేరేడు పిండి :** సీజన్‌లో తప్ప మళ్లీ కనిపించని ఈ పండు పిండి రూపంలో రావడం మన అదృష్టమే. ఆంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉండే ఈ పింని స్మూథీల్లో వాడుకోవచ్చు. దీనికుండే చక్కని రంగు కావాలనుకుంటే స్వీట్లలో కూడా వాడుకోవచ్చు.



**ఖర్జూరం :** వంటల్లో పంచదార వాడకుండా ప్రత్యామ్నాయంగా ఈ పిండిని వాడుకోవచ్చు. స్వీట్ల తయారీలో, బేకింగ్‌లో వడతారు.

**అనాసపిండి :** కేకులు, పుడ్డింగులు, మిఠాయిల తయారీలో ఈ పిండిని వాడుకోవచ్చు. అద్భుతమైన రుచి.. మనసు దోచే పరిమళం రెండూ వంటకాలకి తోడవుతాయి.



**దానిమ్మ:** కూరలకి పుల్లటి రుచి కావాలనుకున్నప్పుడు, చాట్‌మసాలాకి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. బేకింగ్, సూపులకు మంచి రుచి ఇవ్వడానికి ఇది ఉపయోగపడుతుంది.

**ఆరెంజ్, స్ట్రాబెర్రీ మామిడి** పొడులను కూడా బేకింగ్‌లో రుచి కోసం వాడుతుంటారు. ❑



# భావనా ప్రభావం

ఆధ్యాత్మికం

మనసులో జనించే ఆలోచనను 'భావన' అంటాము. మనుషుల మనసులలో అనేక భావనలు నిరంతరం చెలరేగుతూనే ఉంటాయి. వాటిలో కొన్ని మంచి భావనలైతే, మరికొన్ని చెడు భావనలు ; కొన్ని సత్యమైనవి, మరికొన్ని ఊహా జనితమైనవి ; కొన్ని సాధింపగలిగేవి, మరికొన్ని అసాధ్యమైనవి ; కొన్ని మనలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించేవి, మరికొన్ని ఆత్మ న్యూనతకు దారి తీసేవి ... ఇలా రకరకాల భావనలు పరిభ్రమించే సుడిగుండం మనిషి మనస్సు అని చెప్పవచ్చు. ఆ మనస్సే బంధ మోక్షాలకు కారణమని ఉపనిషత్తులు చెబుతున్నాయి. యోగవాశిష్ఠం కూడా "యత్ చిత్తం తన్మయో భవతి పూరు షః " అన్నది. మనసెలా భావించి నిర్దేశిస్తే అలాగే మనిషి ప్రవర్తిస్తాడు. ఆవిధం గానే తనను తాను రూపు దిద్దుకొంటాడు. మనము మన మనసు ఏ భావనలతో నిండి ఉంటుందో తెలుసుకోవడం ముఖ్యం. అది భయంతోనా, అసూయతోనా, కోపంతోనా, ధైర్యంతోనా, ఆకర్షణలతోనా, వైరాగ్యంతోనా, ప్రేమ లేక ద్వేషంతోనా అని తెలుసుకొన్నాక మనలను మనం సరిదిద్దుకోవడం సులభతరమవుతుంది. కరుశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రీగారు ఇలా చెప్పారు.

"ప్రార్థనముల పుణ్య తీర్థంబులందున/ గురులయందు, వైద్య వరులయందు, భావమెట్టి దట్టి ఫలతంబు ప్రాప్తించు/ లలత గుణజాల తెలుగుబాట! ప్రార్థనలు చేసినా, పుణ్య పదులలో స్నానాలు చేసినా గురువుల బోధనలు గ్రహిస్తున్నా, వైద్యుల చికిత్సలను పొందుతున్నా. ఆయా అంశాలలో మనకు నమ్మకం. విశ్వాసం ఉంటేనే అవి మనకు అనుకూలమైన ఫలితాలనిస్తాయి లేకుంటే అవి మనకు ఉపయోగపడవు. సానుకుల దృక్పథం ఉంటేనే కార్యసిద్ధి కలుగుతుంది. యద్భావం తద్భవతి అనే పెద్దల మాట కానీ 'యామతి స్సా గతిర్భవేత్' (మతి ఎలా ఉంటే గతి అలా అవుతుంది) అనే అష్టావక్రగీతా వాక్యం కానీ ఈ విషయాన్నే ధృవీకరిస్తున్నాయి. ❑

# చిన్నారులకు సపోర్ట్‌గా..



**కారులో దూర ప్రయాణం చేయాల్సి** ఉంటుంది. కొంతసేపు సరదాగా గడిపినా.. ఆ తర్వాత అలసిపోయి పిల్లలు నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటారు. కనుకు వేసేలోపే మెడనొప్పి అంటూ పెద్దవాళ్ల బడి వెతుక్కుంటారు. ఇలా ఎంతో దూరం ప్రయాణించలేరు. సరదాగా సాగాల్సిన టూర్ అనారోగ్యాలతో పూర్తవుతుంది. అలా కాకుండా ఉండాలంటే ఈ దిండ్లు ఉండాల్సిందే. సీట్‌బెల్ట్‌లా.. కారు సీటు బెల్ట్‌కు ఈ దిండును



తొడిగే వీలుంటుంది. లేదా స్ట్రాప్‌తో అటాచ్ చేయుచ్చు. పిల్లలు కూర్చున్న వెంటనే దిండు తొడిగిన బెల్ట్ వేస్తే చాలు. కదలకుండా ఉంచడమే కాదు. మెత్తగానూ అనిపించే ఈ దిండు తల్లి వద్ద ఉన్న అనుభూతిని అందిస్తుంది. ఎటువంటి అసౌకర్యం లేకుండా చిన్నారులు హాయిగా నిద్రలోకి జారుకుంటారు. వీటిలో కొన్ని చిన్నారులకు భుజం నుంచి పొట్ట చుట్టూతా వచ్చేలా పొడవుగా ఉండే రకాలున్నాయి. రకరకాల జంతువుల బొమ్మల ఆకారాల్లోనూ, ఆకర్షణీయమైన రంగుల్లోనూ ఇవి లభ్యమవుతున్నాయి. అలాగే మరికొన్ని మెడ వరకు మాత్రమే వచ్చేలా అర్ధచంద్రాకారంలో తలకు మాత్రం సపోర్ట్ ఇస్తాయి. ❑



# టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ కెప్టెన్‌గా పాట్ కమిన్స్

## భారత్ నుంచి యశస్వి, బుమ్రాలకు చోటు

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 ఫైనల్ మ్యాచ్ ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు లండన్‌లోని లార్డ్స్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌తో డబ్ల్యూటీసీ మూడో సైకిల్ ముగుస్తుంది. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు టెస్టు ఛాంపియన్ షిప్ కోసంపోటీపడనున్నాయి. ఈనేపథ్యంలో క్రికెట్‌ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ 20 23 -25 టీమ్ ఆఫ్‌ది టోర్నమెంట్‌ను ప్రకటించింది. మూడో సైకిల్‌లో రాణించినఆటగాళ్లతో కూడిన ఎలెవన్‌ను ప్రకటించింది. ఈ జట్టును ప్రక టించేందుకు కేవలం ఆటగాళ్ల గణాంకాల పైన మాత్రమే ఆధారపడలేదు. వివిధ పరిస్థితుల్లో ఆటగాళ్లు చూపిన ప్రదర్శన ఆధారంగా జట్టును ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ జట్టులో భారత్ కు చెందిన ఇద్దరు ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. ఇందులో ఒకరు యువఆటగాడు యశస్వి జైస్వాల్ కాగా, రెండోఆటగాడు బుమ్రాకావడం విశేషం. డబ్ల్యూటీసీ మూడోసైకిల్‌లో జైస్వాల్ 19 టెస్టులు ఆడి 1798 పరుగులు చేశాడు. ఇందులో 4శతకాలు, 10 అర్ధశతకాలు ఉన్నాయి. మరోవైపు బుమ్రా 15 టెస్టులు ఆడి 77వికెట్లు తీశాడు. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో 32 వికెట్లు పడ గొట్టాడు. ఆస్ట్రేలియాకు చెందిన పాట్‌కమిన్స్ కెప్టెన్‌గా ఎంపిక అయ్యాడు. ఆసీస్‌కే చెందిన ఉస్మాన్ ఖవాజా, అలెక్స్ కేరీలు కూడాజట్టులో చోటుదక్కించుకున్నారు. న్యూజిలాండ్ నుంచి కేన్ విలిమయ్సన్, మాట్ హెన్రీలు చోటు దక్కించుకోగా ఇంగ్లాండ్ నుంచి జోరూట్, హ్యారీ బ్రూక్‌లు అవకాశం దక్కించుకున్నారు. శ్రీలంక నుంచి కమిందు మెండిస్,పాకిస్థాన్ నుంచి నోమన్ అలీలు జట్టులో చోటు దక్కించుకున్నారు. క్రికెట్ ఆస్ట్రేలియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 2023-25 టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ జట్టులో పాట్ కమిన్స్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఉస్మాన్ ఖవాజా, కేన్ విలియమ్సన్, జో రూట్, హ్యారీ బ్రూక్, కమిందు మెండిస్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, మాట్ హెన్రీ, నోమన్ అలీ, కగిసో రబాడను 12వ ఆటగాడిగా తీసుకుంది.



### ఆర్చరీ మహిళల ప్రపంచ కప్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ టీమ్

## రికర్వ్ ఈవెంట్‌లో మిశ్రమ ఫలితాలు

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3 లో మధుర ధమన్ గోంకర్ తన అద్భుతమైన పరుగును కొనసాగించింది, కాంపౌండ్ మహిళల అర్హత రౌండ్‌లో నాల్గవ స్థానంలో నిలిచింది, గురువారం జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించడంతో భారత్ మూడవ సీడింగ్‌ను సాధించడానికి మరియు క్వార్టర్ ఫైనల్స్‌కు నేరుగా ప్రవేశించడానికి సహాయపడింది. మూడేళ్ల తర్వాత గత నెలలో అంతర్జాతీయ సర్క్యూట్‌లోకి అద్భుతంగా పునరాగమనం చేసిన మధుర, షాంఘై స్టేజ్ 2లో అభిషేక్ వర్మతో కలిసి వ్యక్తిగత స్వర్ణం, మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం మరియు మిక్స్‌డ్ టీమ్ కాంస్యంతో మూడు పతకాలను గెలుచుకుంది. అంటాల్యలో, ఆమె దక్షి ణ కొరియాకు చెందిన హాన్ సెంగ్యోన్ (603) కంటే కేవలం మూడు పాయింట్లు వెనుకబడి ఉంది. ఆమె టాప్‌ఫోర్ ఫినిషింగ్‌తో, మధుర వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్ యొక్క రెండవ రౌండ్‌లో కూడా బై పొందింది. పోటీలో ఉన్న ఇతర భారతీయ మహిళలలో, చికిత్స తనిపర్తి 11వ స్థానంలో నిలిచి తర్వాతి స్థానంలో నిలిచింది, అయితే బహుళ ప్రపంచ కప్ బంగారు పతక విజేత జ్యోతి సురేఖ వెన్నం స్వల్ప ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో 19వ స్థానంలో నిలిచింది. ఇక పురుషుల కాంపౌండ్ విభాగంలో, భారత్ జట్టు ఈవెంట్‌లో ఐదవ స్థానాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత అర్హతలో రిషబ్ యాదవ్ భారత త్రయంలో అత్యుత్తమంగా 13వ స్థానంలో నిలిచాడు, అనుభవజ్ఞుడైన అభిషేక్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఓజాస్ డియోటలే వరుసగా 29వ మరియు 34వ స్థానాల్లో నిలిచారు. కాగా భారత్‌కు రికర్వ్ ఈవెంట్‌లు మిశ్రమ ఫలితాలను వచ్చాయి. పురుషుల అర్హత రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర 13వ స్థానంలో, అతాను దాస్ 15వ స్థానంలో, గత ప్రపంచ కప్ దశలో కాంస్యం గెలిచిన పార్థ్ సలుంఖే 26వ స్థానంలో నిలిచారు, జట్టు ఐదవ ర్యాంకింగ్‌తో ముగిసింది. అయితే భారత మహిళల రికర్వ్ ఆర్చర్లు ఇబ్బంది పడ్డారు. మాజీ ప్రపంచ నంబర్ 1 దీపికా కుమారి 35వ స్థానంలో నిలవగా, అంకితా భకత్ (33వ) అత్యుత్తమ స్థానంలో నిలిచింది. సిమ్రంజీత్ కౌర్ 54వ స్థానంలో నిలిచారు, మహిళల జట్టు 12వ స్థానంలో నిలిచింది.

### చరిత్ర సృష్టించిన

# జకోవిచ్

## వరల్డ్ మూడో ర్యాంకర్‌పై గెలుపు

**న్యూఢిల్లీ:** సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్ 2025 టోర్నీలో సెమీఫైనల్ చేరి ఈ ఘనత సాధించిన అతి పెద్ద వయస్కుడిగా నిలిచాడు. పురుషుల క్వార్టర్ ఫైనల్లో 38 ఏళ్ల వయసున్న నొవాక్ జకోవిచ్ 4-6, 6-3, 6-2, 6-4తో ప్రపంచ మూడో ర్యాంకర్



అయిన అలెగ్జాండర్ జ్వెరెవ్(జర్మనీ)ని ఓడించాడు. ఈ విజయంతో జకోవిచ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో 100 విజయాలు పూర్తి చేసుకున్నాడు. రఫెల్ నాదల్ తర్వాత ఆ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా జకోవిచ్ నిలిచాడు. అంతేకాకుండా జకోవిచ్‌కు ఇది 51వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్. ఇది ఒక కొత్త రికార్డు. మూడు గంటల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ ఆరంభంలో ఇబ్బంది పడ్డాడు. తొలి సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించిన జ్వెరెవ్ 6 4తో సొంతం చేసుకున్నాడు. మొదటి సెట్ కోల్పోయిన తర్వాత జకోవిచ్ తన ఆటను మెరుగుపర్చుకున్నాడు. అద్భుతమైన డ్రాప్ షాట్స్, బలమైన డిఫెన్స్‌తో జ్వెరెవ్‌ను ఇబ్బంది పెట్టాడు. జకోవిచ్ తన అనుభవాన్ని ఉపయోగించి మ్యాచ్‌పై పట్టు సాధించాడు. కీలక సమయాల్లో బ్రేక్ పాయింట్లను మార్చుకోవడంలో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏస్‌లతో పాటు 42 విన్నర్లు కొట్టాడు. 29 తప్పిదాలు చేసిన అతడు 35 డ్రాప్ షాట్స్ ఆడి 121 పాయింట్స్ సొంతం చేసుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్ 4 ఏస్‌లు, 38 విన్నర్స్ కొట్టాడు. 44 అనవసర తప్పిదాలు చేసిన జ్వెరెవ్ 12 డ్రాప్ షాట్స్ మాత్రమే ఆడి 101 పాయింట్స్ సాధించాడు.



### ఇండోనేసియా ఓపెన్‌లో..

# సింధు, ట్రీసా-గాయత్రీ ఔట్

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్-2025 టోర్నమెంట్ నుండి భారత క్రీడాకారిణి పివి సింధు వైదొలగింది. గురువారం జరిగిన రౌండ్ ఆఫ్ 16లో థాయిలాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్ చేతిలో ఓడిపోవడంతో సింధు ఇండోనేషియా ఓపెన్ 2025 నుండి నిష్క్రమించక తప్పలేదు. ఈ టోర్నీమెంట్‌లో సింధు ఉత్సాహంగా ఆరంభించి, 10-16తో వెనుకబడినప్పటి నుండి కోలుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. అయితే, చోచువాంగ్ రెండవ గేమ్‌లో ధీటుగా స్పందించి, 21-10తో ఆధిక్యాన్ని ముగించే ముందు 10 పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

నిర్ణయాత్మక జట్టు చాలా వరకు హోరాహోరీగా సాగింది, కానీ చివరి దశలో చోచువాంగ్ ఆడి మ్యాచ్‌ను 21-18తో ముగించింది. ఇక మహిళల డబుల్స్ ద్వయం ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ 16వ రౌండ్ దశలో జపాన్‌కు చెందిన యుకీ ఫుకుషిమా మరియు మయు మట్సుమోటో చేతిలో 13-21, 22-24 తేడాతో ఓడిపోయారు.

### వాలీబాల్ నేషన్స్ లీగ్‌లో

# ఛాంపియన్‌గా ఇరాన్



## 3-0తో భారత్ క్లీన్ స్వీప్

**న్యూఢిల్లీ:** పురుషుల నేషన్స్ లీగ్-2025 టోర్నీ ఫైనల్లో ఇరాన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన ఫైనల్‌లో టాప్ సీడ్ ఇరాన్‌వరుస గేమ్‌లతో విజయం సాధించి భారత్‌ను క్వీన్ స్వీప్ చేసింది. దీంతో భారత్ 0-3 తేడాతో ఓటమి పాలైంది. ఉజ్బెకిస్తాన్‌లోని ఫెర్గానాలో జరిగిన సిఎవిఎ నేషన్స్‌లీగ్ ఫైనల్‌లో భారత పురుషుల వాలీబాల్ జట్టు ప్రచారం ముగిసింది. చాలా ఉన్నత ర్యాంక్‌లో ఉన్న ఇరానియన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ప్రపంచ 15వ ర్యాంక్‌లో ఉన్న టాప్ సీడ్ ఇరానియన్ జట్టు, రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ ఈవెంట్‌లో ఆడుతున్న అనుభవం లేని భారత జట్టుపై 25 -17, 25-20, 25-19 సునాయాసంగా విజయం సాధించింది. కాగా గ్రూప్ దశలో భారత్ ఇరాన్‌పై విజయం సాధించింది. కానీ ఈసారి ఆసియాలో రెండవ అత్యుత్తమ జట్టుకు పెద్దగా సవాలు విసరలేకపోయింది, నెట్‌లో వారి అనేక డిఫెన్సివ్ బ్లాక్‌లను పూర్తి చేయడంలో విఫలమైంది. అన్‌సీడెడ్ జట్టు అయినప్పటికీ, భారతదేశం తన తొలి ప్రచారాన్ని పూర్తిగా ఉపయోగించుకుంది. రెండవ దశలో పాకిస్తాన్ మరియు కజకిస్తాన్‌పై గట్టి విజయాలు సాధించడంతో సహా వరుసగా నాలుగు విజయాలతో ఫైనల్‌కు చేరుకుంది. సీనియర్ పోటీలు ముగియడంతో, అందరి దృష్టి ఇప్పుడు సిఎవిఎ అండర్ 16 బాలుర వాలీబాల్ ఛాంపియన్ షిప్ మరియు యు19 పురుషుల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ వైపు మళ్లుతుంది. ఈ రెండూ జూన్ 10న తాష్కెంట్‌లో ప్రారంభమవుతాయి. అండర్ 16 ఈవెంట్‌లో ఆరు జట్లు పాల్గొంటాయి. కజకిస్తాన్, పాకిస్తాన్, ఇరాన్, కిర్గిజ్స్తాన్, అండర్ 19 పోటీలో భారత్, ఇరాన్, కిర్గిజ్స్తాన్ పాల్గొంటాయి.

# బ్రిటానియా ఫ్యాక్టరీ మూసివేత, కారణాలు

**ముంబై, జూన్ 5:** బ్రిటానియా ఇండస్ట్రీస్. ఇది దాదాపు 132 సంవత్సరాలుగా భారతదేశంలోని ప్రతి ఇంట్లో తెలిసిన పేరు. బిస్కెట్ల వంటి అత్యంత ప్రాథమిక ఆహార పదార్థాల ఉత్పత్తిలో భారత దేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడమే కాకుండా, దేశంలోని మొట్టమొదటి ఎఫ్ఎంసిజి కంపెనీలలో ఇది ఒకటి. కానీ కోర్టు, మూడు దశాబ్దాలకు పైగా బిస్కెట్లు తయారు చేసిన బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిఐఎల్) కంపెనీని మూసి వేయడానికి అనుమతి ఇచ్చింది. ఫిబ్రవరి 17, 2023 నాటి హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా హరి నగర్ షుగర్ మిల్స్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎంఎల్) దాఖలు చేసిన అప్పీల్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ మరియు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఈ తీర్పు ఇచ్చారు. హెచ్ఎస్ఎంఎల్ గతంలో తన ఉద్యోగులకు రూ.10 కోట్లు గుడ్‌విల్‌గా ఇవ్వడానికి ముందుకొచ్చింది. కానీ కోర్టు ఈమొత్తాన్ని రూ.15కోట్లకు పెంచింది.



నేడు భారతదేశం నుండి పెద్ద మొత్తంలో బిస్కెట్లు కూడా ఎగుమతి అవుతున్నాయి. ఇప్పుడు బ్రిటానియాఇండస్ట్రీస్ దాని పురాతన కర్మాగారాలలో ఒక దాన్ని మూసివేయబోతోంది. దీనికి దేశ స్వాతంత్రంతో సంబంధం కూడా ఉంది. ముంబై హైకోర్టు నిర్ణయాన్ని కొట్టివేస్తూ సుప్రీం ఎనిమిది వారాల్లోపు చెల్లించాలని కూడా కోరింది. ఈ కంపెనీని మూసి వేయడం వల్ల కొంతమంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉందని, మరికొందరు ఎటువంటి తప్పు లేకుండా నిరుద్యోగులుగా మారే అవకాశంఉందని పరిగణనలోకి తీసుకుని హెచ్ఎస్ఎంఎల్ తీసుకున్న ఈ చర్యను మేము అభినందిస్తున్నాము. అలాంటి ప్రకటనలు రికార్డులో నమోదు చేసినట్లు కోర్టు పేర్కొంది. హెచ్ఎస్ఎంఎల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, గుడ్‌విల్ మొత్తాన్ని పెంచడంపై నిర్ణయం తీసుకునే బాధ్యతను కోర్టుకే వదిలేశారు. అప్పీలుదారుల ఆఫర్‌ను రూ.5 కోట్లు పెంచడం న్యాయమైనదని తాము భావిస్తున్నామని తెలిపింది. అందువల్ల, మా ఆర్డర్‌లో ఆ మొత్తం రూ.10 కోట్లకు బదులుగా రూ.15 కోట్లు అవుతుంది. మొత్తాన్ని విడుదల చేయడానికి ఎనిమిది వారాల కంటే ఎక్కువ సమయం పట్టకూడదని సూచించింది.

# ఆర్‌బిఐ రేట్ల కోత అంచనాలతో సూచీల్లో లాభాలు

**ముంబై, జూన్ 5:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందన్న అంచనాలతో సూచీలు రాణించాయి. ఐటీ, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోలుదారులుగా నిలవడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడేలో 800 పాయింట్లు మేర రాణించింది. సెన్సెక్స్ ఉదయం 81,196.08 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచీ ఇంట్రాడేలో 81,911.13



వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 443 పాయింట్ల లాభంతో 81,442 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,899 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 130 పాయింట్ల లాభంతో 24,750 వద్ద ముగిసింది. ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.10 డాలర్ల వద్ద ట్రేడగగా, బంగారం ఔన్సు 3,413 డాలర్ల వద్ద కొనసాగింది.

# పన్నుల చెల్లింపుల్లో అదానీ రికార్డు

**ముంబై, జూన్ 5:** దేశీయ పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ రికార్డు సృష్టించింది. లిస్టెడ్ సంస్థల పోర్ట్‌ఫోలియో ద్వారా 2025 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 74,945 కోట్ల రూపాయల పన్నులను చెల్లించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం 2023 24తో పోల్చుకుంటే 29 శాతం అధికం. ఆ ఆర్థిక సంవత్సరంలో అదానీ గ్రూప్ మొత్తం 58,104 కోట్ల రూపాయల మేర పన్నులు చెల్లించగా, ఇప్పుడీ మొత్తం 74,945 కోట్ల రూపాయలకు చేరింది. ఈ మొత్తం దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పర్చడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో అదానీ గ్రూప్ ఏ స్థాయిలో భాగస్వామ్యం వహిస్తోందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ 74,945 కోట్ల రూపాయల్లో ప్రత్యక్ష పన్నుల వాటా 28,720 కోట్ల రూపాయలు. పరోక్ష పన్నుల వాటా 45,407 కోట్ల రూపాయలు. ఇతరత్ర పన్నుల మొత్తం 818 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. పన్నుల చెల్లింపులో రికార్డు సృష్టించిన అదానీ కోట్లాది మంది ప్రజలకు మోలిక సదుపాయాలను కల్పిస్తుంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించడానికి అవసరం అయ్యే ఖర్చుతో దాదాపుగా ఇది సమానం. ఆధునిక ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి కూడా ఈ మొత్తం దాదాపు సరిపోతుంది. అలాగే కోట్లాది మంది ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో జీవనాడిగా నిలుస్తుందని అదాని గ్రూప్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అదానీ గ్రూప్ పబ్లిక్ లిస్టెడ్ సంస్థల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ సిమెంట్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్.. ఈ పన్నుల చెల్లింపుల్లో కీలకంగా మారాయి. పన్నుల రూపేణా వేల కోట్ల రూపాయల మేర నిధులను ప్రభుత్వ ఖజానాకు సమకూర్చాయి. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మౌలిక సదుపాయాలు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ లిమిటెడ్, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్, అదానీ పవర్ లిమిటెడ్, అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్, అంబుజా సిమెంట్స్‌తో పాటు ఎన్డీటీవీ, ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్ కూడా పన్నులు చెల్లించిన లిస్టెడ్ సంస్థల జాబితాలో ఉన్నాయి. ఈ గ్రూప్.. తన ఏడు సంస్థల వెబ్‌సైట్లలో బేసిస్ ఆఫ్ ప్రిపరేషన్ అండ్ అప్రోచ్ టు ట్యాక్స్ అనే పేరుతో ఓ డాక్యుమెంట్‌ను అందుబాటులో ఉంచింది. పన్నుల చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇందులో పొందుపరిచింది. ప్రపంచవ్యాప్తంగా పోర్ట్‌ఫోలియో కంపెనీలు కొనసాగించే వ్యాపార, వాణిజ్య లావాదేవీల ద్వారా వచ్చే పన్నులు, సుంకాలు, ఇతర ఛార్జీలను ప్రత్యక్ష పన్నుల జాబితాలో చేర్చిందీ సంస్థ. ఇతర స్టేక్ హోల్డర్ల నుంచి సేకరించిన పోర్ట్‌ఫోలియో కంపెనీలకు సంబంధించిన మొత్తం చెల్లింపులను ఇండైరెక్ట్ ట్యాక్సుల్లో కలిపింది. అదానీ గ్రూప్ పన్ను పార



దర్శకతను సంస్థ కార్యకలాల్లో కీలకంగా పరిగణిస్తోంది. పన్నుల చెల్లింపుల ద్వారానే దేశంలో మోలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తోన్నామని పేర్కొంది. సకాలంలో పన్నుల చెల్లింపు తమ సంస్థ పారదర్శకత, దేశ సమగ్రాభివృద్ధిలో చిత్తశుద్ధికి అద్దం పడుతోందని వెల్లడించింది.

# ఎఐతో ఉద్యోగాలు పోవడం కంటే అదే డేంజర్: డీప్ మైండ్ సిఇఒ

**వాషింగ్టన్, జూన్ 5:** కృత్రిమ మేధ (ఎఐ) ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. టెక్ ప్రపంచంలో సంచలనాలు సృష్టిస్తోంది. దీని రాకతో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. సర్వం ఎఐ మయమవుతుందన్న వాదనలు వినిపిస్తున్న వేళ ఈ సాంకేతికతపై గూగుల్ డీప్‌మైండ్ సిఇఒ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. కృత్రిమ మేధ దుర్వినియోగంపై డెమిస్ ఆందోళన వ్యక్తం చేశారు. మనుషుల ఉద్యోగాలను ఎఐ భర్తీ చేస్తుందనే విషయం తనకు ఆందోళన కలిగించడం లేదని ఆ సాంకేతికత చెడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తేనే అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిమాణాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు. అయితే ఈ శక్తివంతమైన సాంకేతికతను ఉపయోగించి అద్భుతమైన పనుల్ని సజావుగా నిర్వహించవచ్చని తెలిపారు. ఎఐ వల్ల ఎంట్రీ లెవల్ వైట్-కాలర్ ఉద్యోగాలు తగ్గుముఖం పడతాయని డెమిస్ అన్నారు. సాధారణ పనుల్ని ఎఐ చేయడంతో మానవులు మరింత ముఖ్యమైన పనులపై దృష్టిపెట్టగలరని తెలిపారు. అప్పుడు మరింత నైపుణ్యంతో కూడిన ఉద్యోగావకాశాలు వస్తాన్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఎఐ శక్తి, వినియోగం పెరిగేకొద్దీ దాని దుర్వినియోగాన్ని ఆపేందుకు ప్రపంచవ్యాప్తంగా సహకారం అవసరమన్నారు.



# వాణిజ్యం

### మార్కెట్లో

## టాటా వర్సెస్ హ్యుండాయ్

**ముంబై, జూన్ 5:** టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్ బ్యాక్ 2025 ఆల్ట్రోజ్ రిఫ్రెష్ చేసింది. ఈ ప్రీమియం కారు రూ.6.89లక్షల నుంచి రూ.11.49 లక్షల (ఎక్స్‌షోరూమ్) ప్రారంభధరలతో అందుబాటులో ఉంది. ఈ అప్డేట్ ఆల్ట్రోజ్‌ను ఈ విభాగంలోని కీలక పోటీదారులైన హ్యుందాయ్ ఐ20, మారుతి బాలెనో మరియు టయోటా గ్లాంజాతో పోటీ పడేలా చేసింది. ధర, సెగ్మెంట్ ప్లేస్మెంట్ పోల్చదగినవి అయినప్పటికీ ఫేస్లిఫ్ట్ ఆల్టోజ్ ఆకర్షణను విస్తృతం చేయడంలో సహాయపడ టానికి మరిన్ని ఫీచర్లు, విస్తృత శ్రేణి పవర్ ట్రెయిన్ ఎంపికలను అందిస్తుంది. ఈ నేపథ్యంలో ఆల్ట్రోజ్ కారుకు హ్యూందాయ్ ఐ20తో కార్ల మధ్య ప్రధాన తేడాలను చూద్దాం. 2025 ఆల్ట్రోజ్ లుక్‌లో మాత్రం పెద్దగా మార్పు లేదు. ఫ్లష్‌టైప్ డోర్ హ్యాండిల్స్ అవుటర్ లుక్‌కు ఆధునిక, అధునాతన రూపాన్ని ఇస్తున్నాయి. ఈ కారు వెనుక కనెక్ట్ చేసిన ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్‌ను ఆధునిక టచ్‌ను అందిస్తాయి. ఈ కారు ఫ్రంట్ ఎండ్ లైటింగ్లో కూడా అప్ గ్రేడ్‌తో వస్తుంది. ఆటో



మేటిక్ ఎల్ఈడీ హెడ్‌లైట్‌లు, ఎల్ఈడీ ఫాగ్ లాంప్‌లు కార్నరింగ్ ఫంక్షన్‌తో ఆకట్టుకుంటుంది ఈ రెండు అప్‌గ్రేడ్‌లు ఫ్రంట్ ఎండ్ స్టైలింగ్‌ను మెరుగుపరుస్తాయి. ఆటోఫోల్డింగ్ అవుట్ సైడ్ మిర్రర్లు, 16 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్ కూడా వాహనానికి సంబంధించిన కర్బ్ సైడ్ ఆకర్షణకు సహాయపడతాయి. అందువల్ల ఆల్టోజ్ సెగ్మెంట్‌లోని మరింత విలాసవంతమైన హ్యాచ్‌బ్యాక్‌లతో పోటీపడడానికి ఉన్నత స్థాయి అనుభూతిని ఇస్తుంది. 2025 టాటా ఆల్టోజ్, హ్యుందాయ్ 20 ఫీచర్లలో దగ్గరగా సరిపోతాయి. అయితే కొన్ని కీలక అంశాలలో విభిన్నంగా ఉంటాయి. అవుటర్ వ్యూలో రెండూ ఎల్ఈడీ హెడ్‌లైట్లు, డీఆర్ఎల్‌లు, అల్లాయ్‌వీల్స్, ఆటో ఫోల్డింగ్ ఓఆర్‌వీఎంలతో వస్తాయి. ఆల్టోజ్ కార్నరింగ్, కనెక్టెడ్ టెయిల్ లైట్లు, ఫ్లష్‌టైప్‌డోర్ హ్యాండిల్స్ ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్లతో ఆకట్టుకుంటుంది. అయితే ఐ20లో పుడిల్ ల్యాంప్‌లతో ఆకట్టుకుంటున్నాయి. ఇంటీరియర్ విషయానికి వస్తే ఆల్టోజ్‌లో బ్లాక్‌బీజ్ థీమ్, ఫ్యాబ్రిక్ అప్హోల్స్టరీ, మల్టీ కలర్ యాంబియంట్ లైటింగ్, టచ్‌బేస్డ్ ఏసీ ప్యానెల్‌తో కూల్డ్ గ్లోబ్బాక్స్‌లతో ఆకట్టుకుంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.